సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 320

గురువారం 3-8-2023



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'




భారత్ బలప్రదర్శన
విండీస్‌తో జరిగిన చివరి వన్డేలో భారీ విజయం.. 2–1తో సిరీస్ కైవసం - 12లో



బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు పెరిగారు
117 కోట్ల టెలికాం చందాదార్లు.. మొబైల్ సబ్‌స్క్రైబర్లు 114 కోట్లు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బలగాల్ని రంగంలోకి దింపండి
హరియాణాలో మత ఘర్షణల నేపథ్యంలో ఢిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.
వివరాలు 6లో ▸



మహిళలతో ప్రపంచ పురోగతి
మహిళల ఆర్థిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని.. వాళ్లు సంపన్నులైతే ప్రపంచం సుసంపన్నమవుతుందని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



కునోలో మరో చీతా మృతి
మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్కులో ధాత్రి అనే ఆడ చీతా మరణించింది. దీంతో మరణించిన చీతాల సంఖ్య తొమ్మిదికి చేరింది.
వివరాలు 6లో ▸



ఈశ్వరన్‌కు మరో ఎదురుదెబ్బ
అవినీతి ఆరోపణలున్న చంద్రబాబు పార్టనర్, సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌కు వేతన చెల్లింపుల్లో ఆ దేశ ప్రధాని భారీ కోత విధించారు.
వివరాలు 6లో ▸

'సంపూర్ణ' ఆరోగ్యం

ఆరోగ్యవంతమైన భావి తరాల కోసం ఖర్చుకు వెనుకాడకుండా పౌష్టికాహారం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ ఇక మరింత బలోపేతం: సీఎం జగన్

- గర్భిణులు, బాలింతల కోసం 'టేక్ హోం రేషన్'.. సరుకుల నాణ్యతపై నిరంతర పరిశీలన
- గత ప్రభుత్వం ఏటా విదిల్చింది రూ.500 కోట్ల లోపే.. ఇప్పుడు ఏకంగా రూ.2,300 కోట్లు
- రక్తహీనత, పౌష్టికాహారలేమి పూర్తిగా తొలగిపోవాలన్న లక్ష్యంతో ఇంత ఖర్చు చేస్తున్నాం
- ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలన్నీ సత్ఫలితాలనిచ్చేలా అధికారులు శ్రద్ధ చూపాలి
- ఫౌండేషన్ స్కూళ్లలో చిన్నారులకు బోధనపై ప్రత్యేకంగా దృష్టి.. ప్రత్యామ్నాయ విధానాల పరిశీలన
- చిన్నారులకు ఇంగ్లిష్‌లో పరిజ్ఞానం, ఉచ్చారణ బాగుండేలా తగిన చర్యలు తీసుకోవాలి
- టేక్ హోం రేషన్ పంపిణీ ప్రారంభం.. సీఎం చేతుల మీదుగా డ్రై రేషన్ అందుకున్న గర్భిణులు, బాలింతలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ 'టేక్ హోం రేషన్' కిట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఆరోగ్యవంతమైన భావి తరాల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. డబ్బులకు వెనుకాడకుండా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఖర్చు చేస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. డ్రై రేషన్ కింద అందించే సరుకుల నాణ్యతను నిరంతరం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫౌండేషన్ స్కూళ్లలో చిన్నారుల బోధనపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆంగ్ల భాషలో పరిజ్ఞానం, ఉచ్చారణ బాగుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించి లబ్ధిదారులకు స్వయంగా సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో ▶



రూ.650 కోట్లతో కడప స్టీల్‌కు మౌలిక వసతులు

ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు

- జాతీయ రహదారిని కలుపుతూ రూ.90 కోట్లతో 4 లేన్ల రహదారి.. ఇప్పటికే చురుగ్గా సాగుతున్న పనులు
- రూ.127 కోట్లతో ప్లాంట్‌కు నీటి వసతి
- రూ.324 కోట్లతో ఎర్రగుంట్ల–నంద్యాల రైల్వే లైన్‌కు అనుసంధానం
- రూ.65 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- పర్యావరణ అనుమతులు రాగానే ప్రధాన ప్లాంట్ పనులు ప్రారంభించనున్న జేఎస్‌డబ్ల్యూ

సాక్షి, అమరావతి: రాయలసీమ రూపు రేఖలను మార్చే కడప స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.650 కోట్లతో కీలక మౌలిక వసతులు కల్పిస్తోంది. వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లి వద్ద రూ.8,800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఏర్పాటు చేయనున్న ఈ స్టీల్ ప్లాంట్‌లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించేలోగా.. రహదారులు, రైల్వే, విద్యుత్, నీటి సరఫరా తదితర కీలక మౌలిక వసతులను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. ప్లాంట్‌ను ఎన్‌హెచ్67కు అనుసంధానిస్తూ సుమారు రూ.90 కోట్లతో నాలుగు లేన్ల రహదారిని ఏర్పాటు చేస్తోంది. తొలి దశలో రెండు లేన్ల రహదారిగా నిర్మించి రెండో దశ నాటికి నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే రెండు లేన్ల రహదారి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని

మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్

న్యాయస్థానం నిర్ణయంపైనా 'పచ్చ'పాతమా రామోజీ?

- వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ విశాఖ ఎన్‌ఐఏ కోర్టుకు బదిలీపై వక్రభాష్యం
- విజయవాడ ఎన్‌ఐఏ కోర్టు తీర్పును అపహాస్యం చేసేలా అవాస్తవ కథనం
- న్యాయ వ్యవస్థకే దురుద్దేశాలు ఆపాదిస్తూ బరితెగింపు
- కేసు తీవ్రతను తక్కువ చేసి చూపేందుకు శక్తివంచన లేకుండా యత్నం
- ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపాలన్నదే లక్ష్యం
- ఎన్‌ఐఏ కోర్టు విశాఖలో ఉన్నప్పుడు అక్కడ విచారిస్తే మీకేంటి అభ్యంతరం?
- ఏదోలా దుష్ప్రచారం చేయడమే మీ ధ్యేయం అనేందుకు ఇదే నిదర్శనం

3లో

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బోడసకుర్రు పల్లిపాలెంలో బాధితులకు భోజన వసతి (ఫైల్)



రామోజీ.. మీ ఆకాంక్షే గాలిలో దీపం

- విపత్తుల నిర్వహణలో ఏపీ రోల్ మోడల్ అని తెలీదా?
- నాలుగేళ్లుగా ప్రభుత్వ ప్రణాళిక, సాయం మీకు కనిపించదా?
- మన విపత్తుల ప్రణాళికపై అధ్యయనం చేసిన పలు రాష్ట్రాలు
- తుపానులు, వరదలను ఎదుర్కొనే విషయంపై స్పష్టమైన ప్రణాళిక
- రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో పక్కాగా అమలయ్యేలా చర్యలు
- తద్వారా భారీగా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఈ వాస్తవాలన్నీ విస్మరించి విషం కక్కిన 'ఈనాడు'

4లో

రాష్ట్రపతి ముర్మును కలిసిన విపక్ష ఇండియా కూటమి నాయకులు



'మణిపూర్'పై ప్రకటన చేసేలా మోదీని ఆదేశించండి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు 'ఇండియా' కూటమి నేతల విజ్ఞప్తి

ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి చెందిన నేతలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో ప్రకటన చేసేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆదేశించాలని కోరారు. కల్లోల మణిపూర్‌లో శాంతి స్థాపనకు చర్యలు చేపట్టేలా చూడాలని విన్నవించారు. ఈ మేరకు 31 మంది విపక్ష నేతలు రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రం సమర్పించారు.

6లో

మణిపూర్‌పై మోదీ నోరువిప్పాలి



- పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యుల డిమాండ్
- ఉభయ సభల్లో ఆందోళనలు, నినాదాలు
- లోక్‌సభ, రాజ్యసభ గురువారానికి వాయిదా

మేం చెప్పిందే చట్టం!



- ప్రభుత్వం తమదంటూ అధికారులను బెదిరించిన 'నారాయణ'
- బినామీలు, బంధువుల పేరిట భారీగా అసైన్డ్ భూములు కాజేశారు
- అప్పటి ఏజీ, పలువురు ఐఏఎస్‌లు వారించినా లెక్క చేయలేదు
- బినామీల పేరిట కొన్న 148 ఎకరాల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.600 కోట్లకుపైనే
- నారాయణ, ఆయన కుమార్తె ఫోన్ సంభాషణల్లో ఈ వ్యవహారం బయటపడింది.. చంద్రబాబుకు సైతం భాగస్వామ్యం.. ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు అవసరం
- స్టే ఎత్తివేసి దర్యాప్తునకు అనుమతి నివ్వండి.. సీఐడీ తరఫున హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు
- పలు ఒరిజినల్ రికార్డులు, ఫోన్ సంభాషణలు సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పణ

2లో

డిజిటల్ హెల్త్ ఖాతాల్లో రెండో స్థానంలో ఏపీ

- రాష్ట్రంలో 4.10 కోట్ల మందికి డిజిటల్ హెల్త్ ఖాతాలు
- 4.29 కోట్లతో తొలి స్థానంలో యూపీ.. దేశవ్యాప్తంగా 43.01 కోట్ల మందికి ఖాతాలు
- కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడి

- వివరాలు 2లో



ఇంజనీరింగ్ కాలేజీల కనీస ఫీజు రూ.43 వేలు

నిర్ణయించిన హైకోర్టు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల విషయంలో హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇంజనీరింగ్ కాలేజీల్లో కనీస ఫీజును రూ.43 వేలుగా నిర్ణయించింది. ఇంతకు మించి ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలు ఈ ఫీజుకు అదనంగా మరో 10% ఫీజును వసూలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. తాము నిర్ణయించిన ఈ కనీస ఫీజును నోటిఫై చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ప్రవేశాలు, ఫీజు నియంత్రణ కమిషన్

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



నీ రుణం డబ్బులు ఐదు వేలు చెల్లించక పోయావో ఇల్లు జప్తు చేస్తాం! ఖబడ్దార్!

ఇల వైకుంఠపురంలో..

సంప్రదాయ వృత్తులను వదిలి వ్యవసాయం వైపు మళ్లిన యానాదులు

బీడు భూముల్లో నాగలి పట్టి ఉద్యాన పంటల సాగు

ఆ గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు

పిల్లల్ని చదివిస్తుండటంతో ఉద్యోగాల్లో ముందున్న యువత

నల్లమల అడవి అంచున గల వైకుంఠపురం ప్రత్యేకత ఇది

'ఇంట్లో దీపం వెలిగితే ఆ కుటుంబానికే వెలుగు.. అదే దీపం గుడిలో వెలిగితే ఊరంతటికీ వెలుగు' నిస్తుందని నమ్మారు ఆ ఊరి వాళ్లంతా. తూరుపు దిక్కున ప్రతి గుమ్మానికి ఆత్మ గౌరవమనే తోరణం కట్టారు. అజ్ఞానపు కట్టుబాట్లను తెంచి పడమర దిక్కున పాతేశారు. ఊరికి ఉత్తరాన అంతరాలను కట్టెలపై కాల్చేసి.. జ్ఞాన దివిటీలను గుండెల్లో వెలిగించుకున్నారు. దారికి దక్షిణాన నాగలి పట్టి పుడమి నుదుటిపై తమ జీవిత రాతలు ఎలా ఉండాలో రాసుకున్నారు. అక్షర కాంతులు నింపుకున్న ఆ గ్రామం ఇప్పుడు సామాజిక చైతన్యపు తిలకాన్ని నుదిట దిద్దుకుని కొత్త పొద్దులకు ఆహ్వానం పలుకుతోంది. పల్నాడు జిల్లా కారంపూడి మండలం నల్లమల అడవి అంచున వెలసిన గిరిజన గ్రామం వైకుంఠపురం విశేషాలను పరికిస్తే.. ప్రతి గడపా ఓ విజయగాథకు ప్రతిరూపంగా నిలుస్తోంది.



సాగులో ఉన్న వరి పంట

సాక్షి, నరసరావుపేట: ఇప్పటికీ అత్యంత వెనుకబడిన గిరిజన తెగ 'యానాదులు'. సంప్రదాయ వృత్తులకే పరిమితమైన వీరిలో అత్యధికులు చదువులకు నోచుకోక.. ఎదుగుబొదుగూ లేని జీవితాల్ని గడుపుతున్నారు. అష్టకష్టాలు పడి కొండకెళ్లి కట్టెలు కొట్టి తెచ్చి అమ్ముకోవడం.. చేపలు పట్టడం.. పొలాల వెంట తిరుగుతూ ఎలుకల్ని పట్టడం.. పంటలకు కాపలాదారులుగా ఉండటం.. కానీ.. పల్నాడు జిల్లా కారంపూడి మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని వైకుంఠపురం గ్రామానికి చెందిన యానాదులు తమ చరిత్ర గతిని మార్చుకున్నారు. కట్టెలు కొట్టిన చేతితో నాగలి పట్టారు. గ్రామం మొత్తం రైతన్నలుగా మారిపోయారు. మరో అడుగు ముందుకేసి ఉద్యాన పంటలు సైతం సాగు చేస్తున్నారు. తాగుడుకు స్వస్తి పలికి చైతన్యవంతులయ్యారు. ఊరిని మద్యనిషేధ గ్రామంగా మార్చుకున్నారు. తరతరాల నిరక్షరాస్యతను ఛేదించి

మిగతా 2వ పేజీలో ▶

ఇక వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు



వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు త్వరలో పట్టాలెక్కనున్నాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రత్యామ్నాయంగా రైల్వే శాఖ వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లను ప్రవేశపెడుతోంది. మొత్తం 400 రైళ్లు ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ లక్ష్యం. మొదటిదశలో 200 రైళ్ల తయారీకి కాంట్రాక్టును ఖరారు చేసింది. రైల్‌వికాస్ నిగమ్ లిమిటెడ్, రష్యాకు చెందిన టీఎంహెచ్ గ్రూప్‌తో కూడిన కన్సార్షియం 120 రైళ్ల తయారీ కాంట్రాక్టును దక్కించుకోగా.. టిట్లాఘర్ వేగన్, బీహెచ్ఈఎల్‌తోకూడిన కన్సార్షియం మరో 80 రైళ్లను తయారు చేయనుంది.

-14లో

క్లుప్తంగా...

దేశం కోసం పోరాడిన మహనీయుడు పింగళి

• సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి : అతి చిన్న వయస్సులోనే స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొని.. దేశం కోసం పోరాడిన మహనీయుడు పింగళి వెంకయ్య అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జాతీయ పతాక రూపకర్తగా, స్వాతంత్య్ర సమర యోధుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు అంటూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పింగళికి ఘన నివాళి



పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పార్టీ నేతలు

సాక్షి అమరావతి: భారత జాతీయపతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. భారత జాతీయ పతాకాన్ని రూపొందించడం ద్వారా తెలుగువారి కీర్తిని దేశానికి చాటి చెప్పారని కొనియాడారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పింగళి గొప్పతనాన్ని గుర్తించి వైఎస్ జగన్.. సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశారని, ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని వారిని స్వయంగా కలిసి చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన కుమార్తె సీతామహాలక్ష్మికి ఆర్థిక సా యం కూడా అందించారని తెలిపారు.నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, నాయీబ్రాహ్మ ణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ కార్యదర్శితో సిక్కి ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి: పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్‌ను ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (సిక్కి) ప్రతినిధులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పారిశ్రామిక రాయితీలను త్వరగా విడుదల చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ఆదుకోవాలని కోరారు. నూతన పారిశ్రామిక గైడ్‌లైన్స్, పారిశ్రామిక రాయితీల విడుదలపై యువరాజ్‌తో సిక్కి రాష్ట్ర అధ్యక్షుడు రాజమహేంద్రనాథ్ చర్చించారు. మంగళగిరి ఏపీఐఐసీలో జరిగిన స్టేట్ లెవల్ అలాట్మెంట్ కమిటీ మీటింగ్‌లో పాల్గొని ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

రాయచోటి 'స్పెషల్ గ్రేడ్'

సాక్షి, అమరావతి: రాయచోటి పురపాలక సంస్థ స్థాయిని పెంచుతూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులిచ్చారు. గ్రేడ్–1 మున్సిపాలిటీగా ఉన్న రాయచోటి యూఎల్బీని స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘంగా మార్చారు.

10 యూఎల్బీలకు 'ప్రత్యేక' పాలన

సాక్షి, అమరావతి: గడువు ముగిసిన 6 మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు ప్రత్యేకాధికారుల పాలనా కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. మరో 4 యూఎల్బీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది. కందుకూరు, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలు, చింతలపూడి పొదిలి నగర పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఆమదాలవలస, నర్సరావుపేట, పొన్నూరు, కావలి, అల్లూరు, బి.కొత్తకోట యూఎల్బీల్లో జూన్, జూలైతో ప్రత్యేకాధికారుల పాలనా కాలం ముగిసింది. వీటికి మరో 6 నెలలకుగాను ప్రత్యేకాధికారులను నియమించింది.

జ్యుడిషియల్ ప్రివ్యూకు 'స్వచ్ఛ' టెండర్లు

సాక్షి, అమరావతి: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చేపట్టిన పలు ప్రాజెక్టులను జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపించింది. రాజమహేంద్రవరం సమీపంలో చెత్త నుంచి విద్యుత్ తీసే ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. రూ.200 కోట్లతో పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ)లో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టుకు కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని 22 మున్సిపాలిటీల నుంచి అవసరమైన చెత్తను అందించనున్నారు. ప్రాజెక్టు పత్రాలను ఆన్‌లైన్‌లో ఉంచామని, ప్రజలు తమ అభిప్రాయాలను ఈ నెల 9 వరకు తెలియజేయవచ్చని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ వెంకట మురళి తెలిపారు. దీంతోపాటు రూ.121.78 కోట్లతో గ్రా మాల్లో పారిశుధ్య పనులకు 2,200 ట్రాక్టర్ల కొనుగోలు పత్రాలనూ జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపించామన్నారు. వీటిపై అభిప్రాయాలను www.judicialpreview.ap.gov.in, www.sac.ap.gov.in లేదా swachha-andhra2015@gmail.com కు గానీ మెయిల్ చేయాలని ఎండీ విజ్ఞప్తి చేశారు.

'సంపూర్ణ' ఆరోగ్యం



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

మహిళా శిశు సంక్షేమ కార్యకలాపాలపై సీఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలివీ..

గతంతో పోలిస్తే 5 రెట్లు అధికంగా వ్యయం

రక్తహీనత, పౌష్టికాహారలేమి రాష్ట్రంలో పూర్తిగా తొలగిపోవాలనే లక్ష్యంతో భారీగా ఖర్చు చేస్తున్నాం. గర్భిణిలు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారం కోసం గత ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.450 – రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా ఇప్పుడు ఏటా సుమారు రూ.2,300 కోట్లు వ్యయం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్ వెల్లడించారు. పౌష్టికాహారాన్ని అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ఒక్కొక్కరికీ రూ.850 చొప్పున ఖర్చు చేస్తుండగా సంపూర్ణ పోషణ ప్లస్ కోసం రూ.1,150 చొప్పున వ్యయం చేస్తున్నట్లు చెప్పారు. రక్తహీనత, పౌష్టికాహార లేమి లాంటి సమస్యలు రాష్ట్రంలో పూర్తిగా తొలగిపోవాలన్న లక్ష్యంతో ఇంత ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలన్నీ మంచి ఫలితాలనిచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

బాలికా విద్య ప్రోత్సాహ పథకాలపై అవగాహన

బాల్య వివాహాల నిరోధం, అక్షరాస్యత పెంపు, బాలికలు ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించే లక్ష్యంతో తెచ్చిన అమ్మ ఒడి, కళ్యాణమస్తు, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు ఎలా ఉపయోగపడతాయో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాలు బాల్య వివాహాలను ఎలా నిరోధిస్తాయో వివరించాలన్నారు. కళ్యాణమస్తు కింద లబ్ధి పొందాలంటే వధూవరులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధన అందుకే విధించామన్నారు. రాష్ట్రంలో వెనకబడ్డ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్లు అంగన్‌వాడీల సందర్శన తప్పనిసరి

ఫ్యామిలీ డాక్టర్లు గ్రామాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా అంగన్‌వాడీలను సందర్శించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. పిల్లలు, తల్లులు, బాలింతల ఆరోగ్యాన్ని పరిశీలించి ఏమైనా సమస్యలుంటే మంచి వైద్యాన్ని అందించాలని సూచించారు.

బోధనలో నాణ్యతకు పెద్దపీట

ఫౌండేషన్ స్కూల్ చిన్నారులకు విద్యా బోధనలో నాణ్యతకు పెద్దపీట వేయాలని సీఎం జగన్ పేర్కొన్నారు. ఇప్పుడున్న విద్యా విధానం కాకుండా ఇతర మార్గాలను కూడా పరిశీలించాలని సూచించారు. ఫౌండేషన్ స్కూల్ (పీపీ–1, పీపీ–2) పిల్లల్లో ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం, ఫొనెటిక్స్, ఉచ్చారణ లాంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిర్దేశించుకున్న సిలబస్‌ను వినూత్న బోధనా విధానాలతో నేర్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో నెలకు అందించే రేషన్ సరుకులు

- 2 కిలోలు రాగి పిండి
- 1 కేజీ అటుకులు
- 250 గ్రాముల బెల్లం
- 250 గ్రాముల చిక్కీ
- 250 గ్రాముల ఎండు ఖర్జూరం
- 1 కేజీ పప్పు
- 3 కేజీల బియ్యం
- అర లీటర్ వంటనూనె
- 25 గుడ్లు
- 5 లీటర్ల పాలు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో నెలకు అందే రేషన్ సరుకులు

- 1 కేజీ రాగి పిండి
- 500 గ్రాముల బెల్లం
- 2 కిలోలు మల్టీ గ్రెయిన్ ఆటా
- 500 గ్రాముల ఎండు ఖర్జూరం
- 500 గ్రాముల చిక్కీ
- 3 కేజీల బియ్యం
- 1 కేజీ పప్పు
- అర లీటరు వంటనూనె
- 25 గుడ్లు
- 5 లీటర్ల పాలు



అంగన్‌వాడీల్లో పరిశుభ్ర వాతావరణం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు. ఇందుకోసం క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతుల సమయంలో ఈ అంశాన్ని ప్రాధాన్యతగా పరిగణించాలని సూచించారు.

పునాది బాగుంటే పై తరగతుల్లో సాఫీగా

చిన్నారులకు మూడో తరగతి నుంచే టోఫెల్ పరీక్షకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం మొదలైందని సీఎం జగన్ చెప్పారు. ఇప్పుడు పీపీ–1 నుంచి రెండో తరగతి పిల్లల మీద దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల మెదడు గరిష్టంగా వికసించే వయసు కాబట్టి వినూత్న బోధనా విధానాల ద్వారా మంచి భాషా జ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వయసులో పునాది గట్టిగా ఉంటే పై తరగతుల్లో విద్యార్థుల ప్రయాణం సాఫీగా సాగుతుందన్నారు. మాంటిస్సోరి విద్యా విధానంపై సమావేశంలో ముఖ్యమంత్రి జగన్ చర్చించారు. అధికారులు తొలుత మాంటిస్సోరి స్కూళ్లను పరిశీలించాలని సూచించారు. సమీక్షలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉష శ్రీచరణ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ ఎండీ ఎ.బాబు, పాఠశాల విద్యాశాఖ (మౌలిక వసతుల కల్పన) కమిషనర్ కాటమనేని భాస్కర్, పౌర సరఫరాల శాఖ ఎండీ జి.వీరపాండ్యన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎ.విజయ సునీత తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ హెల్త్ ఖాతాల్లో రెండో స్థానంలో ఏపీ

రాష్ట్రంలో 4.10 కోట్ల మందికి డిజిటల్ హెల్త్ ఖాతాలు

సాక్షి, అమరావతి: ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నారు. ఓ పక్క గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతూనే, రాష్ట్ర వ్యాప్తంగా నూతన వైద్య కళాశాలలను అందుబాటులోకి తెస్తున్నారు. మరోపక్క ప్రజలకు డిజిటల్ వైద్య సేవలందించే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్ (ఆభా)ల సృష్టిలోనూ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు. దీంతో డిజిటల్ హెల్త్ అకౌంట్‌ల సృష్టిలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంట్‌లోనే వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 43.01 కోట్ల మందికి ఆభా రిజిస్ట్రేషన్లు చేశారు. రాష్ట్రాలవారీగా చూస్తే ఉత్తరప్రదేశ్ 4.29 కోట్ల అకౌంట్లతో మొదటి స్థానంలో ఉంది. 4,10,49,333 ఖాతాలతో ఏపీ రెండో స్థానంలోఉంది. 4.04 కోట్లతో మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. దక్షిణాదికి చెందిన మరే రాష్ట్రం టాప్–5లో లేదు. కర్ణాటక 2.35 కోట్ల ఖాతాలతో 8వ స్థానంలో, 98 లక్షల ఖాతాలతో తెలంగాణ 14వ స్థానంలో ఉన్నాయి.

ఇదీ డిజిటల్ ఖాతా

ఆభా అకౌంట్‌లో ప్రతి పౌరుడికి 14 అంకెల డిజిటల్ ఆరోగ్య ఐడీ ఇస్తారు. వ్యక్తి ఆరోగ్య చరిత్ర మొత్తం ఇందులో నమోదు చేస్తారు. ఎప్పటికప్పుడు ఇది అప్‌డేట్ అవుతుంటుంది. ఓపీ, ఐపీ స్లిప్పులు, వైద్య పరీక్షల ఫలితాలు, పాత చికిత్స తాలూకూ ఫైళ్లు వంటి మోతబరువు లేకుండా దేశంలో ఎక్కడి నుంచి అయినా ఒక్క క్లిక్‌తో ఆరోగ్య చరిత్ర అందుబాటులోకి తేవడానికి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం)ను కేంద్రం ప్రవేశపెట్టింది. పేపర్ రహిత సేవలు అందించడానికి వీలుగా ఈ–హాస్పిటల్ విధానాన్ని అమలు చేస్తోంది.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా..

ఏబీడీఎం అమలులో ఏపీ తొలి నుంచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్రంలో 4.81 కోట్ల మందికి ఆభాలు రిజిస్టర్ చేయడం లక్ష్యం కాగా, ఇప్పటికి 85% మందికి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. మొత్తం జనాభాలో ఆభా రిజిస్టర్ కవరేజ్ పరంగా దేశంలోనే తొలిస్థానంలో ఏపీ నిలుస్తోంది. రాష్ట్రంలోని 14,368 ఆసుపత్రులు, 20,467 మంది వైద్యులు, వైద్య సిబ్బంది ఏబీడీఎంలో రిజిస్టర్ అయ్యారు. పీహెచ్‌సీ నుంచి బోధనాస్పత్రి వరకు అన్ని స్థాయిల్లో ఈ–హెచ్‌ఆర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు డిజిటల్ వైద్య సేవలను వైద్య శాఖ అందిస్తోంది. ఏపీ విధానాలను అవలంబించాలని నేషనల్ హెల్త్ అథారిటీ అన్ని రాష్ట్రాలకు సూచించింది. మహారాష్ట్ర, తమిళనాడు అధికారులు ఏపీకి వచ్చి ఇక్కడి విధానాలను తెలుసుకుని వెళ్లారు.

ఆరోగ్య రికార్డులు పదిలం



డిజిటల్ హెల్త్ అకౌంట్ ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డులు ఆన్‌లైన్‌లో పదిలంగా ఉంటాయి. వంద శాతం పౌరులందరికీ ఆభా రిజిస్ట్రేషన్ త్వరలోనే పూర్తి అవుతుంది. ప్రభుత్వాస్పత్రుల్లో ఈ–హెచ్ఆర్ అమలు చేస్తున్నాం. ఈ విధానంపై ఆస్పత్రుల్లో అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. – జె. నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

ముఖ్యమంత్రితో ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భేటీ

- ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్ క్యాడెట్‌ల శిక్షణకు సహకారం
- మౌలిక వసతులతో కూడిన భూమి ఇచ్చేందుకు సిద్ధం: సీఎం జగన్



వీఎం రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఏపీ, తెలంగాణ) వీఎం రెడ్డి (ఎయిర్ కమోడోర్) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విపత్తు నిర్వహణలో ఎన్‌సీసీ క్యాడెట్‌ల పాత్ర, బాధ్యతలు, ప్రజలకు అవగాహన కల్పించడం, ఏపీలో ఎన్‌సీసీ విస్తరణ ప్రణాళిక వంటి అంశాలపై సీఎంతో చర్చించారు. అదనంగా 60 వేల మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లను రిక్రూట్ చేయడం ద్వారా ప్రతి జిల్లాలో ఎన్‌సీసీ క్యాడెట్‌లు అందుబాటులో ఉంటారని ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీ విద్యార్థులకు సమర్థవంతమైన శిక్షణ అందించేందుకు వీలుగా రాష్ట్రంలో సెంట్రల్ ట్రైనింగ్ అకాడమి ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. ఎన్‌సీసీకి చెందిన ఆర్మీ, నేవీ, ఎయిర్ వింగ్ క్యాడెట్‌ల శిక్షణ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలతో కూడిన భూమిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎన్‌సీసీ అసిస్టెంట్ డైరెక్టర్ కల్నల్ సంజయ్ గుప్తా, గ్రూప్ కమాండర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పర్యావరణ హిత స్టీల్ ఉత్పత్తే లక్ష్యం

- కాలుష్యాన్ని తగ్గించే దిశగా అడుగులేద్దాం
- 2030 నాటికి ముడి ఉక్కు ఉత్పత్తిని 3 రెట్లు పెంచుతాం
- పర్యావరణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్



మాట్లాడుతున్న నీరబ్‌కుమార్ ప్రసాద్

తిరుపతి అర్బన్: సరికొత్త టెక్నాలజీతో కాలుష్య నియంత్రణ దిశగా పరిశ్రమల స్థాపనకు అడుగులు వేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. బుధవారం తిరుపతి తాజ్ హోటల్లో కాన్ఫెడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రంతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల స్టీల్ ఉత్పత్తిదారులు, ట్రేడర్లు, సప్లయర్స్‌తో 'ఉక్కు భవిష్యత్ రూపొందించడం' అనే అంశంపై కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీరబ్‌కుమార్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా పర్యావరణహిత స్టీల్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. స్వల్పకాలిక ప్రణాళిక ప్రకారం 2030 నాటికి ముడి ఉక్కు ఉత్పత్తి, తలసరి వినియోగాన్ని మూడు రెట్లు పెంచడం, ఇనుము, ఉక్కు రంగం ప్రత్యక్ష కార్బన్‌డయాక్సైడ్ తీవ్రత తగ్గింపునకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మరో రెండు ప్రధాన ఉక్కు కర్మాగారాలు ఒకటి తిరుపతిలో జిందాల్ స్టీల్(2.25 ఎంటీ), రెండోది కడపలో జేఎస్‌డబ్ల్యూ(3.00ఎంటీ)లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ వరుసగా రెండో సారి ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉందన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ, హైడ్రో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎన్టీపీసీ వారితో ఒప్పందంతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల మేరకు రాష్ట్రం ముందుకు అడుగులేస్తోందని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ప్రొఫెసర్ డీసీ కిరణ్, సీఐఐ ప్రతినిధులు, పలు రాష్ట్రాల పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇల వైకుంఠపురంలో..

▶ మొదటి పేజీ తరువాయి

తొలి తరం అభ్యాసకులుగా అక్షర కాంతులు నింపుకుంటున్నారు. 25 ఏళ్లగా స్థానిక పాలనలో కూడా వారు కీలకంగా మారారు.

నాలుగు కుటుంబాలతో మొదలై..

1965 నాటికి ఇక్కడ ఒబ్బాని రంగనాయకులు, చేవూరి లక్ష్మయ్య, రావూరి అంకులు, కొమరగిరి నీలకంఠం కుటుంబాలు మాత్రమే ఉండేవి. ఆ నాలుగు కుంటుంబాలు అక్కడ సారవంతమైన భూములు ఉండటంతో పంటలు వేయడం ప్రారంభించాయి. తర్వాత కాలంలో వీరిని చూసి ఒక్కో కుటుంబం అక్కడకు చేరింది. ఇప్పుడు ఆ గ్రామంలో 310 గడపలయ్యాయి. సుమారు 952 మంది జనాభా నివాసం ఉంటున్నారు. ప్రతి ఇంటికి పొలం ఉంది. వ్యవసాయమే వారి ప్రధాన జీవనాధారం. ప్రతి చేనుకు బోరు మోటార్ ఉన్నాయి. దశాబ్దాలుగా అక్కడ మద్య నిషేధం అమలవుతోంది. అనాదిగా నల్లమల అటవీ ప్రాంతం సారా తయారీ అడ్డాగా ఉన్నా.. ఇక్కడ మాత్రం ఆ వాసనే లేదు. సారానే కాదు.. మద్యం అమ్మడం, తాగడాన్ని కూడా నిషేధించారు. గ్రామంలో నేరాలు కూడా లేవు. పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా ఉండవు. గిరిజనులు ఇలా కష్టాన్ని నమ్ముకుని ఇలలో వారి గ్రామం వైకుంఠపురం నామాన్ని సార్థకం చేసుకున్నారు.

అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో ప్రస్తుత తరంలో 154 కుటుంబాలకు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరయ్యాయి. ఇక గ్రామంలో పక్కా ఇల్లు లేని వారంటూ ఉండరు. ఏళ్లుగా బంజరు భూములను సాగు చేస్తున్న 18 మంది రైతులకు త్వరలో సాగు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామం మొత్తం దాదాపుగా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే. ఎంపీటీసీలుగా ఆ గ్రామస్తులకే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అవకాశం ఇస్తున్నారు. చలంచర్ల విశ్వనాథం, ఇండ్ల అప్పారావు, రావూరి సామ్రాజ్యం, యాకసిరి లక్ష్మి, ప్రస్తుతం చేవూరి భవాని ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. ఇప్పుడు పిల్లలందరూ చదువుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో 12 మంది స్థిరపడ్డారు. మరికొందరు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు.

వ్యవసాయదారులుగా ఎదిగాం



మా చిన్నప్పుడు చెరువు కట్ట మీద జాగాలలో పాకలు వేసుకుని ఉండేవాళ్లం. ఇప్పుడు ఊరు ఏర్పడింది. సంప్రదాయ వృత్తుల నుంచి వ్యవసాయదారులుగా ఎదిగాం. మంచి పంటలు పండిస్తున్నాం.
– చేవూరి లక్ష్మయ్య, గ్రామ పెద్ద, వైకుంఠపురం

చదువులు మొదలయ్యాయి




మా గ్రామంలో అందరికీ పొలాలున్నాయి. జీవితాలు కొంచెం మెరుగుపడగానే పిల్లలను చదివించుకోవాలనే తలంపు వచ్చింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మా అభివృద్ధికి అండగా నిలుస్తున్నారు.
– యాకసిరి లక్ష్మి, మాజీ ఎంపీటీసీ

వ్యవసాయంలో ముందడుగు వేస్తున్నాం



పత్తి, మిరప, వరి, కంది పంటలు సాగు చేస్తున్నాం. ఉద్యాన పంటలపైనా దృష్టి పెట్టాం. జామ, బత్తాయి, బొప్పాయి, మామిడి తోటలు వేశాం. మేమంతా నేల తల్లినే నమ్ముకున్నాం. రైతులుగా మారాం.
– ఒబ్బాని కనకయ్య, గ్రామస్తుడు

మేం చెప్పిందే చట్టం!



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో నిరుపేద అసైన్డ్‌దారులను బెదిరించి బినామీలు, బంధువుల పేరిట కారుచౌకగా భూములను కొట్టేసిన మాజీ మంత్రి నారా యణ అధికారులనూ బెదిరించారని సీబీడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు బుధవారం నివేదించారు. ప్రభుత్వం తమదని, తాము చెప్పిందే చట్టమని, చెప్పినట్లు చేయాలంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అప్పటి అడ్వొకేట్ జనరల్ (ఏజీ), న్యాయశాఖ, ముఖ్య కార్యద ర్శులు, ఐఏఎస్ అధికారులు వారించినా నారాయణ లెక్క చేయలేదని తెలిపారు. అసైన్డ్ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో నారాయణే కీలక సూత్రధారి అని చెప్పారు. ఆయన సమీప బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలను కొనుగోలు చేసేందుకు రూ.18.10 కోట్లు వెచ్చించి నట్లు నివేదించారు. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ.600 కోట్లకు పైనే ఉంటుందని కోర్టు దృష్టికి తెచ్చారు. అసైన్డ్ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, అంతిమంగా పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరదంటూ గత ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు భయాందోళనలు రేకెత్తించారన్నారు. అనంతరం అసైన్డ్‌దారుల నుంచి భూ ములను అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ల ద్వారా నామ మాత్రపు ధరలకు కొట్టేశారని తెలిపారు. ఆ తరువాత వాటిని ల్యాండ్ పూలింగ్ స్కీం కింద సీఆర్‌డీఏకు ఇచ్చి జీవో 41 (ల్యాండ్ పూలింగ్ స్కీం రూల్స్)ని అడ్డం పెట్టుకుని విలువైన నివాస, వాణిజ్య ప్లాట్లను పొందినట్లు తెలిపారు. కొన్నిటిని అధిక ధరలకు అమ్ముకున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ మొత్తం నేరంలో అప్పటి సీఎం చంద్రబాబు, నాటి మంత్రి నారాయణ పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయని నివేదించారు. దర్యాప్తులో సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న నారాయణ ఫోన్ లో ఆయన కుమార్తె సింధూరతో జరిపిన సంభాషణలున్నట్లు తెలిపారు. తాను అసైన్డ్ భూములను కొన్నట్లు ఆ సంభాషణల్లో నారాయణ అంగీకరించారని చెప్పారు. అసైన్డ్ భూములు తమ పేర్లతో ఉంటే ప్రభుత్వం జైల్లో వేస్తుందని నారాయణ తన కుమార్తెతో చెప్పారన్నారు. ఆ సంభాషణల తాలుకూ పెన్ డ్రైవ్ ను సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందజేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఒరిజినల్ రి కార్డులను సైతం సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించారు. ఏఏజీ వాదనలు పూర్తి కాకపోవడంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ జస్టిస్ డాక్టర్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులిచ్చారు. అసైన్డ్ భూముల బద లాయింపులో అక్రమాలపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా చంద్రబాబు, నారాయ ణ లపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీన్ని కొట్టివేయాలని కోరుతూ దాఖలైన క్వాష్ పిటి షన్లపై స్టే విధించిన కోర్టు ఇటీవల తుది విచారణ చేపట్టింది.

ఇతర టీడీపీ నేతలు కూడా..

అసైన్డ్‌దారులను బెదిరించి నారాయణ మాత్రమే కాకుండా అప్పటి అధికార పార్టీ నేతలైన రావెల కిషోర్‌బాబు, అనగాని సత్యప్రసాద్, పరిటాల శ్రీరామ్, ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు కూడా భూములను సొంతం చేసుకున్నట్లు ఏఏజీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి అసైన్డ్ భూములను తీసుకురావడం, ఆ భూముల బదలాయింపుపై అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతీలాల్ దండే, జేసీ చెరుకూరి శ్రీధర్ అభ్యంతరం తెలిపారన్నారు. ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అసైన్డ్ భూముల విషయంలో చట్టపరమైన నిబంధనలను నారాయణకు స్పష్టంగా వివరించినట్లు వారు తమ వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో స్టే ఎత్తివేసి సీఐడీ దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతినివ్వాలని అభ్యర్థించారు.

చట్టపరమైన రక్షణ ఉంది.. ప్రాసిక్యూషన్ తగదు

నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ సీఆర్‌డీఏ చట్టం కింద తీసుకున్న నిర్ణయాల విషయంలో ప్రభుత్వం, అధికారులు, అథారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి కేసులు దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. చట్టం కింద రక్షణ ఉన్నందున నారాయణను ప్రాసిక్యూట్ చేయడానికి వీల్లేదన్నారు. తమకున్న అధికారం మేరకే జీవో 41 జారీ చేశారని తెలిపారు. ఈ అధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేదన్నారు. అసైన్డ్ భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీలెవరూ ఫిర్యాదుదారులు కాదన్నారు. అందువల్ల ఆ చట్టం కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదన్నారు.

రూ.650 కోట్లతో కడప స్టీల్‌కు మౌలిక వసతులు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఎర్రగుంట్ల–నంద్యాల ప్రధాన రైల్వే లైన్‌కు ప్లాంట్‌ను అనుసంధానిస్తూ రూ.324 కోట్ల వ్యయంతో రైల్వే లైన్ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన నివేదికను ఇప్పటికే రైల్వే శాఖకు అందించగా.. ఆ శాఖకు చెందిన అధికారులు వచ్చి సర్వే పూర్తి చేశారు. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి ఈ నెలలో సూత్రప్రాయ ఆమోదం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా కోసం రూ.64.56 కోట్లతో 400 కేవీ/200 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్లాంట్‌కు అవసరమైన రెండు టీఎంసీల నీటిని ఆర్‌టీపీపీ నుంచి పైప్‌లైన్ ద్వారా తీసుకెళ్లడానికి రూ.127 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

అనుమతి రాగానే నిర్మాణ పనులు ప్రారంభం

జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ ఫిబ్రవరి 15న శంకుస్థాపన చేశారు. ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించడానికి అవసరమైన కేంద్ర పర్యావరణ అనుమతులు కోసం జేఎస్‌డబ్ల్యూ ఎదురుచూస్తోంది. గతంలో వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరు మీద జారీ చేసిన ఉత్తర్వులను.. ఈ ప్లాంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కంపెనీ జేఎస్‌డబ్ల్యూఏపీఎస్ఎల్ పేరు మీదకు మార్చాలంటూ కేంద్ర పర్యావరణ శాఖకు లేఖ రాశామని అధికారులు చెప్పారు. ఈ నెలలోనే అనుమతి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అనుమతి రాగానే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్ ఆధారంగా 2.5 మిలియన్ టన్నుల కెపాసిటీతో డైరెక్ట్ రెడ్యూస్డ్ ఐరన్ ప్లాంట్, ఏడాదికి 4 మిలియన్ టన్నుల కెపాసిటీతో పెల్లెట్ ప్లాంట్, 1,000 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ ప్లాంట్ ఫర్ డీఆర్ఐ ప్లాంట్, 3,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ ఆసక్తి వ్యక్తం చేసింది. వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు రాగానే వీటిపై కూడా తగు నిర్ణయం తీసుకుంటామని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా...

భూసర్వే వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు

జగనన్న శాశ్వత భూహక్కు, రీ సర్వే ప్రక్రియపై సీఎస్ సమీక్ష



సాక్షి, అమరావతి: జగనన్న శాశ్వత భూహక్కు రీ సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు, రీసర్వే ప్రక్రియ, నూతన కలక్టరేట్లలో సిబ్బంది నియామకం తదితర అంశాలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. రీసర్వే ప్రక్రియ ప్రగతిని అధికారులతో సమీక్షించారు. గడువు లోగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ, గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ పాల్గొన్నారు.

నెల్లూరులో ముగిసిన రొట్టెల పండుగ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సింహపురి రొట్టెల పండుగ ముగిసింది. ఐదు రోజుల పాటు లక్షలాది మంది భక్తులు బారాషహీద్ దర్గాను దర్శించుకున్నారు. స్వర్ణాల చెరువులో భక్తులు కోర్కెల రొట్టెలను పరస్పరం మార్చుకున్నారు. బుధవారం జరిగిన పండుగ ముగింపు సభలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొని పండుగ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు.

మోసపూరిత హామీలకు కేరాఫ్ చంద్రబాబు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం(చిత్తూరు జిల్లా): మోసపూరిత హామీలకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం పెనుమూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఆయన 14 ఏళ్లు సీఎంగా ఉన్నపుడు రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేశారని తెలిపారు. నిత్యం సింగపూర్ పర్యటనల పేరుతో పేదల సొమ్ము దోచుకుని దాచుకోవడానికే బాబుకు సమయం సరిపోయిందన్నారు. పోలవరం పేరు చెప్పే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. తెలుగుదేశానికి తొత్తులుగా మారిన కొన్ని ఎల్లో మీడియాలు రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని రోత రాతలతో నమ్మించేందుకు చూస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వమే టీడీపీ ప్రభుత్వంలోనే ఎక్కువ అప్పులు చేశారని నిర్ధారించిందని గుర్తు చేశారు. చంద్రబాబు అండ్ కో ఎన్ని కుట్రలు చేసిన గెలిచేది జగనన్ననే అని ధీమా వ్యక్తం చేశారు.

అబద్ధాల్లో చంద్రబాబుది ఆస్కార్ లెవెల్

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: సాగు నీటి ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు కొత్త డ్రామాలు మొదలుపెట్టారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. అబద్ధాల్లో చంద్రబాబు ఆస్కార్ లెవెల్ అని, ఆ అవార్డుకు సైతం అర్హుడేనని బుధవారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టుపై బాబు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని చెప్పారు. పోలవరాన్ని బాబు ఏటీఎంలా వాడుకున్నాడని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలందరికీ గుర్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై టీడీపీ, కొన్ని పత్రికలు చేస్తున్నది దుష్ప్రచారం మాత్రమేనని పార్లమెంట్‌లో కేంద్రమిచ్చిన జవాబుతో తేలిపోయిందని చెప్పారు. చిరంజీవి నుంచి పవన్ వరకు మెగా కుటుంబానికి బాబు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదని, కాపులను అణగదొక్కటానికి బాబు ప్రణాళికాబద్ధమైన కుట్ర చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు విషకౌగిలిలో పవన్ బందీ అయ్యాడన్నారు.

సీమ ద్రోహి బాబు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



పుంగనూరు: మూడు సార్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏ ప్రాజెక్టును చేపట్టక రాయలసీమకు ద్రోహం చేశారని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో జలయజ్ఞం ప్రారంభమైందని, పోలవరం పనులు ప్రారంభించారన్నారు. టీడీపీ పాలనలో శాశ్వత పని ఒక్కటీ చేపట్టలేదని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను సీఎం వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా పూర్తిచేస్తున్నారని చెప్పారు. విశాఖలో యాదవుల భవనానికి ఐదెకరాల స్థలం కావాలని సీఎంను కోరామని, ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. యాదవులకు ఉన్నత పదవులిచ్చి, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి యాదవులు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రిని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు సత్కరించారు.

న్యాయస్థానం నిర్ణయంపైనా 'పచ్చ'పాతమా రామోజీ?

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు విచారణ విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టుకు బదిలీపై వక్రభాష్యం

దుష్ప్రచారం చేయడంలో తనను మించిన వారు లేరంటూ ఈనాడు రామోజీ మరో అడుగు ముందుకు వేశారు. చంద్రబాబు కోసం ఏం చేయడానికైనా తగ్గేదే లేదని పదే పదే చాటుకుంటున్న రామోజీ.. తుదకు పాత్రికేయ విలువలకూ తిలోదకాలు ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు విచారణను విశాఖపట్నం ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేయడంతో ఈయన గారికి బీపీ పెరిగిపోయింది. న్యాయస్థానమైతే ఏం టనుకుంటూ తన అక్కసు వెళ్లగక్కారు. ఈ కేసును విచారిస్తోంది ఎన్ఐఏ. బదిలీ చేస్తూ తీర్పు చెప్పింది విజయవాడలోని ఎన్ఐఏ న్యాయస్థానం. బదిలీ చేసింది విశాఖలోని ఆ కోర్టుకే. ఇందులో అభ్యంతరం ఏమిటి రామోజీ? తీర్పు ఎలా ఇవ్వాలో కూడా మీరే నిర్దేశిస్తారా?


సాక్షి, అమరావతి: పచ్చ (టీడీపీ) కామెర్లు సోకిన ఈనాడు రామోజీరావు ఏనాడో పాత్రికేయ విలువలకు తిలోదకాలు ఇచ్చేశారు. చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిత్యం దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. అంతటితో ఆగక ఇప్పుడు ఏకంగా న్యాయస్థానాల నిర్ణయాలు, తీర్పులను సైతం వక్రీకరిస్తూ.. వక్రభాష్యాలు చెబుతూ.. దురుద్దేశాలు ఆపాదించేందుకూ బరితెగించారు. చంద్రబాబు కోసం ఎంతకైనా దిగజారుతామని తన దివాలాకోరుతనాన్ని మరోసారి ప్రదర్శించారు. ఇందులో భాగంగా న్యాయ వ్యవస్థ అధికార పరిధిలోకి చొరబడి మరీ న్యాయమూర్తి నిర్ణయాలకు వక్రభాష్యం చెప్పారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై 2018 అక్టోబరు 25న విశాఖపట్నంలో జరిగిన హత్యాయత్నం కేసును విశాఖపట్నం ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేస్తూ విజయవాడ ఎన్ఐఏ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును వక్రీకరిస్తూ 'ఈనాడు' సొంత వ్యాఖ్యలు చేయడం న్యాయ నిపుణులను విస్మయ పరిచింది.

న్యాయ వ్యవస్థను కించపరిచిన ఈనాడు

ఈ కేసును విశాఖపట్నం న్యాయస్థానానికి బదిలీ చేయడంపై ఈనాడు పత్రిక బుధవారం ప్రచురించిన కథనం పూర్తిగా వక్రీకరణే. వచ్చే ఎన్నికల వరకు కేసు విచారణను సాగదీసేందుకే ఆ కేసును విశాఖపట్నం ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేశారని ఈనాడు తీర్మానించేయడం న్యాయ వ్యవస్థను ప్రశ్నించడమే. రాజకీయ దురుద్దేశంతో ప్రచురించిన కథనం అది. ఏకంగా న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తూ... న్యాయ వ్యవస్థను కించపరుస్తూ కథనాన్ని ప్రచురించింది.

ఎన్ఐఏ కోరిక మేరకే విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు విచారణను సాగదీసేందుకే విశాఖపట్నం ఎన్ఐఏ న్యాయస్థానానికి కేసును బదిలీ చేశారని ఈనాడు పత్రిక ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవం. ఎన్ఐఏ దర్యాప్తు చేస్తున్న ఎన్నో కేసులు



...up and as he was ready to move, accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) went close to him and said to him "Sir you will win 160 seats in AP Assembly election". After that, accused took out a knife from the right pocket of his trousers and attacked Shri Y.S. Jagan Mohan Reddy and attempted to stab him on his neck with a sharp knife with intention to kill him and in the process inflicted an injury on the upper left arm of Shri Y.S. Jagan Mohan Reddy.

17.13.2. During custodial interrogation from 12.01.2019 to 18.01.2019, accused disclosed in the presence of independent witnesses that to execute his plan, he decided to attack Shri Y.S. Jagan Mohan Reddy using a knife generally used in the local sport of cock fighting which he had picked up in January 2018 from a cock fight venue at some place near his village in which he was a spectator.

18. CHARGE

18.1 On 25.10.2018 at about 12.45PM, accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) was present in the Lounge (adjacent to Fusion Foods restaurant) of Visakhapatnam International Airport and as per his premeditated plan, he attempted to stab Shri Y.S. Jagan Mohan Reddy on his neck with a sharp knife, with intention to kill him and in turn injured the top most part of his left arm. Thus he committed an offence under sec 307 IPC. Further as accused Janipalli Srinivasa Rao @ Chanti (A-1) also unlawfully used a weapon and committed an act of violence at the Airport, as defined in clause (ii) of section 3 of the ...

వైఎస్ జగన్‌ను హత్య చేయాలనే నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు పదునైన కత్తితో దాడి చేశాడని చార్జ్‌షీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ

న్యాయస్థానాల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్నాయి. మావోయిస్టు పార్టీ, వాటి అనుబంధ సంఘాల కేసులు, వివిధ తీవ్రవాద సంస్థల కేసులు పెండింగులో ఉండటం సమస్యగా మారింది. విజయవాడలో ఉన్న ఒకే ఒక ఎన్ఐఏ న్యాయస్థానం ద్వారా ఈ కేసుల విచారణకు ఎక్కువ కాలం పడుతుందని హైదరాబాద్‌లోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయం భావించింది. అందుకే రాష్ట్రంలో అదనంగా ఎన్ఐఏ న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని రెండేళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓ లేఖ ద్వారా కోరింది. విశాఖపట్నంలో మరో న్యాయస్థానం ఏర్పాటు చేస్తే ఎన్ఐఏ కేసుల విచారణ వేగవంతమవుతుందని చెప్పింది. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన ఎన్ఐఏ, సీబీఐలకు ఇతర రాష్ట్రాల్లో కూడా వేర్వేరు చోట్ల ప్రత్యేక న్యాయస్థానాలు ఉన్నాయి. సీబీఐకి ఆంధ్రప్రదేశ్‌లో కూడా విజయవాడతో పాటు విశాఖపట్నం, కర్నూలులో ప్రత్యేక న్యాయస్థానాలు ఉన్నాయి. అదే విధంగా ఎన్ఐఏకు విజయవాడతోపాటు విశాఖపట్నంలో కూడా ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలను విశాఖపట్నం ఎన్ఐఏ న్యాయస్థానం పరిధిలోకి చేర్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు విశాఖపట్నంలో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ ఘటన విశాఖపట్నంలో జరిగినందున ఈ కేసు విచారణను కూడా కొత్తగా ఏర్పాటైన విశాఖపట్నం ఎన్ఐఏ న్యాయస్థానానికి బదిలీ చేయాలని విజయవాడ న్యాయస్థానం నిర్ణయించింది.

ఈనాడు పైశాచిక ఆనందం

ఎవరైనా బాధితునిపట్ల సానుకూలత, సానుభూతి చూపుతారు. దాడికి పాల్పడిన వారి పట్ల ఆగ్రహం ప్రదర్శిస్తారు. కానీ ఈనాడు పత్రిక అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఈ హత్యాయత్నం కేసులో బాధితుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. కానీ ఆయనపట్ల ఈనాడు పత్రిక ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఆయన్ని అవహేళన చేయడమే కాకుండా, ఆయన్ను లక్ష్యంగా చేసుకుని కొన్నేళ్లుగా తప్పుడు కథనాలు ప్రచురిస్తూ దుష్ప్రచారం చేస్తోంది. ఇలా పైశాచిక ఆనందం పొందుతోంది. నిందితుడు ఉపయోగించిన ఆయుధం పేరును కేసుకు జోడించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని తక్కువగా చూపేందుకు కుట్ర పన్నుతోంది.

నిజాలకు పాతర.. 'ఈనాడు' ఎత్తుగడ!

కేసులో వాస్తవాలు బయట పడకూడదనే ఈనాడు ఇలా వక్రీకరిస్తూ కథనాలు ప్రచురిస్తోందన్నది స్పష్టమవుతోంది. ఎన్ఐఏ చార్జ్‌షీట్‌లో పేర్కొన్న అంశాలు ఈ సందర్భంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. నిందితుడు పథకం ప్రకారమే వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడని, మెడ భాగంలో పొడిచి.. జగన్‌ను హత్య చేయాలన్నది అతని లక్ష్యమని స్పష్టం చేసింది. చివరికి ఎడమ భుజం భాగంలోని ముఖ్యమైన ప్రాంతంలో గాయమైందని కూడా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. అంత తీవ్రమైన దాడిని తక్కువగా చేసి చూపేందుకు ఈనాడు పత్రిక దిగజారుడు కథనాలు ప్రచురిస్తోంది.

కుట్ర కోణం, సూత్రధారులపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ఈ హత్యాయత్నం వెనుక ఉన్న కుట్రను ఛేదించాలని, వెనుక ఎవరున్నారన్నది తేల్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫు న్యాయవాదులు ఎన్ఐఏను, న్యాయస్థానాన్ని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కింది అంశాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు.

- విశాఖపట్నం విమానాశ్రయంలోని రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరికి నిందితునితో ఉన్న సంబంధం ఏమిటి?
- నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావుపై గతంలో కేసు ఉన్నా సరే విమానాశ్రయంలోని రెస్టారెంట్‌లో ఉద్యోగిగా ఎలా చేర్చుకున్నారు? ఈ విషయాన్ని ఎన్ఐఏ తన చార్జ్‌షీట్‌లో పేర్కొన్న విషయం వాస్తవమే కదా!
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం విమానాశ్రయం లాంజ్‌లో ఉన్నప్పుడు కాఫీ ఇచ్చేందుకు నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావునే ఎందుకు పంపించారు?
- హర్షవర్ధన్ చౌదరికి విశాఖపట్నం విమానాశ్రయంలో రెస్టారెంట్ కాంట్రాక్టు దక్కడం వెనుక ఎవరు కీలకంగా వ్యవహరించారు?
- హర్షవర్ధన్ చౌదరి, నారా లోకేశ్ మధ్య ఉన్న సంబంధం ఏమిటి?



చంద్రబాబు అనుభవం మాటలకే పరిమితం

అభిమానికి కష్టం వచ్చినా పవన్ స్పందించరేం?: మంత్రి రోజా



నగరి(చిత్తూరు జిల్లా): చంద్రబాబు 40 యేళ్ల అనుభవం మాటలకే పరిమితమని, ఆయన విజన్ మహిళలకు న్యాయం చెయ్యడంలో ఏమైందని మంత్రి ఆర్కేరోజా ప్రశ్నించారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. నారాయణ సోదరుని భార్య తనను నారాయణ వేధిస్తున్నాడని ఆధారాలు చూపినా, తాను పవన్‌కళ్యాణ్ అభిమానినని తనకు న్యాయం చెయ్యాలని కోరినా పవన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఎలక్షన్ ఫండ్, పవన్‌కు ప్యాకేజీ ఇస్తున్నారు కనుకే వారు నారాయణ తప్పుల గురించి స్పందించడం లేదని ఆరోపించారు.

బాబు, పవన్‌ల నుంచి ఏపీకి విముక్తి కావాలి: సీదిరి



కాశీబుగ్గ: ఏపీకి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నుంచి విముక్తి కావాలని మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు వస్తే చంద్రబాబు మొసలికన్నీరుతో రెడీ అయిపోతారని, అందుకే జలాశయాలు సందర్శిస్తున్నారన్నారు. రూ.16 వేల కోట్లతో 44,000 ప్రభుత్వ బడులను ఆధునికీకరిస్తున్నామని పవన్‌కు సిగ్గుంటే సొంత ఊరు మొగల్తూరు వెళ్లి ప్రభుత్వ బడులు చూడాలని సూచించారు. చంద్రబాబుకు దమ్ముంటే ఆయన హయాంలో వైద్యం కోసం చేసిందేంటో చెప్పాలని ప్రశ్నించారు.

9 నుంచి 'నేలతల్లికి నమస్కారం.. వీరులకు వందనం'

సాక్షి, అమరావతి: కేంద్రం చేపట్టిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా 9 నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లోనూ, మండల ప్రధాన కార్యాలయాల వద్ద 'నా భూమి–నా దేశం','నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఆ ప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ వంటి రక్షణ రంగ విభాగాల్లో పనిచేస్తూ మరణించినవారి పేర్లతో ప్రతి గ్రామంలో 9కల్లా శిలాఫలకాలు ఏర్పాటు, 10న అమరవీరులను గుర్తు చేసుకుంటూ ప్రతిజ్ఞ, 11న ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 75 మొక్కలు నాటాలి. 14న వీరులకు వందనం పేరుతో ఆ గ్రామ పంచాయతీ పరిధిలో జీవించి ఉన్న స్వాతంత్ర్య సమర యోధులు, పదవీ విరమణ చేసిన రక్షణ విభాగాల సిబ్బందితో పాటు మరణించిన సమరయోధుల కుటుంబసభ్యులకు సత్కారం, 15న జాతీయ జెండా ఎగురవేయాలి. మండలానికి ఇద్దరు ప్రతినిధుల చొప్పున ఆ మట్టి కలశాలు తీసుకొని 27వ తేదీకల్లా ఢిల్లీకి చేరాల్సి ఉంటుంది. 29, 30 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే కర్తవ్యపథ్‌లో ఆ మట్టి కలశాలతో పాల్గొనాల్సి ఉంటుంది.

బనకచర్లకు పోలవరం నీటిని తెస్తా

- ఈ ప్రభుత్వంలో ప్రాజెక్టులన్నీ రివర్స్
- డిజిటల్ కరెన్సీ ఐడియా నాదే
- పులివెందుల సభలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- వైఎస్ కుటుంబమే టార్గెట్‌గా ప్రసంగం



సాక్షి ప్రతినిధి, కడప: పోలవరం నుంచి బనకచర్లకు నీటిని తీసుకువచ్చి.. కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేయడమే తన లక్ష్యమని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. తన హయాంలోనే పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తి చేశామన్నారు. రివర్స్ టెండరింగ్ అంటున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టు పనులన్నీ రివర్స్‌లోనే ఉన్నాయని, రాయలసీమ కరువు నివారణ పథకం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోసమేనని ఆరోపించారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బుధవారం ఆయన గండికోట ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులపై అక్కడే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జమ్మలమడుగు నుంచి పులివెందుల వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందులలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రహదారులపై నాటి ప్రధాని వాజ్‌పేయికి ఐడియా ఇచ్చింది తానేనన్నారు. ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన డిజిటల్ కరెన్సీ ఐడియా కూడా తనదేనన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రపంచాన్ని అనుసంధానం చేయడం ద్వారా అమెరికాకు వెళ్లకుండానే ఇక్కడి నుంచే హోమ్ టు వర్క్ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని, ప్రాణాలు లెక్కచేయకుండా ఆయన కుమార్తె సునీత పోరాడుతోందన్నారు. టీడీపీకి అధికారం కట్టబెడితే అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పులివెందుల ప్రజల్లో మార్పు వస్తోందంటూ వైఎస్ కుటుంబంపై ఆరోపణలు గుప్పించారు. మన రాజధాని అమరావతే అని కార్యకర్తలతో నినాదాలు చేయించారు.

పనిగట్టుకుని కవ్వింపు చర్యలు

పులివెందులలో ఎలాగైనా గొడవ సృష్టించి, లబ్ధి పొందాలనే ధ్యేయంతోనే టీడీపీ పనిగట్టుకుని రెచ్చగొట్టేలా వ్యవహరించింది. బుధవారం మధ్యాహ్నం నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఎల్లో మీడియా ద్వారా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు యత్నిస్తున్నాయనే సమాచారం ఉందని ఆరోపించారు. వారిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కవ్వింపు చర్యలకు దిగారు. వాస్తవానికి పులివెందుల పూల అంగళ్ల సెంటర్లో చంద్రబాబు బహిరంగ సభకు అనుమతి లేదు. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనువాసులరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి రెండు రోజుల ముందు జిల్లా ఎస్పీ అన్బురాజన్ అనుమతి కోరితే, జనజీవనానికి ఆటంకం కలుగకుండా మరో ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. అయినప్పటికీ పూల అంగళ్లు సర్కిల్ లోనే సభ నిర్వహణకు టీడీపీ నేతలు ఏర్పాట్లు చేయసాగారు. పోలీసులు జోక్యం చేసుకుని.. వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో సభ నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో వారు అక్కడికి వెళ్తూ, వెళ్తూ వాహనదారులను భయాందోళనకు గురిచేశారు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ జెండాకు నిప్పు పెట్టారు. ఓ యువకుడు జెండా కాలిపోకుండా నిప్పుపై నీళ్లు పోశాడు. దాంతో ఒక్కమారుగా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆ యువకుడిపై దాడి చేశారు. అక్కడే ఉన్న పోలీసులు అతన్ని రక్షించారు. ఆపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల వాహనాలు వెళ్తుంటే వాటిపై కూడా దాడి చేశారు.

బాబూ.. ఏ మొహం పెట్టుకుని వస్తున్నావు?

- నాడు సాగు, తాగు నీటి ప్రాజెక్టులు నిర్వీర్యం చేశారు
- 14 ఏళ్లలో ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేకపోయారు
- అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల ధ్వజం
- బీటీపీని పూర్తి చేయలేని చంద్రబాబు: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- వైఎస్ హయాంలోనే 63 ప్రాజెక్టులు చేపట్టారు: ఎమ్మెల్యే తోపుదుర్తి

అనంతపురం క్రైం: టీడీపీ హయాంలో సాగు, తాగు నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన చంద్రబాబునాయుడు ఏ ముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నారని ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, పార్టీ నాయకులు బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశం నిర్వహించారు. భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ)ను పూర్తి చేస్తామని 2014లో చెప్పిన చంద్రబాబు మాట తప్పారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టుకు రూ.950 కోట్లు మంజూరు చేశారంటూ నాడు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హడావుడి చేశారని అన్నారు. వైఎస్సార్ హయాంలో కేసీ కెనాల్ నుంచి హెచ్చెల్సీకి 10 టీఎంసీలు కేటాయిస్తే వాటిని రద్దు చేయించిన ఘనుడు కాలవ శ్రీనివాసులని మండిపడ్డారు. సీఎం జగన్ భైరవానితిప్ప ప్రాజెక్టు తొలివిడతలో రూ.240 కోట్లు విడుదల చేశారని, ఇప్పటికే రైతుల అకౌంట్లలో పరిహారం సొమ్ము జమ చేశారని తెలిపారు.



మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి, చిత్రంలో తోపుదుర్తి, శంకరనారాయణ, సిద్ధారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు

ఎన్నికలప్పుడే బాబుకు ప్రాజెక్టులు గుర్తుకొస్తాయి

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబుకు ఎన్నికలప్పుడే రైతులు, ప్రాజెక్టులు గుర్తుకొస్తాయని విమర్శించారు. 1998లో హంద్రీ–నీవాకు, 2018లో జీడిపల్లి – పేరూరు డ్రిప్ ఇరిగేషన్ స్కీంకు శిలాఫలకాలేసి వదిలేశారని చెప్పారు. 560 కిలోమీటర్ల హంద్రీ–నీవా కాలువలో 125 కిలోమీటర్లకే పరిపాలన అనుమతులిచ్చి రైతులను మోసం చేశారన్నారు. వైఎస్సార్ హయాంలో రూ.60వేల కోట్లతో 63 ప్రాజెక్టులు చేపట్టి, వాటిలో 23 పూర్తి చేశారన్నారు. మిగతా ప్రాజెక్టుల్లోనూ 70 శాతం పనులు పూర్తి చేశారన్నారు. మిగిలిన 30 శాతం పనులకు చంద్రబాబు హయాంలో వంద నుంచి వెయ్యి రెట్లు అంచనాలు పెంచి, 15 శాతం పనులే చేసి రూ.60 వేల కోట్లు దోపిడీ చేశారని తెలిపారు. ఆ దోపిడీ సొమ్ముతో బాబుకు అత్యంత సన్నిహితులైన సీఎం రమేష్, ఇరిగేషన్ కాంట్రాక్టర్లు చార్టర్డ్ విమానాలు కొన్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరూరు డ్యాంకు 2.7 టీఎంసీల నీరందించారని, పెన్నానదికి జీవం పోశారని తెలిపారు.

మభ్య పెట్టేందుకే: శంకరనారాయణ

రైతులను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ విమర్శించారు. అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేసే హంద్రీ–నీవా ప్రాజెక్టును చంద్రబాబు తాగునీటి ప్రాజెక్టుగా మార్చి తూట్లు పొడిచారని చెప్పారు. రైతుల కష్టాలు తీర్చడానికి వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీ–నీవాను తిరిగి సాగునీటి ప్రాజెక్టుగా మార్చారని, ఆయన హయాంలోనే 80 శాతం పూర్తి చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక మిగిలిన అరకొర పనులకు అంచనా వ్యయం భారీగా పెంచుకుని, ప్రజాధనాన్ని దోచేశారని విమర్శించారు.

ప్రాజెక్టులకు బాబే అడ్డంకి

రాయలసీమ ప్రాజెక్టులకు చంద్రబాబే అడ్డంకులు సృష్టిస్తున్నారని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ధ్వజమెత్తారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను నిర్వీర్యం చేశారన్నారు. 2019లో పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరు వచ్చినా కదిరి ప్రాంత రైతులకు నీరివ్వకుండా కుప్పంకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు ఏకంగా రైతులపై కేసులు పెట్టారని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా 150 చెరువులకు నీరందించారని తెలిపారు. చంద్రబాబు జిల్లాలో పర్యటిస్తే వర్షాలు పడవని, రైతులు తీవ్రంగా నష్టపోతారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో వెంకటస్వామికి డయాలసిస్ పింఛను రూ.10 వేలు అందజేస్తున్న వార్డు వలంటీర్ దుర్గారావు



విజయనగరం శాంతినగర్ కాలనీలో బోన్ని చిన్నప్పకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ యశోద



ఒంగోలు నగరం కొత్తపేటలో దివ్యాంగుడు వేమూరి హరిప్రసాద్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ నాగసుధ

92.23% పింఛన్ల పంపిణీ పూర్తి

సాక్షి,అమరావతి: ఒకటో తేదీన పంపిణీ చేయగా మిగిలిపోయిన వారి కోసం వలంటీర్లు బుధవారం లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ కొనసాగించారు. సాయంత్రం వరకు 57,89,210 మందికి రూ.1,594.13 కోట్లు అందజేశారు. 92.23% మందికి పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారికి మరో 3 రోజులు పాటు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తారని సెర్ప్ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు విజయనగరం జిల్లాలో 95.08 శాతం పంపిణీ పూర్తయినట్లు చెప్పారు.



శ్రీకాకుళం నగరంలోని జీమవారి వీధిలో లబ్ధిదారు రామారావుకి పింఛను అందజేస్తున్న వలంటీర్ సురేష్



నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో వృద్ధురాలు మాలె లక్ష్మమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మీనాకుమారి

కుప్పానికి నీళ్లిచ్చావా బాబూ!

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఫైర్



సాక్షి, అమరావతి: చంద్రబాబు రాయలసీమకు తన హయాంలో చుక్క నీరు కూడా ఇవ్వలేదని, ఏ మొహం పెట్టుకొని యుద్ధభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నిలదీశారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గానికి కనీసం నీళ్లిచ్చారా అని ప్రశ్నించారు. మొదట దీనికి సమాధానం చెప్పి ముందుకు కదలాలన్నారు. అక్షరాస్యత విషయానికొస్తే.. చిత్తూరు జిల్లాలోనే కుప్పం నియోజకవర్గం చాలా వెనుకబడి ఉందన్నారు. అందులోనూ గుడిపల్లె మండలం రాష్ట్రంలోనే అక్షరాస్యతలో వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఇది నిజంగా చంద్రబాబు తలదించుకోవాల్సిన పరిస్థితి అన్నారు. సీమకు చంద్రబాబు తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు.

ఇంజనీరింగ్ కాలేజీల కనీస ఫీజు రూ.43 వేలు

▶ మొదటి పేజీ తరువాయి

ఫీజు ఖరారు చేసే వరకు తాత్కాలికంగా ఈ కనీస ఫీజు అమల్లో ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. అంతేకాక ఏఎఫ్‌ఆర్‌సీ ఖరారు చేసే ఫీజులు ఈ వ్యాజ్యాల్లో తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయంది. పైన చెప్పిన ప్రక్రియను పూర్తి చేశాక కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు పెట్టుకోవచ్చని తెలిపింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. 2020–23కు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల ఖరారుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం 2022లో హైకోర్టులో పిటిషన్లు వేసింది. ఈ వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు, కనీస ఫీజును రూ.42,500గా నిర్ణయిస్తామని, దీనిపై అభిప్రాయం చెప్పాలని కాలేజీలను ఆదేశించిన విషయం తెలిసిందే. బుధవారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా.. న్యాయమూర్తి ఇంజనీరింగ్ కోర్సుల కనీస ఫీజును రూ.43 వేలుగా నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ఆశ కంటే భయమే ఎక్కువ కనబడుతున్నప్పుడు కూడా
నిలిచి ఉండటం వివేకమైన పని కాదు;
వెనక్కి తగ్గడం పారిపోయినట్టు కాదు!
– మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 3 ఆగస్టు 2023

మళ్లీ మతం మంటలు!

విశ్వాసాల ప్రాతిపదికగా చెలరేగిపోయే మూక మనస్తత్వం ఆధునిక నాగరికతకు అత్యంత ప్రమాదకారి సుమా అని రెండు వందల యేళ్లనాడు అమెరికా మాజీ అధ్యక్షుడు థామస్ జెఫర్సన్ హెచ్చరించారు. తరాలు మారినా, అప్పటితో పోలిస్తే ఎంతో ప్రగతి సాధించినా ఆ ప్రమాదకర మనస్తత్వాన్ని వదులుకోలేని బలహీనత కొందరిని పట్టిపీడిస్తోంది. ఒక పక్క మూడు నెలల క్రితం ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో చోటుచేసుకున్న అత్యంత దుర్మార్గమైన ఉదంతాలపై పార్లమెంటు లోపలా, వెలుపలా రోజూ ఆందోళన వ్యక్తమవుతోంది. దానిపై చర్చకు విపక్షం పట్టుబడుతోంది. సర్వోన్నత న్యాయస్థానం సైతం మణిపూర్ దురంతాలపై దృష్టి సారించి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగిపోయిందనీ, రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందనీ కటువుగా వ్యాఖ్యానించింది. ఈలోగానే హరియాణాలో దుండగులు చెలరేగిపోయారు. వరసగా రెండురోజులపాటు అడ్డూ ఆపూ లేకుండా సాగిన హింసాకాండతో అక్కడి నూహ్, గురుగ్రామ్ పట్టణాలు అట్టుడికిపోయాయి. ఇద్దరు హోం గార్డులతో సహా అయిదుగురు ప్రాణాలు కోల్పోయి 75 మంది గాయాల పాలయ్యాక, ఒక ప్రార్థనా స్థలంతో పాటు పలు దుకాణాలు తగలబడ్డాక ఇందుకు కారకులని భావిస్తున్న 116 మందిని అరెస్టు చేశారు. హింసాకాండకు ప్రేరేపించిన ఉదంతమేమిటి, ఎవరు ముందుగా దాడికి దిగారన్నది దర్యాప్తు సంస్థలు తేలుస్తాయి. అయితే నిఘా వ్యవస్థ, శాంతిభద్రతల విభాగం పటిష్టంగా ఉన్నచోట ఎవరి ఆటలూ సాగవు. జాగ్రదావస్థలో లేని సమాజంలోనే మూకలు చెలరేగుతాయి. భివానీలో ఇద్దరు ముస్లిం యువకుల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి, తప్పించుకు తిరుగుతున్న మోను మానెసార్ అనే యువకుడు తాను ర్యాలీకి రాబోతున్నానని ఒక వీడియో సందేశం పంపటంతో నూహ్‌లో ఉద్రిక్తత ఏర్పడిందని పోలీసులకు సమాచారం లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది.

మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఏదో యాదృచ్ఛికంగా మొదలైనట్టు కనబడిన దాడి వెంట వెంటనే వేరే ప్రాంతాలకు విస్తరించటం, రెండు వర్గాలూ మారణాయుధాలు ధరించి చెలరేగిపోవటం దేన్ని సూచిస్తోంది? కొందరికి బులెట్ గాయాలు కూడా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది. పరస్పరం దాడులకు ఇరువైపులా దుండగులు అన్నివిధాలా సిద్ధంగానే ఉన్నారు. ఏమాత్రం సంసిద్ధత లేకుండా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయింది ప్రభుత్వ యంత్రాంగమే! ఏమనుకోవాలి దీన్ని? మణిపూర్ దుండగులు ఆ రాష్ట్రాన్నే కాదు, దేశాన్నే అంతర్జాతీయంగా అపఖ్యాతిపాలు చేశాక, సాఫ్ట్‌వేర్ సంస్థలతోపాటు ఎన్నో బహుళజాతి కార్పొరేట్ సంస్థలు కొలువు దీరిన హరియాణాలో సైతం అలాంటి మూకే విచ్చలవిడిగా, ఇష్టానుసారంగా విరుచుకుపడిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. సాయుధ పోలీసు బలగాలను తరలించి, 144 సెక్షన్ విధించి అంతా సవ్యంగా ఉన్నదని చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుండగానే గురుగ్రామ్ అంటుకుంది. అక్కడి మిలీనియం సిటీ, బాద్షాపూర్ ప్రాంతాల్లో దుకాణాల దహనం, లూటీలు పోలీసుల సాక్షిగా కొనసాగాయి. గొడవలు జరిగిన ప్రతిచోటా స్థానికులు చెప్పే మాటలే ఇప్పుడు నూహ్, గురుగ్రామ్ ప్రాంత వాసులు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చాన్నాళ్లుగా ఆ ప్రాంతాలకు వస్తున్నారని, స్థానిక యువతను సమావేశపరిచి అవతలి మతం గురించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నినాదాలు చేస్తున్నారన్నది వారి మాటల సారాంశం. స్థానికులు కొన్ని రోజులుగా గమనించిన అంశాలపై నిఘా విభాగానికి ముందస్తు సమాచారం లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశ రాజధానికి సమీపంలో ఉండే ప్రాంతంలో ఈ దుఃస్థితి ఉండటం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే కాదు, కేంద్ర ప్రభుత్వానికి సైతం తలవంపులు తీసుకురాదా? వచ్చే నెలలో న్యూఢిల్లీలో జీ-20 శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. దానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలతో సహా పలువురు దేశాధినేతలు తరలిరాబోతున్నారు. కనీసం హరియాణా ప్రభుత్వానికి ఈ స్పృహ అయినా ఉందా లేదా అనిపిస్తోంది.

దేశంలో చెదురుమదురుగా మతపరమైన ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్న మాట వాస్తవమే అయినా, విచ్చలవిడిగా మారణాయుధాలతో మూకలు చెలరేగిన సందర్భాలు అదృష్టవశాత్తూ ఇటీవలి కాలంలో లేవు. కానీ ఉన్నట్టుండి రెండు రాష్ట్రాల్లోనూ రాక్షస మూకలు చెలరేగాయి. ప్రభుత్వంలో బాధ్యతాయుత స్థానంలో ఉన్నవారు ఇలాంటి సమయాల్లో జాగ్రత్తగా మెలగాలి. లేనట్టయితే సమస్య మరింత జటిలమవుతుంది. నూహ్ సమీపంలోని ఒక ప్రముఖ ఆలయంలో అనేక మంది యాత్రీకులను నిర్బంధించారని హరియాణా హోంమంత్రి అనిల్ విజ్ చేసిన ప్రకటన అటు వంటిదే. అందుకు సమర్థనగా నిర్బంధితుల్లో కొందరు తనకు లొకేషన్ కూడా పంపారని చెప్పారు. కానీ ఆ ఆలయ అర్చకుడు దీపక్ శర్మ కథనం భిన్నంగా ఉంది. దర్శనానంతరం తిరిగి వెళ్లిన 2,500 మంది భక్తులు బయట ఉద్రిక్తతలుండటం గమనించి తమంత తాము వెనక్కొచ్చి పరిస్థితి చక్క బడ్డాక వెళ్తామని చెప్పారని ఆయనంటున్నారు. ఏ మతానికి చెందిన ప్రజానీకమైనా శాంతినే కోరుకుంటారు. ఏదో ఉపద్రవం జరిగిపోతోందన్న భయాందోళనలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుందామని చూసేవారు ఎప్పుడూ ఉంటారు. అలాంటి శక్తులపై కన్నేసి ఉంచితే, వారిని మొగ్గలోనే తుంచితే సమాజంలో సామరస్యపూర్వక వాతావరణం సులభంగా ఏర్పడుతుంది. మన మతస్తులనో, మన కులస్తులనో భావించి ఏ వర్గమైనా పట్టనట్టు ఊరుకుంటే అంతిమంగా అది మొత్తం సమాజానికే చేటు కలిగిస్తుంది. మణిపూర్, హరియాణాల్లో చోటుచేసుకున్న ఉదంతాలు అందరికీ కనువిప్పు కావాలి. అటువంటి శక్తులను ఏకాకులను చేయటంలో అందరూ ఒక్కటి కావాలి.

భద్రతను విస్మరించే అభివృద్ధా?

విశ్లేషణ



రవి చోప్రా

హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. చార్ ధామ్ హైవేతో సహా వందలాది రోడ్లపై వాహనాలను కొండచరియలు నిరోధించాయి. అనేక పెద్ద జలవిద్యుత్ డ్యామ్‌లు వరదల ముప్పు కారణంగా ప్రణాళిక లేకుండా నీటిని విడుదల చేశాయి. పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టులను ఎలా మెరుగ్గా నిర్వహించాలి, తీసుకునే నిర్ణయాల్లో ప్రజలను ఎలా భాగస్వాములను చెయ్యాలి అనే విషయాలపై ఇవి కీలకమైన పాఠాలను అందిస్తున్నాయి. పర్యావరణం, జీవితం, ఆస్తి వంటి విషయాల్లో మెరుగైన భద్రత కావాలంటే, సమర్థమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. హిమాలయ అడవులను నాశనం చేస్తూనే విపత్తులను నివారించగలమా? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు కూడా వెతకాల్సి ఉంటుంది.

పర్వత ప్రాంత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఒకదాని తర్వాత మరొకటి జూలై నెలలో వరదలతో అతలాకుతలమయ్యాయి. ఈ వరదలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాథమిక సమస్యలను ఎత్తి చూపుతున్నాయి. ఈ వరదల్లో అత్యధికంగా దెబ్బ తిన్న రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్. జూలై మొదటి 11 రోజులలో కులు, బిలాస్‌పూర్, మండి, సిమ్లా, సోలన్‌లలో 77 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతంతో పోలిస్తే, సగటున రోజూ 250 మి.మీ. నమోదైంది. ఉత్తరాఖండ్‌లో జూలై మొదటి 10 రోజులలో సాధారణం నుండి సంచిత వర్షపాతం హిమాచల్ కంటే కొంచెం ఎక్కువగా ఉంది.

కుండపోత వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. జూలై 14 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో 108 మరణాలు నమోదు కాగా, జూలై 15 వరకు 26 మంది చనిపోయినట్లు ఉత్తరాఖండ్ నివేదించింది. ఉత్తరాఖండ్‌లో ప్రతిష్ఠాత్మకమైన, అన్ని వాతావరణాల్లో పనిచేసే చార్ ధామ్ హైవేతో సహా వందలాది రోడ్లపై వాహనాలను దాదాపు ప్రతిరోజూ కొండ చరియలు నిరోధించాయి. దీనివల్ల నివాసితులకు, పర్యాటకులకు కష్టాలు, ఆర్థిక నష్టాలు ఎదురయ్యాయి. గిర్థీ నదిపై వంతెన కూలిపోవడంతో చమోలి జిల్లాలో ఇండో-టిబెట్ సరిహద్దు వరకు రక్షణ బలగాల రాకపోకలు దెబ్బతిన్నాయి. విద్యుత్, నీటి సరఫరాలకు అంతరాయం ఏర్పడి రెండు రాష్ట్రాల్లోనూ పాఠశాలలు చాలా రోజులు మూతపడ్డాయి. వంతెనలు మునిగిపోయాయి లేదా కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడటమే కాకుండా హిమపాతం పట్టణాలను ముంచెత్తింది. హైవేలు విచ్ఛిన్నమైపోయాయి. అనేక భవనాలు, వాహనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో వినాశనం మరింత స్పష్టంగా కనిపించింది. ఈ విపత్తు సమయంలో, బియాస్ అత్యంత విధ్వంసకరంగా మారింది. సహజ కారణాల వల్ల మాత్రమే కాదు... బియాస్ నది పరివాహక ప్రదేశంలోని అనేక పెద్ద జలవిద్యుత్ డ్యామ్‌లు, తమ ప్రాంతాలలో వరదల ముప్పు కారణంగా అకస్మాత్తుగా ప్రణాళిక లేకుండా నీటిని విడుదల చేశాయి. ఇప్పటికే పొంగి పరవళ్లు తొక్కు తున్న నదిలోకి ఈ అదనపు ఉప్పెనలు వెల్లువెత్తి దిగువ ప్రాంతాల్లో నష్టాలను అధికం చేశాయి. ఉత్తరాఖండ్‌లోనూ ఇలాంటి సమస్యలే కనిపించాయి. జూలై 11న, ఉత్తరాఖండ్ జల్ విద్యుత్ నిగమ్ లిమిటెడ్ తాను నిర్వహిస్తున్న 19 ప్లాంట్‌లలో పదిహేడింటిని మూసివేసింది. నదీ పర్యావరణ వేత్తలు, యాక్టివిస్టులు పదేపదే చెబుతూ వచ్చిన ట్లుగా... జలశక్తి లేదా పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు లకు సంబంధించిన కేంద్ర మంత్రిత్వ శాఖలు, శాస్త్రీయంగా పర్యావ రణ ప్రవాహాలను ఏర్పాటు చేసి, డ్యామ్ ఆపరేటర్లు వాటిని అనుసరించేలా చూసినట్లయితే, ఆనకట్ట సంబంధిత సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చు.



మౌలిక సదుపాయాల సైట్ల చుట్టూ కూడా కనీవినీ ఎరుగని విధ్వంసం సంభవించింది. నిటారుగా ఉన్న లోయలతో కూడిన చిన్న పర్వత ప్రవాహాలు, పరిమితమైన వరదను భరించే సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉంటాయి. ప్రాజెక్టుల నుండి నిర్మాణ శిథిలాలు అటువంటి ప్రవాహాలలోకి డంప్ అవుతున్నాయి. వరదను భరించే వాటి సామర్థ్యాన్ని అవి మరింతగా తగ్గిస్తున్నాయి. స్థానిక నివాసితులు రికార్డ్ చేసిన ఒక వీడియో క్లిప్‌ని చూస్తే... క్రూరంగా విరుచుకుపడే, బురదతో కూడిన వరద ప్రవాహం థునాగ్ పట్టణంలోని మార్కెట్ లేన్‌లోకి దూసుకెళ్లి విధ్వంసం సృష్టించింది. మాజీ ముఖ్యమంత్రి జై రామ్ ఠాకూర్ స్వస్థలమైన తాండి గ్రామంలోని ఒక రహదారి నిర్మాణ ప్రాజెక్ట్ శిథిలాలను, అక్రమంగా నరికివేసిన చెట్ల మొద్దళ్లను నదీ ప్రవాహ మార్గంలో పడేశారు. ఇటువంటి ప్రాజెక్టులను తరచుగా పేలవమైన ప్రణాళికలతో, నిర్మాణ గడువులను వేగంగా చేరుకునే లక్ష్యంతో నాసిరకంగా నిర్మిస్తారు.

నాలుగు లేన్లతో ఉన్న మండి-మనాలి జాతీయ రహదారిలో 100 మీటర్లకు పైగా అతి పెద్ద నిర్మాణ ఉల్లంఘనలు జరిగినట్లు ఒక డ్రోన్ వీడియో చూపించింది. వీటి కారణంగానే మనాలిలో సుమారు 7,000 వాహనాలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల, హైవేను వాస్తవానికి నది ఒడ్డున నిర్మించారు. ఇక్కడ రహదారిని మెత్తటి నిక్షేపాలపై నిర్మించి ఉండవచ్చు. దీంతో బియాస్ ప్రాంతంలోని నేల కోత మరిన్ని ఇబ్బందులకు కారణమైంది. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ హైవేపై 2013 లోనూ ఇలాంటి వైఫల్యాలే చోటుచేసుకున్నాయి. అయితే హైవే డెవలపర్లు, ఇంజినీర్లు ఆనాడు జరిగిన పెను విపత్తు నుండి ఏ పాఠాలూ నేర్చుకోలేదు. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ హైవేకి చెందిన ఒక భాగం కూలిపోవడం కూడా, అటువంటి నిర్మాణంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని రుజువు చేసింది.

నదీ తీరాలకు కనీసం 100 మీటర్ల దూరంలో భవనాలు ఉండాలనే హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు నిబంధనను కూడా ఉల్లంఘించడంతో మనాలిలోని మూడంతస్తుల హోటల్ బియాస్ నదిలోకి కూలిపోయింది. నిజానికి, మనాలి నది ఒడ్డున హోటళ్లు, గృహ సముదాయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. హరిద్వార్, రిషికేశ్, ఇతర ఉత్తరాఖండ్ నదీతీర పట్టణాలలోనూ ఇదే విధమైన ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పెరుగుతున్న వాతావరణ కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిలు, భూతాపం, అధిక సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువ తేమతో కూడిన మేఘాలను ఉత్పత్తి చేస్తాయి. అయితే స్థానిక పరిస్థితులు అత్యధిక వర్షపాత సంఘటనలను నిర్ణయిస్తాయి. భారతదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా కూడా వర్షపాత తీవ్రత, తరచుదనం పెరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇవి అధిక జనాభా ఉన్న లేదా ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో సంభవించినప్పుడు, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం భారీగా ఉంటుంది. పర్యావరణం, జీవితం, ఆస్తి వంటి విషయాల్లో మెరుగైన భద్రత కావాలంటే, సమర్థవంతమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. నిర్మాణ సమయంలోనూ ఆ తర్వాత కూడా నిజాయితీగా, క్రమబద్ధమైన పర్యవేక్షణను చేపట్టాలి. ఇవన్నీ సాధ్యపడాలంటే మంచి పాలన అవసరం ఉంటుంది. అధిక వర్షపాతాన్ని, వరద తీవ్రతలను తట్టుకునే నిర్మాణ భద్రతాంశాలు మెరుగ్గా ఉండి, మంచి ఇంజినీరింగ్ పద్ధతులకు కట్టుబడి ఉంటే మరణాల సంఖ్య, విధ్వంసం తగ్గుతాయి.

ప్రేరేపిత విపత్తులు సంభవించినప్పుడు ప్రజల జీవితాలు ప్రమాదంలో పడతాయి కాబట్టి, మౌలిక ప్రాజెక్టుల ప్రణాళిక, మంజూరు, పర్యవేక్షణలో ప్రజలు సమర్థమైన స్వరాన్ని కలిగి ఉండాలి. నిజాయితీగా సిద్ధం చేసిన పర్యావరణ ప్రభావ అంచనాలు, పబ్లిక్ హియరింగ్‌లు వంటివి ప్రకృతి, జీవితాలు, ఆస్తికి చెందిన భద్రతలను పెంచడంలో సహాయపడతాయి. నియంత్రణ వ్యవస్థలు, పర్యావరణ ప్రభావిత అంచనాలకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ క్రమానుగతంగా బలహీనపడటం అనేది ప్రజలకు, ప్రకృతికి వ్యతిరేకమైనది. సమర్థవంతమైన ఆర్థిక వృద్ధి పేరుతో పాలనా యంత్రాంగం ఎన్ని వాదనలు చేసినప్పటికీ వాటన్నింటినీ ఖండించాలి.

చివరగా, మరిన్ని పెద్ద ప్రశ్నలు వేసుకుందాం. సున్నితమైన హిమాలయ ప్రాంతానికి ఉన్న మోసే సామర్థ్యం ఎంత? స్థిరమైన ఆర్థిక వృద్ధికి పరిమితులు ఏమిటి? మనం హిమాలయ అడవులను ఇంకా నాశనం చేస్తూనే విపత్తులను నివారించగలమా? పర్యావరణ సున్నితమైన హిమాలయ నదీ లోయల గుండా తమ వాహనాలను నడపడానికి మరింత మంది పర్యాటకులను ప్రోత్సహిస్తూనే ఉందామా? ఇప్పుడు వీటన్నింటికీ సమాధానాలు వెతకాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది.

వ్యాసకర్త ప్రముఖ పర్యావరణవేత్త
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అత్యంత బాధాకరం



స్నేహితుడు, కళాకారుడు, మాతో కలిసి పనిచేసిన ఆర్ట్ డైరెక్టర్ నితిన్ దేశాయి మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి, కమ్‌జోర్ కడీ, హార్ట్‌బీట్, దస్ కా దమ్, బ్లఫ్‌మాస్టర్, సచ్ కా సామ్నా' లాంటి మా షోలు ఎన్నింటికో ఆయన ప్రపంచ స్థాయి సెట్స్ డిజైన్ చేశారు.
– సిద్ధార్థ బసు, టీవీ షో కన్సల్టెంట్

మిస్ అవుతున్నా!



కళా దర్శకుడు నితిన్ దేశాయి ఆత్మహత్య చేసుకున్నారంటే నమ్మశక్యంగా లేదు. ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ఏ సమస్య అయినా ఇట్టే పరిష్కరించేవారు. పరిశ్రమ కంటే ముందున్న సృజన శీలి. ప్రతి ఒక్కరూ మనకు తెలియని పోరాటాలను చేస్తున్నారు. ఈ విషాదాన్ని ఎదుర్కొనే బలం ఆయన కుటుంబానికి కలగాలి.
– రసూల్ పూకుట్టి, సౌండ్ డిజైనర్

తెలుస్తోందా?




రాజకీయాలు పట్టని గురుగావ్‌లోని పోష్ అపార్ట్‌మెంట్లలో ఉండే జనాలకు ఇప్పుడు వారి చుట్టూ ఉండే రాజకీయాలు అర్థమవుతున్నట్టున్నాయి. ఎందుకంటే ఇంట్లో పనిచేయడానికి మనిషి రాదు. వాళ్ల బ్లౌజు కుట్టడానికి టైలర్ అందుబాటులో ఉండడు.
– అభిషేక్ బక్షీ, డిజిటల్ కన్సల్టెంట్

సహనం చూపాలి



విమర్శలను స్వీకరించలేని మతానికి ప్రజా వేదికల మీదకు వచ్చే హక్కు లేదు.
– అలీ మాలిక్, నాస్తికుడు

పట్టదా?



పౌర ఆందోళనలు దీర్ఘకాలంలో ఏ వ్యాపారానికైనా మంచివి కావు. కానీ ఇండియన్ కార్పొరేట్లు ఈ విషయమై ఏ విధమైన సున్నితత్వాన్నీ చూపడం లేదు. జరుగుతున్న విషయాల్లో వాళ్లూ చాలావరకు భాగస్థులే!
– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.విదియ రా.7.56 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ధనిష్ఠ ప.1.55 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.8.34 నుండి 10.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.47 వరకు తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.5.32 నుండి 7.02 వరకు (తెల్లవారితే శుక్రవారం); **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.30.

రామోజీ.. మీ ఆకాంక్ష గాలిలో దీపం



విపత్తుల నిర్వహణలో ఏపీ రోల్ మోడల్ అని తెలీదా? నాలుగేళ్లుగా ప్రభుత్వ ప్రణాళిక, సాయం మీకు కనిపించదా?

రోజుకో తప్పుడు కథనం.. అంశం ఏదైనా సరే దురుద్దేశం.. వెరసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం.. ప్రజల్లో విష బీజాలు నింపడమే లక్ష్యం.. చంద్రబాబుకు అనుకూల పరిస్థితి సృష్టించాలన్న తాపత్రయం.. ఇదీ ఈనాడు రామోజీరావు ఆకాంక్ష. ప్రజలేమనుకుంటారోనన్న కనీస స్పృహను ఏనాడో వదిలేసిన ఈయన ప్రతిపక్ష నేతపై ఆశలు పెంచుకుని నెట్టుకొస్తూ సరికొత్త పాత్రికేయానికి తెరలేపారు. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట అయితే, వాటిని ప్రచారం చేయడంలో ఆయన తాత రామోజీ! ఈయన గారి ఆకాంక్ష గాలిలో దీపంలా మిణుకుమిణుకు మంటోందన్నది మాత్రం నిజం. త్వరలో అది ఆరిపోతుందనేది ఇంకా పచ్చి నిజం.

సాక్షి, అమరావతి

పచ్చ కామెర్లు సోకిన వాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న సామెత ఈనాడు రామోజీరావుకు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. విపత్తుల నిర్వహణలో మన రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా ఉందనే పచ్చి నిజాన్ని కావాలని విస్మరించి, రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ గాలిలో దీపమేనంటూ దుష్ప్రచారానికి దిగడం దుర్మార్గం. బరితెగించి మరీ అబద్ధపు కథనం రాసి తన స్థాయిని మరింత దిగజార్చుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఉన్న ఈర్ష్య, ద్వేషాన్ని వెళ్లగక్కారు. మన విపత్తుల నిర్వహణ విధానం బాగుందని దేశ వ్యాప్తంగా ప్రసంశలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తెలంగాణ, ఉత్తరాఖండ్ వంటి పలు రాష్ట్రాల అధికారులు ఏపీకి వచ్చి అధ్యయనం చేసి వెళ్లారు. జాతీయ విపత్తుల నిర్వహణ విధానం కంటే రాష్ట్ర విపత్తు నిర్వహణ విధానమే బాగుందని సాక్షాత్తూ ఆ సంస్థే పలు సందర్భాల్లో కితాబిచ్చింది. ఈ వాస్తవాలకు మసిపూసి, అసలు విపత్తుల ప్రణాళికే లేదని ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



గత నెల 28న ఏలూరు జిల్లా వేలేరుపాడులో వరద బాధితుల కోసం సిద్ధంగా ఉంచిన కూరగాయలు, పడవల ద్వారా పంపిస్తున్న అధికారులు

మూడు రకాల ప్రణాళికలతో సిద్ధం

ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మండల, గ్రామ, జిల్లా స్థాయిల్లో పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం ఎప్పటికప్పుడు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2021లో స్టేట్ సైక్లోన్ ప్రిపేర్‌డ్‌నెస్ (తుపాను సంసిద్ధత) ప్లాన్, ఫ్లడ్ అట్లాస్ (వరదల కోసం), విపత్తుల సంరక్షణా నియమావళి తయారు చేసింది. రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్.. జిల్లా, మండల స్థాయిల్లో ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్లను సాంకేతికంగా అభివృద్ధి చేసింది. ఆధునిక టెక్నాలజీ వ్యవస్థలను వాటికి అనుసంధానించి, ఆ డేటాను విశ్లేషించి.. విపత్తుల సమయంలో వినియోగిస్తున్నారు.

ఏపీ అలెర్ట్ విధానంపై దేశం చూపు

దేశంలోనే మొదటిసారిగా ఏపీ అలెర్ట్ సిస్టమ్ ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేసే మెసేజ్‌లను పంపే విధానాన్ని ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. దీని ద్వారా ఇప్పటి వరకు 8 కోట్ల మెసేజ్‌లను ప్రజలకు పంపారు. తద్వారా తుపానులు, పిడుగులు, వడగాడ్పులు, భారీ వర్షాల సమాచారాన్ని ప్రజలను పంపి అప్రమత్తం చేస్తున్నారు. 5,400 ఆపద మిత్ర వలంటీర్లకు విపత్తుల నిర్వహణపై శిక్షణ ఇచ్చి విపత్తులకు గురయ్యే ప్రాంతాల్లో నియమించారు. గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు సైతం విపత్తుల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కోసం విపత్తులకు గురయ్యే ప్రతి జిల్లాకు రెస్క్యూ బోట్స్, లైట్స్, పవర్ సాస్, లైఫ్ జాకెట్స్ వంటి పరికరాలను పంపారు. ఈ చర్యల ద్వారా గత నాలుగేళ్లలో విపత్తుల వల్ల జరిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అలెర్ట్ సిస్టం పనితీరును పరిశీలించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యేక బృందాలు ఏపీకి వచ్చాయి. ఉత్తరాఖండ్ (17-05-22), ఒడిశా (22-03-22), అస్సాం (18-01-22), తమిళనాడు (23-03-22), తెలంగాణ (19-05-23), ఢిల్లీ-ఎన్‌డీఎంఏ (01-07-22) అధికారుల బృందాలు తాడేపల్లిలోని స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను సందర్శించాయి. విపత్తు నిర్వహణలో రాష్ట్రం అత్యుత్తమ విధానాలు అమలు చేస్తుందనే దానికి ఇవే నిదర్శనం.

ప్రాణ, ఆస్తి నష్టం నివారణ

దాదాపు 16 సంవత్సరాల తర్వాత 2022 జూలైలో ధవళేశ్వరం బ్యారేజి వద్ద 22,58,895 క్యూసెక్కుల స్థాయికి వరద ప్రవాహం చేరింది. విపత్తుల ప్రణాళిక ప్రకారం ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా అప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగారు. 48 గంటలు ముందుగానే వరద ప్రభావంతో ముంపునకు గురయ్యే గ్రామాలను రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ ద్వారా గుర్తించి ఆ జిల్లాల కలెక్టర్లకు సమాచారం ఇచ్చారు. రాష్ట్రంలోని బ్యారేజీల వద్దకు, ప్రాజెక్టుల నుంచి ఎన్ని క్యూసెక్కుల నీరు విడుదలైతే ఎన్ని మండలాలు, ఎన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయనే సమాచారాన్ని జిల్లా కలెక్టర్లకు పంపుతున్నారు.

క్షేత్ర స్థాయిలో సమర్థవంతమైన వ్యవస్థ

రాష్ట్రంలో అధికార వికేంద్రీకరణ జరగడం వల్ల క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బలోపేతమయ్యాయి. జిల్లాల విభజన వల్ల కలెక్టర్లు, జేసీలు, ఎస్పీల సంఖ్య పెరిగింది. ఫలితంగా విపత్తుల నిర్వహణ సహా అనేక ప్రభుత్వ పాలనా కార్యక్రమాలు వేగంగా, చురుగ్గా జరిగేందుకు ఆస్కారం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో విప్లవాత్మకంగా ప్రారంభించిన గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నాయి. ప్రతి 2 వేల జనాభాకు 10, 11 మంది ప్రభుత్వ ఉద్యోగులు, వీరికి అనుబంధంగా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ సేవలు అందిస్తున్నారు. విపత్తుల సమయంలో వీరు అందిస్తున్న సేవలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. ప్రజలను అప్రమత్తం చేయడం, సహాయ, పునరావాస కార్యక్రమాలు, బాధితులకు తోడుగా నిలవడం, సహాయ శిబిరాల నిర్వహణ వంటి పనుల్ని అత్యంత వేగంగా, మెరుగ్గా చేపడుతున్నారు. గత ఏడాది గోదావరి వరదల సమయంలో గ్రామ సచివాలయాల వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ గొప్పగా సేవలు అందించింది. తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడంలో దోహదపడ్డారు.

గతం కంటే మిన్నగా సాయం

జాతీయ విపత్తు నిర్వహణ మార్గదర్శకాల కన్నా మిన్నగా రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తోందనేది జగమెరిగిన సత్యం. విపత్తు సంకేతాలు వచ్చిన వెంటనే ఆయా జిల్లాల కలెక్టర్లకు నిధులు విడుదల చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధులు ఇవ్వక కలెక్టర్లు, అధికారులు నానా యాతన పడేవారు. చివరకు సహాయ కార్యక్రమాలు చేపట్టలేక బాధితులు కన్నీటి పర్యంతమయ్యేవారు. ఈ ప్రభుత్వం ఆ పరిస్థితిని మార్చేసింది. తాజా గోదావరి వరదల్లో కూడా రూ.31.71 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన విడుదల చేసింది. కేంద్ర మార్గదర్శకాల్లో లేకపోయినా ఇళ్లలోకి నీళ్లు చేరితే చాలు ప్రతి కుటుంబానికి రూ.2 వేలు అందిస్తోంది. గతంలో ఈ నగదు సహాయం ఇచ్చే వారు కాదు. వీటితోపాటు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పాలను నేరుగా బాధితుల ఇళ్లకు అందించేలా చర్యలు తీసుకుంది. కచ్చా ఇళ్లు దెబ్బతింటే కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇవ్వాల్సిన సహాయం రూ.5 వేలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తోంది. పంట నష్టపోతే ఆ సీజన్ ముగిసేలోగానే ఇన్‌పుట్ సబ్సిడీని అందిస్తోంది. గత ప్రభుత్వంలో ఇలాంటి సహాయ కార్యక్రమం ఎప్పుడూ జరగలేదన్న విషయం మీకు తెలియదా రామోజీ?

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

- టీడీపీ అధికారంలో ఉన్న 2014-19 సంవత్సరాల్లో హుదుద్, తిత్లి తుపానులతో సహా విపత్తుల సహాయ చర్యల కోసం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.2014 కోట్లు మాత్రమే. 2019-23 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం సహాయక చర్యల కోసం రూ.2422 కోట్లు విడుదల చేసింది.
- టీడీపీ హయాంలో రెస్క్యూ కార్యకలాపాల కోసం అసలు బడ్జెట్ విడుదల చేయనేలేదు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇందుకు రూ.1969.83 కోట్లు విడుదల చేసింది. చంద్రబాబు తన పాలనలో విపత్తులప్పుడు సహాయ శిబిరాల్లో ఉన్న కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం గురించి పట్టించుకోలేదు. జగన్ అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి రూ.2 వేల వరకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తున్నారు.
- బియ్యం, నూనె, ఉల్లి, కిరోసిన్ మొదలైన నిత్యావసర సరుకులు 2014-19 మధ్య హుద్ హుద్, తిత్లీ తుపాను సమయంలో మాత్రమే ఇచ్చారు. ఈ ప్రభుత్వం 2020, 2021, 2023 సంవత్సరాల్లో రాష్ట్రం ఎదుర్కొన్న అన్ని విపత్తుల్లోనూ నిత్యావసర సరుకులు అందించింది.
- చంద్రబాబు హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో చెల్లించలేదు. 2019 నుంచి ప్రస్తుత ప్రభుత్వం వెనువెంటనే చెల్లించింది.

క్లుప్తంగా...

ఐపీఎస్ అధికారి తల్లికి ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్స

- ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచిన ఏఎస్పీ జగదీష్



శస్త్రచికిత్స చేయించుకున్న తల్లిని పరామర్శిస్తున్న ఏఎస్పీ జగదీష్ అదహళ్లి

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెంచేలా ఒక ఐపీఎస్ అధికారి తీసుకున్న నిర్ణయం అందరి అభినందనలు అందుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అదహళ్లి స్థానిక ఏరియా ఆస్పత్రిలో తన తల్లి సుమిత్రకు కంటి శస్త్రచికిత్స చేయించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘుపతి మాట్లాడుతూ ఆమెకు కంటి శుక్లాల ఆపరేషన్ చేసి లెన్స్ పెట్టినట్లు తెలిపారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో కంటికి సంబంధించిన అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైస్ అడ్మిరల్ సమీర్‌సక్సేనా బాధ్యతల స్వీకరణ




సింధియా (విశాఖ): తూర్పు నావికాదళ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ సమీర్‌సక్సేనా బాధ్యతలు స్వీకరించారు. సమీర్ సక్సేనా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్, అమెరికా న్యూపోర్ట్‌లోని నేవల్ వార్ కాలేజీ పూర్వ విద్యార్థి. అత్యున్నత గౌరవాలతో నావిగేషన్ అండ్ డైరెక్షన్ స్పెషలిస్ట్‌గా రాణించి, ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విరాట్‌లో డైరెక్షన్ టీమ్‌లో పనిచేశాడు. ఆ తర్వాత ఐఎన్ఎస్ కుతార్, గోదావరి, ఢిల్లీకి నావిగేషన్ ఆఫీసర్‌గానూ, ఐఎన్ఎస్ ముంబైకి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముఖ్యపాత్ర పోషించారు. అంతే కాకుండా మారిషస్ కోస్ట్ గార్డ్ షిప్ గార్డియన్‌కు, ఇండియన్ నేవల్ షిప్స్ కులిష్ అండ్ మౌసూర్‌కు నాయకత్వం వహించారు. అలాగే వెస్టర్న్ ఫ్లీట్‌లో ఫ్లీట్ ఆపరేషన్స్ ఆఫీసర్‌గా పనిచేశారు. తూర్పు నావికాదళ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు గుజరాత్ నావల్ ఏరియా కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈయనకు 2017లో నౌక సేన పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకాన్ని రాష్ట్రపతి ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని డిఫెన్స్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ హెడ్ క్వార్టర్స్, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ సర్వీసెస్ డెప్యూటీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

సాక్షి, విశాఖపట్నం: సరుకు హ్యాండ్లింగ్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) మరోసారి తన రికార్డులను తానే అధిగమించింది. ఒకే నెలలో అత్యధికంగా బాక్సైట్, మాంగనీస్ హ్యాండ్లింగ్ చేయడంలో పోర్టు సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఈ ఏడాది జూలై నెలలో 2,59,242 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ని పోర్టు హ్యాండిల్ చేసింది. కేవలం రెండు నౌకల ద్వారా బాక్సైట్‌ని హ్యాండిల్ చేయడం ద్వారా నూతన రికార్డును సృష్టించింది. గతంలో 2016 సెప్టెంబర్ నెలలో నాలుగు నౌకల ద్వారా వచ్చిన 1,81,741 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ని పోర్టు సిబ్బంది లోడ్, అన్‌లోడ్ చేసిన రికార్డును తిరగరాసింది. అదేవిధంగా మాంగనీస్ హ్యాండ్లింగ్‌లోనూ అదే జోరు చూపించింది. ఈ ఏడాది జూలైలో 12 నౌకల ద్వారా వచ్చిన 3,66,752 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను పోర్టు హ్యాండిల్ చేసింది. గతేడాది మే నెలలో 13 నౌకల ద్వారా 3,60,666 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను పోర్టులో హ్యాండిల్ చేసిన రికార్డును సైతం అధిగమిస్తూ.. నూతన రికార్డును నెలకొల్పింది. బాక్సైట్, మాంగనీస్ హ్యాండ్లింగ్‌లో కొత్త రికార్డులు నెలకొల్పడంపై పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు హర్షం వ్యక్తం చేశారు. ఈ రికార్డును సాధించడంలో కృషి చేసిన సిబ్బందిని ఆయన ప్రశంసించారు. డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, ట్రాఫిక్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

4న విజయవాడలో చిన్నయసూరి విగ్రహం ఏర్పాటు



చిన్నయసూరి విగ్రహ నమూనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయబాబు

సాక్షి, అమరావతి: తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన పరవస్తు చిన్నయసూరి కాంస్య విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తున్నట్లు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మనిషి పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి చిన్నయసూరి 'నీతిచంద్రిక' అద్దం పడుతుందన్నారు. చిన్నయసూరి విగ్రహం ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేదన్నారు. తెలుగు భాషకు పట్టంకట్టిన మహనీయుల స్మరణలో భాగంగా అడిగిన వెంటనే చిన్నయసూరి విగ్రహ ఏర్పాటుకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. చిన్నయసూరి సాహితీ పీఠం, అధికార భాషా సంఘం సంయుక్తంగా ఈ నెల 4న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విగ్రహావిష్కరణతో పాటు మాతృభాష ప్రాశస్త్యాన్ని చాటిచెప్పేలా తెలుగు రాష్ట్రాల నుంచి సుప్రసిద్ధ సాహితీ వేత్తలు, కవులతో భాషా సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్నయసూరి విగ్రహ నమూనా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆప్కాబ్‌కు 60 ఏళ్లు

దేశంలోనే ఉత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు

- 4న వజ్రోత్సవ వేడుకలు
- హాజరు కానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: సహకార బ్యాంకింగ్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్ (ఆప్కాబ్) 60 ఏళ్లు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు ముస్తాబైంది. డీసీసీబీ, పీఏసీఎస్‌ల ద్వారా రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతి కోసం ఆప్కాబ్ కృషి చేస్తోంది. పీఏసీఎస్‌లు స్వయం సమృద్ధి సాధించేందుకు ఆర్థిక చేయూత అందిస్తోంది. ఈ నెల 4వ తేదీన జరగనున్న వజ్రోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు.

రూ.లక్ష కోట్ల వ్యాపారం

1963 ఆగస్టు 4న ఏర్పడిన ఆప్కాబ్ 1966లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ నుంచి షెడ్యూల్డ్ బ్యాంకుగా గుర్తింపు పొందింది. దీని పరిధిలో 18 శాఖలు ఉండగా.. ఆప్కాబ్ పర్యవేక్షణలోని 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)ల పరిధిలో 425 బ్రాంచ్‌లు, 1,995 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) పనిచేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో ఆప్కాబ్ ఆధునిక సాంకేతికతను సంతరించుకుంది. డీసీసీబీలు, పీఏసీఎస్‌లను కూడా కోర్ బ్యాంకింగ్ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తోంది. 2018–19 నాటికి రూ.13,322 కోట్ల వార్షిక టర్నోవర్‌తో ఉన్న ఆప్కాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో నాలుగేళ్లలో ఏకంగా రూ.36,732 కోట్ల వ్యాపార మైలురాయిని అధిగమించింది. రూ.251 కోట్ల లాభాలను ఆర్జించింది. సహకార వ్యవస్థ ద్వారా దేశంలోనే తొలిసారి రూ.లక్ష కోట్ల వ్యాపారంతో గ్రామీణ సహకార వ్యవస్థలో స్వర్ణయుగానికి నాంది పలికింది. నాలుగేళ్లలో వరుసగా రెండు సార్లు నాఫ్‌స్కాబ్ ద్వారా జాతీయ స్థాయిలో నంబర్–1 సహకార బ్యాంక్‌గా గుర్తింపు పొందింది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో ఇండియాలోనే బెస్ట్ కో–ఆపరేటివ్ బ్యాంక్‌గా ఆప్కాబ్ బీఎఫ్ఎస్ఐ ద్వారా అవార్డు అందుకుంది. వజ్రోత్సవ వేడుకల సందర్భంగా బ్యాంక్ నూతన లోగో, పోస్టల్ స్టాంప్‌తో పాటు విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనుంది.

రైతు సేవలో 60 ఏళ్లు



ఆప్కాబ్ రైతుల సేవలో 60 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బ్యాంక్ సిబ్బంది, పాలక వర్గ సభ్యులకు అభినందనలు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన సహకార రంగం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలతో బలోపేతమైంది. రికార్డుస్థాయి వ్యాపారంతో నష్టాల నుంచి గట్టెక్కి లాభాలను ఆర్జిస్తోంది.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

ఎమ్మెల్యే తండ్రికి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం

- శృంగవరపుకోట ఎమ్మెల్యే తండ్రికి అస్వస్థత
- ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు
- ప్రభుత్వ వైద్యంపై పెరిగిన నమ్మకం ఇది: ఎమ్మెల్యే కడుబండి

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వాస్పత్రులు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయనేందుకు ఈ ఘటనే నిలువెత్తు నిదర్శనం. విజయనగరం జిల్లా శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తండ్రి రామునాయుడు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. తొలుత కొత్తవలసలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆయనను తీసుకెళ్లారు. అక్కడ రక్త పరీక్షలు, ఆక్సిజన్ సదుపాయాలు మెరుగ్గా లేకపోవడంతో వెంటనే ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యసేవలు అందించడంతో ఆయన కోలుకుంటున్నారు. తండ్రి బాగోగులపై ఎమ్మెల్యే బుధవారం ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చి వైద్యులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని, రెండు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్కారు వైద్యశాలల్లో కార్పొరేట్ వైద్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో వైద్యం వ్యాపారంగా మారిన తరుణంలో రాష్ట్రంలో జగనన్న సర్కారు ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్ ఆస్పత్రులను తీర్చిదిద్దిందన్నారు. ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చడం, నిపుణులైన వైద్యులను, సిబ్బందిని నియమించడంతో ప్రభుత్వాస్పత్రుల్లో చక్కని వైద్యం అందుతోందన్నారు. అందుకే.. ప్రజలు ఎలాంటి అనారోగ్యానికి గురైనా ప్రభుత్వాస్పత్రుల్లో చేరి ఉచిత వైద్యసేవలు పొందుతున్నట్టు వెల్లడించారు. గతంలో కరోనా సమయంలో ఎస్.కోట ప్రభుత్వాస్పత్రి వైద్యులు అద్భుతమైన సేవలందించారన్నారు. ఇప్పుడు ఏరియా ఆస్పత్రిగా మారి 22 మంది వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. జీసీసీ చైర్ పర్సన్ శోభా స్వాతిరాణి, డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన రాము నాయుడు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మోపాడ కుమార్ తదితరులు ఎమ్మెల్యే తండ్రిని పరామర్శించారు.



ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీఎంను దూషిస్తూనే.. మీడియా స్వేచ్ఛ లేదంటారా?

- ఏపీలో ఉన్న స్వేచ్ఛ ఎక్కడా లేదు
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

కడప సెవెన్‌రోడ్స్: పత్రికా స్వేచ్ఛ పేరుతో కొన్ని పత్రికలు, చానళ్లు ఇష్టానుసారంగా వార్తలు రాస్తున్నాయని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. సీఎం జగన్‌ను ఓవైపు దూషిస్తూనే మరోవైపు రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ లేదని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. బుధవారం కడపలో ఆయన మీడియాతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపితే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదని చెప్పారు. కానీ నిజాలు రాయకుండా అబద్ధాలను ప్రచారం చేయడం అభ్యంతరకరమన్నారు. దేశంలో ఎక్కడా లేని పత్రికా స్వేచ్ఛ మన రాష్ట్రంలో ఉందన్నారు. దీనిని ఉపయోగించుకుంటూ కొన్ని పత్రికలు, చానళ్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కల్పిత వార్తలు రాయడం బాధాకరమన్నారు. అవాస్తవ కథనాలతో దుష్ప్రచారం చేయడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో వరదలు వస్తే ఒక రకంగా, ఏపీలో వరదలు వస్తే మరో రకంగా వార్తలు రాస్తున్నారని వివరించారు. ప్రజలకు వాస్తవ సమాచారం తెలియజేయాలే గానీ.. దుష్ప్రచారం చేయకూడదని సూచించారు. కాగా, ప్రెస్ అకాడమీ ఆన్‌లైన్ డిప్లొమా కోర్సులు నిర్వహిస్తోందని.. ప్రతి శనివారం నిష్ణాతులైన వారితో తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అమర జవాన్‌కు ఆఖరి వందనం

సైనిక లాంఛనాలతో సురేంద్రకు అంత్యక్రియలు



గాలిలో తుపాకులు పేల్చుతున్న ఏఆర్ బృందం



సురేంద్ర (ఫైల్)

పాములపాడు: ఉగ్రవాదుల కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ సిరిగిరి సురేంద్ర (24) అంత్యక్రియలు ముగిశాయి. దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో సురేంద్ర నాలుగేళ్ల క్రితం సైన్యంలో చేరారు. కశ్మీర్‌లోని బారాముల్లా ఆర్మీ బెటాలియన్ యూనిట్ నంబర్ 46లో విధులు నిర్వహిస్తూ జూలై 31న జరిగిన మిలిటెంట్ ఆపరేషన్‌లో వీర మరణం పొందారు. మృతదేహాన్ని మంగళవారం అర్ధరాత్రి నంద్యాల జిల్లా కృష్ణానగర్‌కు తీసుకువచ్చారు. బుధవారం కృష్ణానగర్ గ్రామానికి నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, తహశీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో గోపీకృష్ణ చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్మీ అధికారులు భౌతికకాయంపై జాతీయ పతాకాన్ని కప్పి మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజనాయక్ ఆధ్వర్యంలో ఏఆర్ బృందం 3 సార్లు గాల్లోకి కాల్పులు జరపగా సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. సురేంద్ర కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆర్థర్ తెలిపారు. దేశం కోసం తమ చిన్న కుమారుడు సురేంద్ర ప్రాణాలు వదిలాడని, తమను పోషించాల్సిన బాధ్యత పెద్ద కుమారుడిపై ఉందని, అతడికి ఉద్యోగం కల్పించాలని తల్లిదండ్రులు సుబ్బయ్య, సుబ్బమ్మ కోరారు.

ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించాలి

- సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ
- విశాఖలో ప్రారంభమైన కలెక్టర్ల సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, విశాఖపట్నం: ఓటర్ల జాబితాలను పక్కాగా రూపొందించాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ కోరారు. ఓటర్ల జాబితాల్లో సమగ్రతను మెరుగుపరచడానికి, బూత్ స్థాయి అధికారుల నుంచి జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న కలెక్టర్ల వరకూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ–2024పై రెండు రోజుల సమీక్ష బుధవారం విశాఖపట్నంలో ప్రారంభమైంది. ప్రతి జిల్లా కలెక్టర్ తమ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్–2024కి సంబంధించిన వివరాలతో కూడిన ప్రెజెంటేషన్‌ని కేంద్ర ఎన్నికల అధికారులకు వివరించారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఓటర్ల సవరణ కార్యక్రమం ఎలా నిర్వహించాలనే అంశంపై సూచనలు చేశారు. ముఖ్యంగా ఓటర్ల జాబితా తయారీ, సమ్మరీ రివిజన్, ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డుల (ఎపిక్ కార్డులు) ఇంటింటా పరిశీలన, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, పేరు, చిరునామా సవరణలు, కొత్త ఓటర్ల గణన తదితర అంశాల గురించి వివరించారు.

క్షేత్రస్థాయి పరిశీలన అవసరం

ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ.. సూపర్‌వైజర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో పాటు వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా చేసే పనులపై కచ్చితమైన జవాబుదారీతనాన్ని అమలు చేయడం, పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీల నిర్వహణ వంటి బాధ్యతల్ని కలెక్టర్లు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారులు (కలెక్టర్లు) రోల్ అబ్జర్వర్లు, సీఈవోలు కూడా క్లెయిమ్స్, అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు ఈఆర్వోలు చేసిన పనిని పూర్తిస్థాయిలో పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈసీఐ, సీఈవోలు నియమించిన అధికారులు పలుమార్లు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని ధర్మేంద్ర శర్మ సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అధ్యక్షతన జరిగిన సదస్సులో కలెక్టర్లతో పాటు కేంద్ర ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు నితీష్ వ్యాస్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ హృదేశ్‌కుమార్, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర ఎన్ బుటాలియా, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్‌కుమార్ హాజరయ్యారు.

సీఎం జగన్‌పై ఉద్యోగుల్లో నమ్మకం పెరిగింది

ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్‌జీవో సంఘం 21వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్నామని, ఉద్యోగులు విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్‌లతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రాయితీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. దీంతో ప్రభుత్వంపై, సీఎం జగన్‌పై ఉద్యోగులకు నమ్మకం పెరిగిందన్నారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. గతంలో 5 జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే హెచ్‌ఆర్ఏ ఇచ్చేవారని, ఇపుడు కొత్త జిల్లాలు ఏర్పడినందున అన్ని జిల్లాలకు సమానంగా హెచ్‌ఆర్ఏ ఇవ్వాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర కార్యదర్శి కేవీ శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయపరంగా రావాల్సిన హక్కుల గురించే పోరాటం చేస్తామని, ఏ ప్రభుత్వానికి కూడా సంఘం వత్తాసు పలకదన్నారు. అనంతరం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, హనుమంతు సాయిరాం, రవిశంకర్, చల్లా శ్రీనివాసరావు, ఆర్.వేణుగోపాల్, బమ్మిడి నరసింగరావు, కె.జయరావు, బడగల పూర్ణచంద్రరావు, హైమవతి, రోజాకుమారి, లలిత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



21వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌జీవో సంఘ నేతలు

విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి



రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం లక్ష్మీపురం ఎస్టీకాలనీ సమీపంలోని ఓ మామిడి తోటలో విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి చెందింది. బాలపల్లి రేంజర్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు. రైతు చంద్రశేఖర్ అడవి జంతువులు తమ తోటలోకి రాకుండా ఉండేందుకు తోట చుట్టూ పెద్దపెద్ద విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశాడు. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి ఏనుగు తోటలోకి ప్రవేశించగానే విద్యుత్ వైర్లు తగిలి పడిపోయింది. ఆ వెంటనే తిరిగి లేచి పరుగులు పెట్టింది. తోటలోనే మరోవైపునున్న విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ వైర్ల ద్వారా 25 కిలోవాట్స్ విద్యుత్ శక్తి సరఫరా కావడంతో ఏనుగు తోక, చెవులు కాలిపోయాయి. శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్ నుంచి 100 మీటర్లలోనే ఈ ఘటన జరిగింది. ఏనుగు వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుంది. ఏనుగు కళేబరానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేయనున్నారు.

వివాహితపై టీడీపీ నేత లైంగిక వేధింపులు

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



చంద్రబాబుతో నిందితుడు మార్కెట్ మహేష్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి ప్రధాన అనుచరుడు, ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్కెట్ మహేష్ ఓ వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన ఓ యువతి ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. ఆమెకు తన భర్త ద్వారా అంబార్ గేరి వాసి.. ప్రస్తుతం భవానీనగర్‌లో ఉంటున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్కెట్ మహేష్ ఏడాది క్రితం పరిచయమయ్యాడు. అప్పటినుంచి అవకాశం దొరికిన ప్రతిసారి లైంగిక వేధింపులకు గురిచేయసాగాడు. ఈ ఏడాది జూలై 27న ఆ యువతి భర్త మిత్రులంతా కలసి గోవా టూర్ ప్లాన్ చేశారు. భర్తకు వేరే పని పడడంతో యువతిని టూర్‌కు పంపాడు. అక్కడ ఆమె సోదరుడి వరుసైన వ్యక్తితో కలసి తీసుకున్న వీడియోలు, ఫొటోలను ఎవరి ద్వారానో తెప్పించుకున్నాడు. తన కోరిక తీర్చకపోతే వాటిని యువతి భర్తతో పాటు అందరికీ పంపుతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు బుధవారం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు టీడీపీ నాయకుడు మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా మహేష్‌ను రక్షించేందుకు బడా టీడీపీ నేతలు రంగంలోకి దిగినట్లు తెలిసింది.

'మళ్లీ పెళ్లి'కి లైన్ క్లియర్

- నటుడు నరేశ్‌కు బెంగళూరు కోర్టులో ఊరట

సాక్షి బెంగళూరు: ప్రముఖ తెలుగు నటుడు నరేశ్ నటించిన 'మళ్లీ పెళ్లి' ప్రదర్శనను అడ్డుకోవాలని దాఖలైన పిటిషన్‌ను బెంగళూరు నగర సివిల్ కోర్టు కొట్టివేసింది. దీంతో ఈ చిత్రంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టుని ఆశ్రయించిన నరేశ్ మూడో భార్య రమ్య రఘుపతికి కోర్టు షాక్ ఇచ్చింది. మెరిట్ లేని కారణంగా పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు కోర్టు పేర్కొంది. మళ్లీ పెళ్లి సినిమా తన వ్యక్తిగత జీవితాన్ని పోలి ఉందని, తన జీవితం ఆధారంగానే నిర్మించారని పిటిషన్‌లో రమ్య పేర్కొన్నారు. దీన్ని ప్రస్తుతం ఓటీటీలో కూడా ప్రదర్శిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని రమ్య కోర్టును ఆశ్రయించింది. సినిమా థియేటర్, శాటిలైట్, డిజిటల్ విడుదలను కూడా అడ్డుకోవాలని కోరారు. ఆమె పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం దాఖలైన పిల్ చట్టబద్ధంగా సమర్థనీయం కాదని పేర్కొంది. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత సెన్సార్ బోర్డు చెప్పినట్లు ఈ సినిమా అంశం పూర్తిగా కల్పితమని పేర్కొంది. ఒక్కసారి సెన్సార్ బోర్డు సినిమాను కల్పితమని ధ్రువీకరించి సర్టిఫికెట్ జారీ చేసిన తర్వాత దాన్ని విడుదలను ప్రైవేట్ వ్యక్తులు అడ్డుకునే ప్రసక్తే లేదని కోర్టు తెలిపింది.

పసికందు ప్రాణం తీసిన మొబైల్ చార్జర్

- స్విచ్‌బోర్డుకు పెట్టిన చార్జర్‌ను నోట్లో పెట్టుకున్న చిన్నారి
- విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత
- ఉత్తర కన్నడ జిల్లా సిద్ధర గ్రామంలో ఘటన

సాక్షి బెంగళూరు: మొబైల్ చార్జర్ ఎనిమిది నెలల చిన్నారి ప్రాణాలు తీసిన ఘటన ఉత్తర కన్నడ జిల్లా కారవార తాలూకా సిద్ధర గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... సిద్ధర గ్రామంలో సంతోష్ కల్గుటకర్, సంజన దంపతులు నివాసం ఉంటున్నారు. ఇంట్లో స్విచ్ బోర్డుకు ఉంచిన మొబైల్ చార్జర్‌ను బుధవారం ఉదయం స్విచ్ ఆఫ్ చేయలేదు. ఇంట్లో ఆడుకుంటున్న ఎనిమిది నెలల చిన్నారి ఆ చార్జర్ కేబుల్‌ను నోట్లో పెట్టుకుంది. విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలిపోయింది. తక్షణమే ఆ శిశువును జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి మరణించినట్లు ధ్రువీకరించారు. హెస్కాం (హుబ్లీ విద్యుత్ పంపిణీ సంస్థ)లో కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్ కల్గుటకర్ చిన్నారి మరణం విషయం తెలిసి ఆఫీసులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని సిద్ధర గ్రామంలోని పీహెచ్‌సీలో చేర్పించి చికిత్స అందించారు. చిన్నారి మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సంతోష్, సంజనా దంపతులకు మొత్తం ముగ్గురు సంతానం. వారిలో తొలి ఇద్దరు ఆడపిల్లల్లో ఒకరిది బుధవారం పుట్టినరోజు. అందరూ ఈ వేడుకకు ఏర్పాట్లు చేస్తుండగా చిన్నారి మరణించడం వారిని మరింత కలచివేసింది.

బాబు హయాంలో మహిళ ఇంటి బిల్లు స్వాహా

- తనకు తెలియకుండానే ఇంటి బిల్లు మొత్తం తీసుకున్న వైనం
- ఎమ్మెల్సీ భరత్‌కు బాధితురాలి మొర
- న్యాయం చేయాలని విన్నపం

శాంతిపురం (చిత్తూరు జిల్లా): చంద్రబాబు ప్రభుత్వ హయాంలో తన ఇంటి బిల్లు మొత్తాన్ని ఎవరో స్వాహా చేశారని చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం అబకలదొడ్డికి చెందిన అజీమా బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ భరత్ ముందు ఆవేదన వ్యక్తం చేసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా భరత్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన అజీమా.. 'పదిహేనేళ్ల ముందు పని కోసం తమిళనాడుకు వెళ్లిన మా ఇంటాయన మళ్లీ తిరిగి రాలేదు. తను ప్రాణాలతో ఉన్నాడో, లేదో తెలియదు. ఉన్న కొడుకు, కూతురిని కూలి పనులు చేసి పెంచాను. ఇప్పుడు వాళ్లు కూడా కూలికి పోతున్నారు. ఉండేందుకు ఇల్లు లేక అగచాట్లు పడుతున్నాం. ఇల్లు కావాలని సచివాలయానికి వెళ్తే చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నా పేరుతో ఎవరో ఇంటి బిల్లుకు సంబంధించిన మొత్తం తీసుకున్నారని తెలిసింది. దీంతో ఇప్పుడు నాకు, నా బిడ్డలకు ఇల్లు లేకుండా పోయింది. నా పేరుతో ఇంటి బిల్లు మొత్తాన్ని అక్రమంగా తీసుకున్నవారిని జైలులో పెట్టించి మాకు న్యాయం చేయండి' అంటూ విన్నవించింది. తనలాంటి అభాగ్యురాలి సొమ్ము తినేందుకు వాళ్లకు మనసెలా వచ్చిందని కన్నీరుమున్నీరైంది. ఆమె గోడు విన్న భరత్ ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

స్కాట్లాండ్ యువకుడితో తెలుగమ్మాయి ప్రేమ

- 7న హైదరాబాద్‌లో సంప్రదాయంగా పెళ్లి చేసుకోనున్న జంట
- అన్నమయ్య జిల్లాకు విచ్చేసిన వరుడి కుటుంబసభ్యులు

రాజంపేట: స్కాట్లాండ్ దేశానికి చెందిన మాథ్యూస్, అన్నమయ్య జిల్లా కారంపల్లెకు చెందిన నీమకల్లు సోనియారెడ్డి ప్రేమించుకున్నారు. త్వరలో పెద్దల సమక్షంలో పెళ్లిపీటలు ఎక్కనున్నారు. వివరాల్లోకి వెళితే...కారంపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కుమార్తె నీమకల్లు కౌసల్యారెడ్డి యూకేలో స్థిరపడ్డారు. ఆమె కుమార్తె సోనియారెడ్డి యూకేలోనే మెంబర్ ఆఫ్ రాయల్ కాలేజ్ జనరల్ ప్రాక్టీషనర్ విద్య పూర్తి చేశారు. చదువుకునే రోజుల్లో మాథ్యూస్ అనే వ్యక్తితో ఆమెకు స్నేహం ఏర్పడింది. ఆయన కూడా హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్యను అభ్యసించి వ్యాపార రంగంలో ఉన్నారు. వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమను ఇరువురు పెద్దలు అంగీకరించారు. ఈ నెల 7న సంప్రదాయబద్ధంగా హైదరాబాద్‌లో వీరు పెళ్లి చేసుకోనున్నారు. వివాహానికి ఇరుకుటుంబాలు కారంపల్లికి చేరుకోవడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. విదేశీయులతో స్థానికులు ముచ్చటించడం ఆకట్టుకుంది. తెలుగువారి సంప్రదాయాలు తమకు నచ్చాయని వారు చెబుతున్నారు.

అమరావతి అభివృద్ధికి గుదిబండ చంద్రబాబు

- 1,039వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: ఆనాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అమరావతిలో బాబు నిలువు దోపిడీ చేస్తే.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,039వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. కోర్టుల్లో కేసులు వేసి అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటూ బాబు శకునిలా తయారయ్యాడని ధ్వజమెత్తారు. అమరావతి ఐకానిక్ వంతెన నిర్మిస్తానని చెప్పిన బాబు ముడుపులు అందుకుని పలాయనం చిత్తగిస్తే.. టెండర్లు పూర్తిచేసి శరవేగంగా రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. కరకట్ట రోడ్డు విస్తరణ పనుల నిర్వహణకు టెండర్లు పూర్తయి రాజధానికి రాచమార్గం నిర్మించే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. అసైన్డ్, లంక భూములకు సంబంధించి 20 వేల మంది పేద రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా యాజమాన్య పట్టాలిచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు పేద రైతులు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసి చిట్‌ఫండ్ మోసాలు చేసిన కేసుల్లో ఇరుక్కున్న రామోజీ తన బురద కడుక్కోలేక ప్రభుత్వంపై బురద చల్లాలని చూడటం సిగ్గుచేటన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, బొలిమేర శ్యామ్యూల్, పులి దాసు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నిందితులను యాంత్రికంగా అరెస్టు చేయొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: గరిష్టంగా ఏడేళ్ల జైలు శిక్ష పడే కేసులో నిందితులను యాంత్రికంగా, అనవసరంగా అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని హైకోర్టులకు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలకు సూచించింది. వైవాహిక వివాదానికి సంబంధించిన కేసులో జార్ఖండ్ హైకోర్టు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ మహ్మద్ అష్ఫాక్ అలామ్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వును తోసిపుచ్చుతూ నిందితుడికి ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది.

కేంద్ర పోలీస్ విభాగాల్లో 1.14 లక్షల ఖాళీలు

న్యూఢిల్లీ: సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఢిల్లీ పోలీసు వంటి కేంద్ర పోలీస్ విభాగాల్లో 1,14,245 ఉద్యోగాలు ఇంకా భర్తీ చేయాల్సి ఉందని కేంద్రప్రభుత్వం బుధవారం వెల్లడించింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా బుధవారం ఈ వివరాలు తెలిపారు. ఈ ఏడాది 31,879 పోస్టులకు ప్రకటనలు జారీచేయగా ఇప్పటిదాకా 1,126 పోస్టులే భర్తీ అయ్యాయి. కేంద్ర హోం శాఖ, దాని విభాగాలైన బీఎస్ఎఫ్, సశస్త్ర సీమా బల్, సీఆర్‌పీఎఫ్, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్, అస్సాం రైఫిల్స్, సీఐఎస్ఎఫ్, కేంద్ర పోలీసు సంస్థలు, ఢిల్లీ పోలీస్ ఇలా అన్ని విభాగాల్లో మొత్తంగా 1,14,245 ఖాళీలు ఉన్నట్లు మంత్రి తెలిపారు. వీటిలో షెడ్యూల్ కులాల పోస్టులు 16,356 ఉన్నాయి. షెడ్యూల్ తెగలకు 8,759, ఇతర వెనుకబడిన వర్గాలకు 21,974, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 7,394 పోస్టులు, మిగతా 59వేలకుపైగా జనరల్ కేటగిరీ పోస్టులు ఉన్నాయి.

ఆ 20 వర్సిటీలు నకిలీవి

న్యూఢిల్లీ: దేశంలో మరో 20 సంస్థలు విశ్వవిద్యాలయాలుగా చెలామణి అవుతున్నాయని, అవన్నీ నకిలీవని యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) బుధవారం ప్రకటించింది. ఈ 20 సంస్థల్లో ఎనిమిది ఢిల్లీలోనే ఉన్నట్లు పేర్కొంది. ''ఉత్తరప్రదేశ్‌లో గాంధీ హిందీ విద్యాపీఠ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎలక్ట్రో కాంప్లెక్స్ హోమియోపతి, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ (ఓపెన్) యూనివర్సిటీ, భారతీయ శిక్షా పరిషత్ అనే నాలుగు నకిలీ యూనివర్సిటీలు ఉన్నాయి. పశ్చిమబెంగాల్, ఏపీల్లో రెండేసి నకిలీ వర్సిటీలున్నాయి. కర్ణాటకలో బడగాన్వీ సర్కార్ వరల్డ్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్, కేరళలో సెయింట్ జాన్స్ వర్సిటీ, మహారాష్ట్రలో రాజా అరబిక్ యూనివర్సిటీ, పుదుచ్చెరిలో శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నకిలీవే'' అని యూజీసీ కార్యదర్శి మనీశ్ జోషి స్పష్టంచేశారు.

ఢిల్లీలోని 8 నకిలీ వర్సిటీలు


ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్; కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్, దరియాగంజ్; యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ ఒకేషనల్ యూనివర్సిటీ; ఏడీఆర్–సెంట్రిక్ జ్యుడీషియల్ యూనివర్సిటీ; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్; విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్–ఎంప్లాయిమెంట్; ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ

వెలుగులు అణువంతే!

అణు బాంబు సృష్టికర్త ఒప్పెన్హీమర్ జీవిత గాథ హాలీవుడ్ తెరపైకెక్కడంతో ప్రపంచవ్యాప్తంగా మరోసారి అణు శక్తిపై చర్చ మొదలైంది. అణు పరిజ్ఞానం ఇప్పటిదాకా ఎన్నోసార్లు చర్చల్లో నానుతూనే ఉంది. ఇటీవలి కాలంలో పర్యావరణాన్ని పరిరక్షించే పునరుద్పాతక ఇంధన శక్తుల వినియోగంపై అవగాహన పెరగడంతో అణుశక్తి ప్రభ క్రమంగా తగ్గుతూ వస్తోంది. దాని స్థానాన్ని సౌర విద్యుత్ ఆక్రమిస్తోంది...

– సాక్షి, నేషనల్ డెస్క్

అణు ఇంధనం స్థానాన్ని ఆక్రమిస్తున్న సౌర విద్యుత్	ప్రపంచ వ్యాప్తంగా అణు శక్తికి తగ్గుతున్న ఆదరణ



అణు శాస్త్రవేత్త జె. రాబర్ట్ ఒప్పెన్హీమర్ 1940లో తొలిసారి అణు బాంబును సృష్టించారు. తర్వాత పదేళ్లకు 1950లో తొలి అణు విద్యుత్కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో దాన్ని ఇంధన రంగంలో గేమ్ చేంజర్‌గా భావించారు. కానీ అణు విద్యుత్కేంద్రాలు ఎంత ప్రమాదకరమో అనుభవపూర్వకంగా తెలిసొచ్చాక వాటికి ఆదరణ క్రమంగా తగ్గుతూ వస్తోంది. జపాన్, అమెరికా, ఫ్రాన్స్ తప్ప మిగతా దేశాల్లో అణు దానికి ప్రాధాన్యమూ తగ్గుతూ వస్తోంది. జర్మనీ ప్రభుత్వం 3 అణు విద్యుత్ కేంద్రాలను మూసివేయడం గమనార్హం.

1970 దశకంలో అణు విద్యుత్ ఒక వెలుగు వెలిగింది. అణు శక్తికి అది స్వర్ణయుగమని చెప్పొచ్చు. చాలా దేశాల్లో భారీగా అణు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అలా ప్రపంచ విద్యుదుత్పత్తిలో అణు విద్యుత్ వాటా 1985 కల్లా ఏకంగా 15.1% దాకా పెరిగింది. కానీ 2022 నాటికి అది 9.1 శాతానికి పడిపోయింది. సౌరవిద్యుత్ వినియోగంలోకి రావడమే దీనికి ప్రధాన కారణం. ''2021లో ప్రపంచ దేశాల్లో సౌర విద్యుత్ 1.04 టెరావాట్స్ కాగా, ప్రపంచ అణు విద్యుత్ సామర్థ్యం 463 గిగావాట్లు. అంటే అణు విద్యుత్ కంటే సౌర విద్యుత్ రెట్టింపు కంటే ఎక్కువగా ఉంది'' అని ఇస్రోలో సోలార్ ప్యానెల్ డివిజన్ మాజీ శాస్త్రవేత్త మనీశ్ పురోహిత్ చెప్పారు.

అణు వర్సెస్ సౌర విద్యుత్

- అణు విద్యుత్కేంద్రం ఏర్పాటే అత్యంత ఖరీదైన వ్యవహారం. కొత్తగా అణు ప్లాంట్ నిర్మాణానికయ్యే వ్యయం కనీసం 1,000 కోట్ల డాలర్లు.
- అణు విద్యుదుత్పత్తి వల్ల వెలువడే అణు ధార్మిక వ్యర్థాల నిర్మూలన అత్యంత ప్రమాదంతో కూడిన వ్యవహారం.
- ఒక్కో అణు విద్యుత్కేంద్రం నుంచి ఏటా కనీసం 20 మెట్రిక్ టన్నుల అణు ధార్మిక వ్యర్థాలు వెలువడతాయి.

➤ ప్రస్తుతం అన్ని దేశాల వద్దా కలిపి 90 వేల మెట్రిక్ టన్నుల అణు ధార్మిక వ్యర్థాలున్నాయి. వీటిని అత్యంత సురక్షిత పద్ధతిలో నిర్మూలించకపోతే ఎన్నో రకాలుగా తీవ్ర ముప్పు వాటిల్లుతుంది.

➤ పైగా అణు విద్యుత్కేంద్రాలతో ప్రమాదాలు కూడా ఎక్కువే. అందుకే కొత్త ప్లాంట్ల ఏర్పాటును అడ్డుకుంటూ ఎన్నో పోరాటాలు జరిగాయి, జరుగుతున్నాయి.

➤ దాంతో చాలా ఏళ్లుగా కొత్త అణు విద్యుత్కేంద్రాలేవీ రాలేదు.


➤ అమెరికా, జపాన్, ఫ్రాన్స్ మినహా మరే దేశాలు అణు విద్యుత్‌పై మొగ్గు చూపించకపోవడంతో అంతర్జాతీయంగా ఒప్పందాలు, పరస్పర సాంకేతిక సహకారం తగ్గిపోయాయి. ఫలితంగా అణు విద్యుత్ చుట్టూ చీకట్లు అలుముకున్నాయి.


సౌర విద్యుత్‌తో లాభాలు...


➤ సౌర విద్యుత్‌కు ముడి సరుకు సూర్యుడే గనుక దానికి కొరత ఉంటుందన్న భయం లేదు.

➤ సోలార్ ప్యానెల్స్, యూనిట్ల ధర బాగా తగ్గింది. సోలార్ ప్లాంట్ నిర్మాణ వ్యయం మెగావాట్‌కు 10 లక్షల డాలర్లే. సౌర విద్యుత్ వ్యర్థాలను నిర్మూలించే క్రమంలో ఎలాంటి ప్రమాదానికీ ఆస్కారం లేదు.

> అణు విద్యుత్ రియాక్టర్ల సగటు జీవిత కాలం 60 ఏళ్లు. ఇప్పుడున్న వాటిలో చాలావరకు ఇక పనికి రాని స్థితికి వచ్చేశాయి. కొత్తవి ఏర్పాటు కావడం లేదు. దాంతో అణు విద్యుదుత్పత్తి తగ్గుతూ వస్తోంది
>
> – డాక్టర్ నితేంద్ర సింగ్, ఇండియన్ యూత్ న్యూక్లియర్ సొసైటీ వ్యవస్థాపకుడు







అణ్వాయుధాలు తగ్గిపోతున్నాయ్!

➤ అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో కొన్నేళ్లు పాటు అణ్వాయుధాల పోటీయే ప్రధానంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల దగ్గర 1986 నాటికి ఏకంగా 64,452 అణ్వాయుధాలు పోగుపడ్డాయి.

➤ ఇప్పుడు వాటి సంఖ్య 12,510కి తగ్గింది. వీటిలో 89% రష్యా, అమెరికా దగ్గరే ఉన్నాయి.

➤ అణు వినాశనం ఎంత భయానకంగా ఉంటుందో హిరోషిమా, నాగసాకిపై అమెరికా అణు బాంబు దాడులతో అందరికీ తెలిసొచ్చింది.

➤ ఏళ్లు గడిచే కొద్దీ అణ్వాయుధాల తయారీని తగ్గించడంపై దేశాలన్నీ దృష్టి సారించాయి.

1968లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం కుదిరిన తర్వాత అణు శక్తిని ప్రజాప్రయోజనాలకే తప్ప, వినాశనానికి వాడొద్దని దేశాలన్నీ నెమ్మదిగా గ్రహించాయి.



హరియాణాలోని నూహ్ జిల్లాలో బుధవారం ఆందోళనకారుల దాడిలో తగలబడుతున్న దుకాణాలు

బలగాల్ని దింపండి

విద్వేష ప్రసంగాలను కట్టడి చేయండి

- ఢిల్లీలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ర్యాలీలను ఆపబోం
- సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షించండి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశ రాజధాని సమీపంలోని హరియాణాలో మత ఘర్షణలు నెలకొన్న నేపథ్యంలో ఢిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా చూడాలని పోలీసులకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. హరియాణాలో మత ఘర్షణలకు నిరసనగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఢిల్లీలో తలపెట్టిన ర్యాలీలను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీ భట్టీల సుప్రీంకోర్టు ధర్మాసనం పైవిధంగా ఆదేశాలిచ్చింది. నూహ్ జిల్లాలో జులై 31వ తేదీన వీహెచ్‌పీ ర్యాలీని అడ్డుకునేందుకు వేరే వర్గం వారు రాళ్లు రువ్వడంతో రాష్ట్రంలో చెలరేగిన మత ఘర్షణల్లో ఇప్పటిదాకా ఆరుగురు చనిపోయారు. ఢిల్లీ, సమీప ప్రాంతాల్లో వీహెచ్‌పీ ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు జరక్కుండా కట్టడిచేయాలని పాలనా యంత్రాంగానికి సుప్రీంకోర్టు సూచించింది. సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని, సంబంధిత సీసీటీవీ ఫుటేజీ, వీడియో రికార్డింగ్‌లను భద్రపరచాలని ఆదేశించింది. 'ఢిల్లీని ఆనుకుని ఉన్న హరియాణా, యూపీ ప్రాంతాల్లోనూ ర్యాలీలు జరగొచ్చు. అవసరమైతే అదనపు పోలీసు, పారామిలటరీ బలగాలను రంగంలోకి దింపండి. ఎలాంటి ఆస్తి నష్టం, హింస జరగకుండా చూడండి. ఏ మతానికి వ్యతిరేకంగానైనా విద్వేష ప్రసంగాలు జరక్కుండా అడ్డుకట్టవేయండి' అని కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం ఆదేశించింది. ఈ ఉత్తర్వులు పాలనాయంత్రాగాలకు త్వరగా అందేలా చూడాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సూచించింది. 'విద్వేష ప్రసంగాలు చేసినపుడు ఫిర్యాదు కోసం వేచిచూడకుండా వెంటనే క్రిమినల్ కేసు నమోదుచేయాలని గత ఏడాది అక్టోబర్ 21న ఢిల్లీ, యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలకు ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడూ యథాతథంగా అమలుచేయండి' అని కోర్టు గుర్తుచేసింది. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం యంత్రాంగాలతో సంప్రదించాలని కేంద్రానికి సూచించింది.

పలుచోట్ల ర్యాలీలు

ఢిల్లీ, సమీప ప్రాంతాల్లో 23 భారీ ర్యాలీలు చేపడతామన్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ పిలుపుమేరకు బుధవారం ఢిల్లీలో పలుచోట్ల ర్యాలీలు జరిగాయి. ట్రాఫిక్ స్తంభించింది. సున్నిత ప్రాంతాల్లో పోలీసులు భద్రతను పెంచారు. నిర్మాణ్ విహార్ మెట్రో స్టేషన్ వద్ద బజరంగ్‌దళ్ శ్రేణులు హనుమాన్ చాలీసా పఠించారు. వికాస్‌మార్గ్ ప్రాంతం ముట్టడికి ప్రయత్నించిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

116 అరెస్టులు: ఖట్టర్

రాష్ట్రంలో మత ఘర్షణలకు సంబంధించి ఇప్పటిదాకా 41 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి 116 మందిని అరెస్ట్‌చేశామని హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణస్థితికి చేరుకుందన్నారు. లోతైన దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని హరియణా సర్కార్ ఏర్పాటుచేసేపనిలో ఉంది.

కునోలో మరో చీతా మృతి

భోపాల్: మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్కులో చీతాల మరణాలు ఆగడం లేదు. బుధవారం ఉదయం ధాత్రి అనే ఆడ చీతా మరణించింది. దీంతో ఇటీవల కాలంలో మరణించిన చీతాల సంఖ్య తొమ్మిదికి చేరింది. ప్రస్తుతం కునో పార్కులో పద్నాలుగు చీతాలున్నాయి. ఏడు మగ చీతాలు, ఆరు ఆడ చీతాలు, ఒక పిల్ల చీతాను ఎన్‌క్లోజర్‌లో ఉంచి సంరక్షిస్తున్నారు. ఆ చీతాలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటే ఈ నెలాఖరుకు అడవిలోకి విడిచిపెట్టాలని అనుకున్నారు. కేంద్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చీతాల ప్రాజెక్టుని చేపట్టింది. నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి 20 చీతాలను తీసుకువచ్చి సంరక్షిస్తోంది. ఈ ఏడాది మార్చి నుంచి వరసగా చీతాలు మరణించడం కలకలం రేపుతోంది. వాటి కదలికలు తెలుసుకోవడం కోసం ఏర్పాటు చేసిన రేడియో కాలర్ వల్ల గాయాలై కొన్ని చీతాలు మరణించినట్టు నిపుణులు అభిప్రాయపడ్డారు. మిగతా చీతాలకు రేడియో కాలర్లను తీసేసినా మరో చీతా మరణించడంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నట్టయింది.

మోదీ నోరు విప్పాలి

మణిపూర్‌పై పార్లమెంట్‌లో విపక్షాల డిమాండ్

ఉభయ సభలు వాయిదా.. ● కలత చెంది లోక్‌సభకు స్పీకర్ ఓం బిర్లా గైర్హాజరు


న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో విపక్షాలు తమ డిమాండ్‌పై మెట్టు దిగడం లేదు. ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలో ఆందోళనలు, నినాదాలు, నిరసనలు, వాయిదాలు నిత్యకృత్యంగా మారాయి. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు తొమ్మిదో రోజు బుధవారం సైతం ఉభయ సభలను స్తంభింపజేశారు. సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలుగుతుండడంతోపాటు విపక్ష, అధికారపక్ష సభ్యుల తీరుతో కలత చెందిన స్పీకర్ ఓం బిర్లా బుధవారం లోక్‌సభకు రాలేదు. సభా గౌరవాన్ని కాపాడాలని స్పీకర్ ఆరాటపడుతున్నారని, సభ్యుల నుంచి సహకారం లభించక కలతతో సభకు హాజరు కాలేదని అధికార వర్గాలు వెల్లడించాయి.

సమాధానం చెబుతా: అమిత్ షా

లోక్‌సభ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. స్పీకర్ ఓం బిర్లా రాకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు, ప్యానెల్ స్పీకర్ మిథున్‌రెడ్డి సభాపతి స్థానంలో కూర్చొని ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వెంటనే విపక్ష ఎంపీలు మణిపూర్ అంశాన్ని లేవనెత్తారు. నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సభలో గందరగోళం నెలకొనడంతో ప్యానెల్ స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునః ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు ప్రారంభించారు. మణిపూర్ అంశంపై చర్చ ప్రారంభిద్దామని, తాము సమాధానం చెబుతానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రతిపాదించగా, విపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రధానమంత్రి రావాల్సిందేనని పట్టుబట్టారు. ఈసారి సభాపతి స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ కిరీట్ సోలంకీ సభకు సహకరించాలంటూ పదేపదే కోరినా వారు వినిపించుకోలేదు. దాంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు కిరీట్ సోలంకీ ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి, ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సులే స్పీకర్‌తో సమావేశమైనట్లు తెలిసింది.

మోదీని ఆదేశించలేను: ధన్‌ఖడ్

మణిపూర్ హింసపై రూల్ 267 కింద సభలో చర్చ చేపట్టాలంటూ రాజ్యసభలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. వాటిని తిరస్కరిస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. మణిపూర్‌లో కనీవినీ ఎరుగని హింస జరుగుతోందని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని విపక్ష నేత, కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గేకు మాట్లాడే అవకాశం చెప్పారు. ఈ దీనిపై మోదీ ఎందుకు నోరువిప్పడం లేదని నిలదీశారు. ప్రధాని రావాలనుకుంటే రావొచ్చని, రావాలంటూ ఆదేశించలేనని తేల్చిచెప్పారు. మణిపూర్ వ్యవహారంపై రూల్ 176 కింద చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. సభనుంచి వాకౌట్ చేశారు.



ఖర్గే, శరద్ పవార్‌తో ధన్‌ఖడ్ భేటీ

ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ బుధవారం ఏఐసీసీ అధినేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌తో పార్లమెంట్‌లోని తన చాంబర్‌లో సమావేశమయ్యారు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో జరుగుతున్న విపక్షాల రగడపై చర్చించారు. సభా సజావుగా సాగేలా సహకారం అందించాలని కోరారు.

'మణిపూర్'పై ప్రకటన చేసేలా మోదీని ఆదేశించండి

31 మంది ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు బుధవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో ప్రకటన చేసేలా ప్రధాని మోదీని ఆదేశించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. హింసకు స్వస్తి పలికి, సోదరభావాన్ని పెంచుకోవాలని ప్రధానే స్వయంగా ప్రజలకు పిలుపునివ్వాలని డిమాండ్ చేశారు. హరియాణా ఘర్షణలను కూడా రాష్ట్రపతి దృష్టికి తీసుకొచ్చారు. మణిపూర్‌పై చర్చ విపక్షాలకు ఇష్టం లేదని, అందుకే సభ జరగకుండా రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి ప్రహ్లాద్ జోషీ ఆరోపించారు.

సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌కు మరో ఎదురుదెబ్బ

- నెలవారీ వేతనంలో భారీ కోత
- ఇప్పటికే అవినీతి ఆరోపణలపై అరెస్టయి బెయిల్ పొందిన చంద్రబాబు సన్నిహితుడు

సింగపూర్: చంద్రబాబు నాయుడు సన్నిహితుడు, భారతీయ మూలాలున్న సింగపూర్ రవాణా శాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్‌కు వేతన చెల్లింపుల విషయంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను సాధారణ విధుల నుంచి తప్పించారు. ఆయనకు ప్రతి నెలా ఇప్పటిదాకా ఇస్తున్న 41వేల డాలర్లకు బదులు ఇకపై కేవలం 6,300 డాలర్ల వేతనమే చెల్లించాలని సింగపూర్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని లీ సీన్ లూంగ్ బుధవారం పార్లమెంట్‌లో ఈ మేరకు వెల్లడించారు. అవినీతి ఆరోపణలపై గత నెలలో అరెస్టయిన ఈశ్వరన్ తర్వాత బెయిల్‌పై బయటికొచ్చి విచారణకు హాజరవుతున్నారు. సింగపూర్ ప్రజా సేవల విభాగం 2023 ఏడాది గణాంకాల ప్రకారం ఒక మంత్రికి జీతభత్యంగా నెలకు 41వేల డాలర్లు(సుమారు రూ.34 లక్షలు) చెల్లిస్తారు. అంటే సంవత్సరానికి 8,20,000 డాలర్లు(సుమారు రూ.6.8 కోట్లు) జీతంగా పొందుతారు. అవినీతి కేసులో ప్రధాన పాత్రధారిగా ఉండటం, అరెస్ట్ కావడంతో ఈయనను ప్రభుత్వం మంత్రి విధుల నుంచి పక్కనబెట్టింది. ఇప్పుడు భారీ కోత కారణంగా ఆయనకు నెలకు సుమారు రూ.5.2 లక్షల జీతం ఇస్తారు. రవాణా శాఖకు కోట్ల రూపాయల నష్టం చేకూర్చారనే ఆరోపణలపై అవినీతి వ్యవహారాల విచారణ సంస్థ(సీపీఐబీ) గత నెలలో ఈశ్వరన్‌ను అరెస్ట్ చేయగా ఆయన వెంటనే బెయిల్‌పై బయటికొచ్చారు. ఆ కేసు సమగ్ర వివరాలను ఇప్పుడే బహిర్గతం చేయలేనని పార్లమెంట్‌లో ప్రధాని పేర్కొనడం తెలిసిందే.



రాజస్తాన్‌లోని ఆల్వార్ జిల్లాకు చెందిన ఓ మహిళ సోమవారం రాత్రి అచ్చం గజముఖంతో కూడిన మగ శిశువుకు జన్మనిచ్చింది. 20 నిమిషాల కంటే ఎక్కువ బతకని ఆ పసికందును చూసేందుకు జనం బారులు తీరారు.

ఎన్నికల ఫలితాల తారుమారు కేసులో...

ట్రంప్‌పై అభియోగాల నమోదు



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఆయనపై నేరాభియోగాలు నమోదయ్యాయి. అమెరికాను మోసగించే కుట్ర, పౌర హక్కులకు వ్యతిరేకంగా కుట్ర, సాక్ష్యాల తారుమారు, అధికారిక విధులను అడ్డుకునే యత్నం వంటి నాలుగు ఆరోపణలపై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ మంగళవారం ప్రకటించింది. ''అధ్యక్ష ఎన్నికల్లో ఓడినా, ఎలాగోలా అధికారంలో కొనసాగేందుకు ట్రంప్ రెండు నెలలకు పైగా శాయశక్తులా ప్రయత్నించారు. తనే నెగ్గానని, ఎన్నికల ఫలితాలను మార్చేలా కుట్ర జరిగిందని అబద్ధాలు ప్రచారం చేశారు. ఇవన్నీ అబద్ధాలే. అది ఆయనకూ తెలుసు'' అంటూ అభియోగాలను నమోదు చేసిన న్యాయ శాఖ ప్రత్యేక కౌన్సెల్ జాక్ స్మిత్ పేర్కొన్నారు. 2020 ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ గెలుపును గుర్తించేందుకు ట్రంప్ నిరాకరించడం, తన మద్దతుదారులను ఉద్దేశించి రెచ్చగొట్టే ప్రసంగం చేయడం తెలిసిందే. బైడెన్ నెగ్గినట్టు ప్రకటించేందుకు కాంగ్రెస్ సభ్యులు సమావేశమైన అధికారిక కాపిటల్ బిల్డింగ్‌పై వారు దాడికి దిగారు.

ఈ ఏడాది మూడో అభియోగం

77 ఏళ్ల ట్రంప్‌పై 2023లో ఇప్పటికే ఇది ఏకంగా మూడో నేరాభియోగం! ఓ శృంగార తారకు డబ్బు చెల్లింపులు, అధికారిక పత్రాల తరలింపు కేసుల్లో ఆయనపై రెండు అభియోగాలు నమోదయ్యాయి.

మహిళల ఆర్థికాభివృద్ధితో పురోగతి

గాంధీనగర్: మహిళల ఆర్థిక పురోగతితో దేశాభివృద్ధి సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే మహిళా సాధికారత కూడా సాధ్యపడుతుందన్నారు. మహిళలు సంపన్నులైతే ప్రపంచం సుసంపన్నంగా మారుతుందన్నారు. జీ–20 సన్నాహక సదస్సుల్లో భాగంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మహిళా సాధికారతపై మంత్రుల సదస్సునుద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. మహిళా పారిశ్రామికవేత్తలు మరింతగా రాణించడానికి ప్రభుత్వాలు చేయాల్సినదంతా చేయాలన్నారు. ''మహిళలు వాణిజ్య రంగంలోనూ విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవడమే మనందరి లక్ష్యం కావాలి. మార్కెట్, గ్లోబల్ వాల్యూ చైన్, రుణాలు వంటివి వారికి అందుబాటులోకి తీసుకురావడానికి ఉన్న అడ్డంకుల్ని అధిగమించాలి. అప్పుడే మహిళలు అందరికీ ఆదర్శంగా నిలుస్తారు'' అని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని మోదీ కొనియాడారు. ఒక ఆదివాసీ మహిళ అయి ఉండి కూడా ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రథమ మహిళగా ఎదిగారని, త్రివిధ బలగాలకు నేతృత్వం వవహిస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రభుత్వాల్లో 46% మంది మహిళలే ఉన్నారని గుర్తు చేశారు.

ట్రూడో దంపతుల విడాకులు



టొరంటో: దాదాపు 18 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకబోతున్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో దంపతులు బుధవారం ప్రకటించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ఈ కఠిన నిర్ణయానికి వచ్చినట్టు ట్రూడో, ఆయన భార్య సోఫీ గ్రెగరీ ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. ఈ జంట ఇప్పటికే తమ విడాకుల సంబంధ చట్టపర అంగీకార పత్రంపై సంతకాలు చేసినట్టు ప్రధాని కార్యాలయం పేర్కొంది. వారు 2005 ఏడాదిలో వివాహం చేసుకున్నారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అధికారంలో ఉంటూ విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించిన రెండో కెనడా ప్రధాని ట్రూడో. ఆయన తండ్రి, మాజీ ప్రధాని పియరీ ట్రూడో కూడా విడాకులు తీసుకున్నారు. దేశంలో అత్యంత ప్రభావశీల వ్యక్తిగా పేరొందిన తండ్రి నుంచి జస్టిన్ రాజకీయ వారసత్వం పుణికిపుచ్చుకున్నారు. 2015లో ప్రధానిగా పగ్గాలు చేపట్టారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 3 । ఆగస్టు । 2023



నిరసన

జీతాలను పెంచాలని, ఇతర డిమాండ్లను తీర్చాలని బుధవారం బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో దినసరి వేతన ఉద్యోగుల ధర్నా

న్యూస్‌రీల్

సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

దొడ్డబళ్లాపురం: సైడ్ ఇవ్వలేదనే కోపంతో యువకుల గుంపు కేఎస్‌ఆర్‌టీసీ బస్సు డ్రైవర్‌ను చితకబాదిన సంఘటన దొడ్డ తాలూకా దొడ్డబెళవంగల వద్ద జరిగింది. వివరాలు.. మంగళవారం సాయంత్రం దొడ్డ తాలూకా మాదేశ్వర గ్రామం వద్ద ముందు వెళ్తున్న కేఎస్ ఆర్‌టీసీ బస్సు ఆటోకు సైడ్ ఇవ్వలేదనే కోపంతో ఆటోలోని నలుగురు యువకులు బస్సును అడ్డగించారు. డ్రైవర్ ప్రసన్నను పట్టుకుని తీవ్రంగా కొట్టారు. అడ్డుకున్న కండక్టర్, ప్రయాణికులపై కూడా దాడి చేశారు. గాయపడ్డ డ్రైవర్ ఆస్పత్రి చేరాడు. కేసు నమోదు చేసుకున్న దొడ్డబెళవంగల పోలీసులు గలిబిలికోట గ్రామానికి చెందిన గోవిందరాజు, హనుమంతరాజు, నరసింహరాజు అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

అవయవదానంతో పలువురికి పునర్జన్మ

మైసూరు: బ్రెయిన్ డెడ్ అయిన చామరాజనగర జిల్లా గుండ్లుపేటకు చెందిన హెచ్‌ఆర్ రాకేశ్ అనే వ్యక్తి మరణించీ పలువురికి ప్రాణదానం చేశారు. అవయవాలను దానం చేయడంతో ఐదు మందికి కొత్త జీవితం లభించింది. వివరాలు.. గత నెలాఖరులో తల తిరుగుతోందని ప్రైవేటు ఆస్పత్రిలో రాకేశ్ చేరాడు. జూలై 29న మెదడులోని కొంత భాగం పని చేయకపోవడంతో కోమాలోకి వెళ్లాడు. వైద్యులు పరిశీలించి బ్రెయిన్ డెడ్ అని, కోలుకోవడం కష్టమని తెలిపారు. అవయవదానం చేయాలని వైద్యులు కోరగా కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆయన దేహం నుంచి మూత్రపిండాలు, కాలేయం, హృదయ కవాటాలు, కళ్లను సేకరించారు. ఒక మూత్రపిండాన్ని మైసూరు జేఎస్‌ఎస్ ఆస్పత్రికి, కళ్లను కేఆర్ ఆస్పత్రికి, హృదయ కవాటాలను బెంగళూరుకు పంపారు. ఇటీవలికాలంలో మైసూరులో అవయవదానాలు పెరగడం విశేషం.

రూ.కోట్లాది నగలతో కుదువ వ్యాపారి పరార్

మైసూరు: జనం తాకట్టు పెట్టిన బంగారు నగలతో దుకాణ యజమాని పరారయ్యాడు. దీంతో వందలాది మంది లబోదిబోమన్నారు. ఈ ఘటన జిల్లాలోని హుణసూరులో జరిగింది. హుణసూరు బజార్ రోడ్డులో వినాయక జ్యువెల్లరీ షాపును రాజస్తాన్‌కు చెందిన ప్రీతేశ్ అలియాస్ పింటూ అనే వ్యాపారి గత పదేళ్ల నుంచి నడుపుతున్నాడు. స్థానికంగా స్టోర్ వీధిలోని ఇంట్లో ఉంటున్నాడు. పలువురు స్థానికులు అవసరాల కోసం తమ బంగారు నగలు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకెళ్లారు. ఇలా వందలాది మంది ఇతని వద్ద కోట్లాది రూపాయల విలువ చేసే ఆభరణాలను కుదువ పెట్టారు. దీంతో దుర్బుద్ధి పుట్టిన వ్యాపారి నగలను మూటకట్టుకుని రాత్రికిరాత్రి కుటుంబ సభ్యులతో కలసి స్వస్థలానికి పారిపోయాడు. బుధవారం దుకాణం మూసి ఉండడంతో అనుమానం వచ్చిన జనం ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. వారి ఫిర్యాదు మేరకు హుణసూరు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

ఫ్లవర్ షోకు ముమ్మర ఏర్పాట్లు

బనశంకరి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్‌లో నిర్వహించే ఫలపుష్ప ప్రదర్శనకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఈసారి ఫ్లవర్‌షో థీమ్ కెంగల్ హనుమంతయ్య, విధానసౌధ కాగా గ్లాస్ హౌస్‌లో విధానసౌధ నిర్మాత కెంగల్ హనుమంతయ్య నిలువెత్తు విగ్రహం, విధానసౌధ పుష్ప ఆకృతుల తయారీ ఊపందుకుంది. గ్లాస్ హౌస్ నలుదిక్కులా వివిధ రకాల పుష్ప పిరమిడ్ ఆకృతులను ఇప్పటికే ఏర్పాటు చేశారు. పుష్ప తోరణాలు, నెమలి ఆకృతిని తీర్చిదిద్దారు. దేశ విదేశాలకు చెందిన పుష్పాలు కనువిందు చేయనున్నాయి. శుక్రవారం సాయంత్రం ప్రారంభోత్సవం జరుగుతుంది.

సర్కారుకు అక్రమ ఫ్లెక్సీల సెగ

- బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?
- ప్రభుత్వం, బీబీఎంపీపై హైకోర్టు ఆగ్రహం
- తొలగింపునకు పంచవర్ష ప్రణాళిక కావాలా అని ప్రశ్న





బెంగళూరుకు పెద్ద సమస్యగా మారిన ఫ్లెక్సీలు (ఫైల్)

యశవంతపుర: రాజధానితో సహా రాష్ట్రంలో అక్రమంగా కట్టిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, బంటింగ్‌లను తొలగించక పోవడంపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వం, బీబీఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వాటిని తీసేయడానికి పంచవర్ష ప్రణాళిక ఏదైనా రూపొందిస్తారా? అని ఆక్రోశం వెలిబుచ్చింది. ఫ్లెక్సీల సమస్యపై దాఖలైన కేసును బుధవారం ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న వరాలె, న్యాయమూర్తి ఎంజీఎస్ కమల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

అక్రమంగా 60 వేల ఫ్లెక్సీలు, హోర్డింగులు

మే నెలలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో 60 వేల ఫ్లెక్సీలు, హోర్డింగులు బ్యానర్‌లను కట్టారు. ఇవన్నీ అక్రమమే. ఫిర్యాదుల ఆధారంగా 40 కేసులు నమోదు వేశారు. వాటిని కట్టిన రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎందుకు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదనే విషయం చెప్పాలని న్యాయమూర్తులు ప్రశ్నించారు. బెంగళూరు నగరం సుందరంగా ఉండడమంటే ప్రభుత్వానికి ఇష్టం లేదా అని పాలికెని, సర్కారుని నిలదీశారు.

బెంగళూరుకు మచ్చ వంటివి

బెంగళూరుకు ఇటువంటివి ఒక మచ్చ. ఇక్కడ పెట్టుబడి పెట్టే వ్యాపారవేత్తలకు బీబీఎంపీ ఇలాంటి చిత్రాలనే చూపిస్తుందా? రాష్ట్రంలో మార్పులు తీసుకురాకపోతే ఎలా పెట్టుబడిదారులు వస్తారు అని అడిగారు. ఇకపై ఒక్క ఫ్లెక్సీ, బ్యానర్, బంటింగ్ కనిపించినా బాధ్యులపై రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఫ్లెక్సీలతో స్వాగతాలు, శుభాకాంక్షలు చెప్పే వ్యక్తులపై కూడా చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామని సీజే ఘాటుగా హెచ్చరించారు.

నిషేధం ఉంది కదా !

అనధికారికంగా ఫ్లెక్సీలు కట్టడంపై 2018లో హైకోర్టు నిషేధం విధించినా ఎందుకు అమలు చేయలేదు అని న్యాయమూర్తులు ప్రభుత్వ, బీబీఎంపీ లాయర్లను ప్రశ్నించారు. అక్రమ ఫ్లెక్సీలు, హోర్డింగుల నిషేధానికి ఏం చర్యలు తీసుకుంటారో 3 వారాల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని సర్కారును, ఇటు బీబీఎంపీని ఆదేశించి కేసు వాయిదా వేశారు.

ఉత్తర.. పశ్చిమ వివాదం

- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, మంత్రి ఖండ్రేపై జ్ఞానేంద్ర తీవ్ర వ్యాఖ్యలు
- ఆవేదనతో అన్నట్లు వివరణ



మాజీ మంత్రి జ్ఞానేంద్ర

శివమొగ్గ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అంటే తనకు ఎంతో గౌరవమని, ఆవేదనతోనే అలా మాట్లాడానని బీజేపీ నేత, మాజీ మంత్రి అరగ జ్ఞానేంద్ర అన్నారు. మంగళవారం తీర్థహళ్లిలో బీజేపీ ఆందోళనలో జ్ఞానేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేపై పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు చెట్లు అంటే, మొక్కలు అంటే ఏమిటో తెలియదు, ఉత్తర కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చిన ఆయనకు మలెనాడులో ఉన్న చెట్లు, పశ్చిమ ఘాట్ల ప్రత్యేకత ఎలా తెలుస్తుంది? వారు ఉండే ఉత్తర కర్ణాటక ప్రాంతం ఎలా ఉంటుందంటే అక్కడి మల్లికార్జున ఖర్గే ముఖం చూస్తే తెలుస్తుంది. ఆయన ముఖం మాడిపోయి ఉంటుంది. ఖర్గేను చూస్తే పాపం అనిపిస్తుంది. తలపై ఉన్న కొద్ది వెంట్రుకలతో ఎండ వేడిమి నుంచి తప్పించుకుంటున్నాడు. ఆయనకు మలెనాడు, పశ్చిమ ఘాట్లలోని జీవనం గురించి ఏమీ తెలియదు అని జ్ఞానేంద్ర విమర్శించడం అంతటా చర్చనీయాంశమైంది. దీనిపై విమర్శలు వ్యక్తంకావడంతో బుధవారం వివరణ ఇచ్చారు. మలెనాడుకు శాపంగా మారిన కస్తూరి రంగన్ నివేదికను వ్యతిరేకిస్తూ తాను ఖండ్రేను విమర్శించినట్లు తెలిపారు. వారిద్దరూ అంటే తనకు ఎంతో గౌరవమని అన్నారు.

నిమ్హాన్స్‌లో చేర్పిస్తాం: డీకే

యశవంతపుర: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుడు అరగ జ్ఞానేంద్రను నిమ్హాన్స్‌కు తరలిస్తామని డీసీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. మంత్రి ఈశ్వర్ ఖండ్రే, ఖర్గేల గురించి జ్ఞానేంద్ర చేసిన వ్యాఖ్యలను డీకే బుధవారం ఢిల్లీలో ప్రస్తావించారు. నిమ్హాన్స్ ఆస్పత్రి చాలా బాగుంది. ఆయనకు అక్కడే చికిత్స చేయిస్తామన్నారు.



బెంగళూరు ప్యాలెస్ మైదానంలో జాతీయ గార్మెంట్స్ సంఘం వస్త్ర ప్రదర్శన ఆరంభమైంది. ఇందులో పాల్గొన్న నటీమణి శరణ్య శెట్టి

వేట.. ఆట





జింకలు దగ్గరలోనే ఉండడం చూసి వేట కోసం మాటువేసిన పులిరాజు. చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా పరిధిలో బండీపుర అడవుల్లో బుధవారం కనిపించిన జింకలు- పెద్ద పులి దృశ్యాలు

నాకంటే వెనకొచ్చి సీఎం అయ్యారు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాయరెడ్డి

గంగావతి రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసంతృప్తుల బెడద పెరిగిందని యలబుర్గా కాంగ్రెస్ ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి వాపోయారు. ఆయన బుధవారం కొప్పళ జిల్లా కుకనూరు పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తన కంటే తర్వాత ఎమ్మెల్యే అయినవారు ముఖ్యమంత్రులయ్యారన్నారు. అందుకు నియోజకవర్గం ప్రజలు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. మన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను చూడండి, కాంగ్రెస్‌లోకి వచ్చి రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. కాంగ్రెస్‌లో తన వెనుక నడిచిన వాళ్లంతా మంత్రులయ్యారని అసంతృప్తి వెలిబుచ్చారు. సిద్దరామయ్య సంక్షేమ బడ్జెట్‌ను ప్రకటించారన్నారు. సీనియర్ ఎమ్మెల్యే అయిన రాయరెడ్డికి ఈ దఫా మంత్రి పదవి దక్కకపోవడంతో అసహనానికి లోనయ్యారు.

ఆహార వీధికి హంగులు

- ఎరుపు రంగు రోడ్డు నిర్మాణం



కూల్చివేసిన జలకంఠేశ్వర ఆలయ గోడను కట్టిన దృశ్యం

బనశంకరి: విశ్వేశ్వరపురంలోని ఫుడ్ స్ట్రీట్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీబీఎంపీ దక్షిణ వలయ కమిషనర్ జయరామ్ రాయపుర అధికారులకు సూచించారు. బుధవారం విశ్వేశ్వరపురం ఆహార వీధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయని, రోడ్డుకు ఇరువైపులా 3 మీటర్లు వెడల్పున ఫుట్‌పాత్ మార్గం, విద్యుత్ దీపాలు అమర్చడంతో పాటు ఇతర పనులు జరుగుతున్నాయన్నారు. 200 మీటర్లు పొడవునా రోడ్డుపై ఐరన్ ఆక్సైడ్ రంగు వేస్తున్నామని, 70 శాతం సిమెంట్ రోడ్డు పని పూర్తయిందని చెప్పారు.

సమీపంలోని పురాతన జలకంఠేశ్వర ఆలయాన్ని సందర్శించి కూల్చిన గోడను పరిశీలించారు. మంగళవారం పాలికె సిబ్బంది తొందరపాటుగా ఆలయాన్ని కూల్చివేయడానికి యత్నించడం తెలిసిందే. దీనిపై స్థానికులు నిరసన తెలిపారు. ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి చేరిందని, పక్కనే ఉన్న షాపు బోర్డును జేసీబీతో తొలగిస్తుండగా అనుకోకుండా ఆలయం గోడ కూలిందని చెప్పారు. మరమ్మత్తు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాలికె ఇంజనీర్లు రాజేశ్, మహంతేశ్, యరప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆహార వీధిలో సిమెంటు రోడ్డు నిర్మించి ఎరుపు రంగు వేస్తున్న కార్మికులు

గొడవలు కట్టిపెట్టాలి



పార్లమెంటు ఎన్నికల్లో అధిక సీట్లపై హస్తం దృష్టి

- లోక్‌సభ ఎన్నికల కోసం పని చెయ్యండి
- రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఢిల్లీలో క్లాస్

శివాజీనగర: రానున్న లోక్‌సభ ఎన్నికలు అతి ప్రాముఖ్యమైనవి. ఈ ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుపొందాలి. కాబట్టి గొడవలను పక్కనపెట్టి విజయం కోసం ఇప్పటినుంచే దృష్టిసారించాలని సీఎం సిద్దరామయ్య, మంత్రులు సహా కాంగ్రెస్ నాయకులకు పార్టీ నాయకత్వం ఆదేశించింది. బుధవారం ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. లోక్‌సభా ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 నెలలు మాత్రం అయింది. అసంతృప్తి వంటివి అధికం కాకుండా జాగ్రత్తలు తీసుకొని లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు వైపు అందరూ దృష్టిసారించాలి. పార్టీ కోసం అందరూ త్యాగానికి సిద్ధం కావాలని సందేశాన్ని ఈ సమావేశంలో అధినాయకులు ఇచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇందులో పాల్గొన్నారు. ఇటీవలికాలంలో సర్కారులో తలెత్తిన అసమ్మతి గురించి చర్చించారు. నాయకులకు అహంకారం తగదని, ఎమ్మెల్యేలు బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేయరాదని సూచించారు.

అందరూ హస్తినలో మకాం

రాష్ట్రం నుంచి మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు అందరూ ఢిల్లీకి వెళ్లిపోయారు. దీంతో బెంగళూరులో విధానసౌధతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఆఫీసులు బోసిపోయాయి. సమావేశాలను ముగించుకుని గురువారం తిరిగి రానున్నారు. మాజీ సీఎం జగదీశ్ శెట్టర్, మాజీ డీసీఎం లక్ష్మణ్ సవది కూడా ఈ భేటీల్లో పాల్గొన్నారు.



బుధవారం కొడగు జిల్లా మడికెరి వద్ద కక్కడ పడ్నెట్ వేడుకను నిర్వహించిన కొడవలు. వరి నారు మడిని పొలంలో నాటే సమయంలో ఈ సంబరం చేసుకుంటారు

ఘరానా క్యాబ్ డ్రైవర్

- మహిళా ప్రయాణికురాలికి బ్లాక్‌మెయిల్
- రూ. 22 లక్షలు, 750 గ్రాముల బంగారం వసూలు
- పోలీసులకు ఫిర్యాదుతో అరెస్టు



కృష్ణరాజపురం: ఉద్యాన నగరిలో క్యాబ్ కార్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు జాగ్రత్తగా ఉండాలనేందుకు ఇదొక ఉదాహరణ. క్యాబ్‌లో మహిళ స్నేహితునితో మాట్లాడిన మాటలను ఆయుధంగా మార్చుకుని బ్లాక్‌మెయిల్ చేసిన డ్రైవర్ ఆమె వద్ద నుంచి లక్షలాది రూపాయలను, బంగారాన్ని దోచుకున్నాడు. ఈ ఘటనలో హెసరఘట్ట నివాసి అయిన క్యాబ్ డ్రైవర్ కిరణ్ కుమార్ (35)ని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

బాల్య స్నేహితుడినంటూ..

వివరాలు.. కొంతకాలం కిందట ఇందిరా నగర నుంచి బాణసవాడికి వెళ్లాలని ఒక మహిళ క్యాబ్ బుక్ చేసింది. క్యాబ్‌లో ప్రయాణిస్తుండగా తన క్లాస్‌మేట్‌తో వ్యక్తిగత సమస్యలపై మాట్లాడింది. ఆ మాటలను విన్న డ్రైవర్ కిరణ్ కొన్ని రోజుల తర్వాత మహిళ మొబైల్‌కు మెసేజ్ చేశాడు. నీ బాల్య స్నేహితుడినని చెప్పుకోగా ఆమె నిజమేననుకుంది. ఆ తర్వాత ఫోన్లో పరిచయం పెంచుకుని తనకు ఆర్థిక సమస్య ఉందని, సాయం చేయాలని కోరాడు. బాల్య స్నేహితుడు అని భావించి జాలితో కొంత డబ్బు పంపింది. ఇలా రూ. 22 లక్షల వరకు అతడు వసూలు చేసి జల్సాలు చేశాడు. కొన్నిరోజులకు డ్రైవర్ తన స్నేహితుడు కాదని ఆమె తెలుసుకుని మాట్లాడడం మానేసింది.



క్యాబ్ డ్రైవర్ నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

భర్తకు చెబుతానని

కొన్నిరోజులు ఊరికే ఉన్న క్యాబ్ డ్రైవర్ మళ్లీ తిరిగి బెదిరించడం ప్రారంభించాడు. నీకు, నీ స్నేహితునికి మధ్య ఉన్న విషయాలను నీ భర్తకు చెబుతానని బెదిరించాడు. నీ భర్తకు తెలిస్తే సంసారం నాశనం అవుతుందని భయపెట్టాడు. దీంతో భీతిల్లిన మహిళ.. తన వద్ద ఉన్న సుమారు 750 గ్రాముల బంగారు ఆభరణాలను ఇచ్చింది. కొన్నాళ్లకు బంగారం లేదని తెలుసుకున్న భర్త భార్యను ప్రశ్నించగా జరిగిన ఉదంతం మొత్తం చెప్పింది. వెంటనే భార్యను తీసుకుని రామ్మూర్తినగర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘరానా క్యాబ్ డ్రైవర్ కిరణ్‌ను అరెస్టు చేసి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.



నిందితుడు కిరణ్

ఆదర్శప్రాయుడు బళ్లారి రాఘవ

- రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాఘవ ప్రశస్తుల ప్రదానం
- తలెదండ సామాజిక కన్నడ నాటకం ప్రదర్శన



బళ్లారి రాఘవ రాష్ట్ర, జిల్లా ప్రశస్తిని పొందిన కళాకారులతో నిర్వాహకులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాఘవ అసోసియేషన్ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: నాటక రంగంలో నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ ఆదర్శ ప్రాయుడని బళ్లారి రాఘవ మెమోరియల్ అధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక రాఘవ కళామందిరంలో బళ్లారి రాఘవ 143వ జయంతిని, రాఘవ ప్రశస్తుల ప్రదానం, నాటకోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. షేక్స్పియర్ రచించిన నాటకాల్లో ప్రేక్షకులను మైమరపించేలా నటించిన ఘనత బళ్లారి రాఘవకే దక్కిందన్నారు. అనంతరం మాజీ ఉపాధ్యక్షులు ఎస్.బసవరాజ్ మాట్లాడుతూ నవరసాలను ఆంగ్ల, తెలుగు నాటకాల్లో అద్వితీయంగా పలికించి బళ్లారి ఖ్యాతిని విశ్వ వ్యాప్తం చేసిన అజరామరుడు బళ్లారి రాఘవ అన్నారు. ఊరి పేరును తన నామంతో సార్థకం చేసుకుని విశ్వ నటభూషణుడిగా రక్తికట్టించాడన్నారు. నాటకం రంగం ఉన్నంత వరకు బళ్లారి రాఘవ చిరస్మరణీయుడన్నారు. ఈసందర్భంగా బాగలకోటె జిల్లా ఇళకల్‌కు చెందిన ఉమారాణి మారిగిడద బళ్లారి రాఘవ రాష్ట్ర ప్రశస్తిని అందుకున్నారు. బళ్లారికి చెందిన కే.ఓంకారమ్మ, పీఎం.నటరాజ్ జిల్లా ప్రశస్తులను దక్కించుకున్నారు. నిర్దేశకులు మహదేవయ్య, డాక్టర్ గిరీష్ కార్నాడ్ రచించిన తలెదండ సామాజిక నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కే.చెన్నప్ప, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ పాటిల్, కార్యదర్శ ఎస్.ప్రకాష్, కోశాధికారి ధనుంజయ్య, సంయుక్త కార్యదర్శి ఎం.రామాంజినేయలు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాఫీగా గృహలక్ష్మి నమోదు

- కేంద్రాల వద్ద తగ్గిన రద్దీ



సిద్ధార్థనగర్‌లో పేరు నమోదు చేస్తున్న మహిళ

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఐదు గ్యారంటీల్లో ఒకటైన గృహలక్ష్మి పథకం కింద మహిళల పేర్ల నమోదుకు గత నాలుగు రోజుల నుంచి నగరంలో ఆయా వార్డుల్లో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేయడంతో గృహలక్ష్మి నమోదు సాఫీగా సాగుతోందని సంబంధిత అధికారి తెలిపారు. బుధవారం గృహలక్ష్మి నమోదు కేంద్రాల వద్ద మహిళలు ఇబ్బందులు లేకుండా పేర్లు నమోదు చేయించుకున్నారు. సెంటర్ వద్దకు వచ్చిన 10 నిమిషాల్లోపే అర్హత కలిగిన మహిళల పేర్ల నమోదు జరుగుతోందని కేంద్రం సిబ్బంది సురేష్ తెలిపారు.

గృహలక్ష్మికి 2.50 లక్షల మంది నమోదు

హుబ్లీ: ధార్వాడ జిల్లాలో గృహలక్ష్మి పథకం కింద 4,16,582 మంది లబ్ధిదారులకు గాను గత నెల 31వ తేదీ వరకు 2,52,280 మంది లబ్ధిదారులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇంకా 1,64,302 మంది పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉందని జిల్లాధికారి గురుదత్త హెగ్డే ఓ ప్రకటనలో తెలిపారు.

కన్న తల్లిని, మాతృ భూమిని మరువరాదు



మాట్లాడుతున్న గాలి సోమశేఖర్‌రెడ్డి

బళ్లారిటౌన్: కన్న తల్లిని, మాతృ భూమిని ఎప్పటికీ మరువరాదని మాజీ ఎమ్మెల్యే జీ.సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కన్నడ సాహిత్య పరిషత్, శ్రీమేధా డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో దివంగత రుక్మిణమ్మ, చెంగారెడ్డిల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన దత్తి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కన్న తల్లి ఒడిని, మాతృ భూమిని స్వర్గంగా భావించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్, లెక్చరర్ జీ.శామ్ మూర్తి, నేతలు వీరశేఖర్‌రెడ్డి, సునీత, జ్యోతి ప్రకాష్, చోరనూరు కొట్రప్ప, రిటైర్డ్ ఎస్‌ఐ హుస్సేన్‌సాబ్, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

ఆ ఇంజినీర్ నియామకం వద్దు

రాయచూరు రూరల్: విభాగ గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్‌గా సయ్యద్ ఫజుల్ మహ్మద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఉప సంహరించుకోవాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. అక్రమ సంపాదనతో లోకాయుక్త అధికారుల వలలో చిక్కిన అధికారిని రాయచూరుకు నియమించడంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. కొప్పళలో విధులు నిర్వహించిన మహ్మద్ నిజస్వరూపం కనబడడంతో సర్కార్ సస్పెండ్ చేసి రాయచూరుకు కేటాయిస్తూ చేసిన బదిలీని రద్దు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

బిడ్డకు తల్లి పాలు శ్రేష్టం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేష్ఠమని చంద్రబండ పీహెచ్‌సీ వైద్యాధికారి సంగమేష్ పేర్కొన్నారు. బుధవారం తాలూకాలోని చంద్రబండ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ప్రపంచ స్తన్యపాన దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు అమృతంతో సమానమన్నారు. కాగా నగరంలోని మావినకెరె పీహెచ్‌సీలో తాలూకా అధికారి షాకీర్, వైద్యాధికారి విజయ్ ప్రపంచ స్తన్య పాన దినోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేష్, కృష్ణవేణి, రవిలున్నారు.

గంజాయి చాక్లెట్ల విక్రేతల అరెస్ట్



పట్టుబడిన విక్రేతలతో పోలీసులు

రాయచూరు రూరల్: నగరంలో చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్న ముఠాను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. రూ.30, రూ.50, రూ.100లకు ఆరు గ్రాముల బరువుతో కూడిన చాక్లెట్(మిఠాయి) రూపంలో విక్రయాలు నడుస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ మాదిరిగా రాయచూరులో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో మార్కెట్ యార్డు పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారులు కలిసి లాల్ బహదూర్ శాస్త్రినగర్, పరిశ్రమల కేంద్రాల్లో పాషా, శ్రీఆనంద్ మునక పేర్లతో తయారైన 480 చాక్లెట్లను స్వాధీనం చేసుకొని, వాటిని సరఫరా చేస్తున్న రాచయ్య స్వామి, అమరయ్యలను అరెస్ట్ చేశారు. ఈ చాక్లెట్ల తయారీదారుల ఆచూకీ కోసం ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న గ్రామ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: కొర్లగుంది జీపీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షులు దొడ్డ కేశవరెడ్డి తెలిపారు. బుధవారం కొర్లగుంది జీపీలో 18 మంది సభ్యులు కలిసి గ్రామస్తుల సమక్షంలో ముందుగానే చర్చించుకున్న ప్రకారం దొడ్డ కేశవరెడ్డి కుమారుడు వీ.రాఘవరెడ్డిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షురాలుగా చలువాది మరియమ్మను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారి యోగేశ్వర్, పీడీఓ ప్రకాష్ అమరశెట్టిల సమక్షంలో జీపీ సభ్యులు కలిసి ఏకగ్రీవంగా తన కుమారుడిని అధ్యక్షునిగా ఎన్నుకోవడంతో పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, రైస్‌మిల్ ఈరప్పయాదవ్, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భీమరెడ్డి, బీ.మారెప్ప, సన్నమారెప్ప, బసరకోడు హొన్నూరప్ప, బైలూరు వెంకటేష్, రామచంద్ర, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

అంజనాద్రికి రైల్వేను అనుసంధానిస్తాం

- ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి రూరల్: తాలూకాలోని అంజనాద్రిని సందర్శించుకునే భక్తుల కోసం గంగావతి రైల్వే స్టేషన్‌కు దేశంలో ఉండే పవిత్ర పుణ్యక్షేత్రాలతో రైల్వే అనుసంధానం చేసే దిశగా సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల విశ్వాసాన్ని తీసుకొని ముందడుగు వేస్తామని ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం గంగావతి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వేదికలో ఆనాటి జ్ఞాపకాలను ప్రస్తావించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ 2008లో యడియూరప్ప ప్రభుత్వంలో ఆనాడు పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న గాలి జనార్ధన్ రెడ్డి దరోజీ నుంచి బాగలకోటే రైలు మార్గ నిర్మాణానికి రూ.350 కోట్ల గ్రాంట్ మంజూరు చేయించారన్నారు. ఆనాటి నుండి ఇప్పటి వరకు దరోజీ నుంచి బాగలకోటె వరకు రైలు మార్గం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ ప్రయత్నంలో భాగంగా భూ సర్వేకు రూ.90 లక్షలు మంజూరయ్యాయన్నారు.ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డి సంబంధిత అధికారులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఈ పనులను మరింత వేగవంతం చేయించాలని కోరారు. రైల్వే పోరాట సమితి సభ్యులతో పాటు కేఆర్‌పీపీ రాష్ట్రాధ్యక్షుడు భీమాశంకర్ గౌడ, జిల్లా అధ్యక్షుడు మనోహర్ గౌడ, శివణ్ణ, యువ ఘటక అధ్యక్షులు యమనూర్ చౌడ్కి, రాజేశ్ రెడ్డి, యమనూరప్ప పుండలీక, జిలాని పాషా, ముస్తాక్ అలీ, హుసేన్ బాష తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై సీఎం సానుకూల స్పందన

నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం నగరంలో పాత్రికేయులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాల నిధులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారన్నారు.

జీపీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రాయచూరు రూరల్: యాపలదిన్ని జీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఈ ఘటనలో కంప్యూటర్, రికార్డులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయింది. మొదట పైఅంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకోగా, అనంతరం కింది భవనానికి అంటుకోవడంతో గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనపై యాపలదిన్ని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

చక్కెర కర్మాగారం భూమి రద్దుకు కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ

హొసపేటె: నగరలోని శివార్లలోని జంబునాథ ఏరియాలో గత బీజేపీ ప్రభుత్వం చక్కెర కర్మాగారం కోసం కేటాయించిన సుమారు 86 ఎకరాల భూమిని రద్దు చేయమని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప జిల్లాధికారి దివాకర్‌కు లేఖ రాశారు. చిత్తవాడ్గి ఏరియాలో ఉన్న ఐఎస్‌ఆర్ చక్కెర కర్మాగారం సాంకేతిక లోపం వల్ల గత కొన్నేళ్లుగా మూతపడిన విషయం తెలిసిందే. తుంగభద్ర జలాశయ ఆయకట్టు కింద ఉన్న రైతులు ప్రతి ఏటా ఈ భాగంలో 4 లక్షల టన్నులకు పైగా చెరుకును పండిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంతకు ముందు అధికారంలో ఉన్న మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ తిరిగి నూతన చక్కెర కర్మాగారం నిర్మాణానికి జంబునాథ ఏరియా వద్ద భూమిని కేటాయించారన్నారు. కానీ ప్రస్తుతం ఆ భూములను అధికార పార్టీ ఎమ్మెల్యే రద్దు చేయాలని లేఖ రాయడంతో నగరంలో చర్చనీయంగా మారింది.

రూ.10.30 లక్షల మేర వంచన

హుబ్లీ: హుబ్లీ ధార్వాడలో ఇద్దరు వ్యక్తులకు ఇంట్లో కూర్చొనే అధిక లాభాలు గడించవచ్చని నమ్మించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.10.30 లక్షల మేర వంచించిన ఘటన హుబ్లీ సైబర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. ధార్వాడ జబుల్లా ముల్లా నుంచి రూ.4.35 లక్షలు, హుబ్లీ బైరదేవరకొప్పలో అమిత్ రొల్లి అనే వ్యక్తి నుంచి రూ.5.95 లక్షలను తమ ఖాతాల్లోకి బదలాయించుకొని వంచించారు. తాము పంపించే వీడియాలకు లైక్‌లు, షేర్లు, పాజిటివ్ కామెంట్లు చేస్తే చాలు లాభాలు వస్తాయని నమ్మించారు. ఇందులో మొదట్లో కొంత మేర లాభాలు చూపినట్లుగా నటించి ఆ తర్వాత రూ.10 లక్షలకు పైగా సొమ్ములు బదలాయించుకున్నారు.

నిలకడగా తుంగభద్ర వరద

హొసపేటె: తుంగభద్ర డ్యాంలోకి ఎగువన ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో డ్యాంలోకి వస్తున్న వరద నిలకడగా ఉంది. బుధవారం డ్యాంలోకి ఇన్‌ఫ్లో 28,600 క్యూసెక్కుల వరద చేరడంతో నీటి నిల్వ 81.540 టీఎంసీలకు చేరింది. రైతుల జీవనాడి అయిన తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటిమట్టం 1626.51 అడుగులు, ఔట్‌ఫ్లో 2099 క్యూసెక్కులు ఉందని మండలి అధికారులు తెలిపారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను ఇస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: విద్యార్థులు భక్తిశ్రద్ధలతో చదివి వారి తల్లి తండ్రులకు,వారి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. కెహెచ్ ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే ఆఫీసులో విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేశారు. గత 4 సంవత్సరాలుగా విద్యార్థులకు తాను ఫౌండేషన్ ద్వారా ఉచిత బస్‌పాస్‌లను, నోటు పుస్తకాలను వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

నాటక ప్రదర్శన

నాటకాలు సామాజిక అంశాలకు ప్రతిబింబాలనిమాజీ ఎమ్మెల్యే ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి తెలిపారు. విదురాశ్వత్థంలో రంగపయణ బృందం వారిచే నాగయ్యరెడ్డి రంగమందిరంలో ప్రదర్శించిన 55 నిమిషాల ప్రేమకథ నాటకం అలరించింది. రాష్ట్రంలో 31 మంది కళాకారులు ఏకకాలంలో 31 జిల్లాలలో 31వ తేదీ రాత్రి ఈ నాటకాన్ని ప్రదర్శించి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డును సాధించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీల అందజేత

దివ్యాంగులు సైతం సమాజంలో స్వావలంబులు కావాలని, దానికి వారికి సమాజం తోడ్పాటు అందించాలని శ్రీక్షేత్ర గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి నాగరాజనాయ్క తెలిపారు. బుధవారం ఉదయం హుదుగూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు కృష్ణప్పకు, దారినాయకనపాళ్యవాసి సావిత్రమ్మకు చక్రాల కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.





పుష్ప సోయగం

బెంగళూరు లాల్‌బాగ్ స్వాతంత్య్ర దినోత్సవ ఫల పుష్ప ప్రదర్శనకు ముస్తాబవుతున్న దృశ్యం. శుక్రవారం నుంచి ప్రదర్శన ప్రారంభం కానుంది. వివిధ రకాల పుష్పరాశులు, మయూరం చూడవచ్చు

కోలారు వార్తలు...

చిక్కతిరుపతి హుండీ ఆదాయం లెక్కింపు

- రూ.84.20 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ లభ్యం



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మాలూరు: చారిత్రక ప్రసిద్ధ యాత్రాస్థలం చిక్కతిరుపతి శ్రీప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం గత నాలుగు నెలలుగా హుండీకి వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. లెక్కింపులో మొత్తం రూ.84,22,955 నగదు, అపార ప్రమాణంలో బంగారు, వెండి ఆభరణాలు లభించాయి. ఆలయ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో సంగ్రహం కావడం ఇదే మొదటిసారి అని, ప్రభుత్వం తెచ్చిన శక్తి పథకం వల్లనే ఇది సాధ్యమైందని ఆలయ సిబ్బంది అంటున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో గత నాలుగు నెలలుగా ఆలయానికి వచ్చారని అంటున్నారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం హుండీ లెక్కింపును చేపట్టారు. ఆలయంలో మూడు హుండీలను దేవదాయ శాఖ తహసీల్దార్ సుజాత, పద్మావతి, తహసీల్దార్ కె రమేష్, ఈఓ టి.సెల్వమణి సమక్షంలో లెక్కించారు. భక్తులు నగదుతో పాటుగా 72 గ్రాముల బంగారం, 425 గ్రాముల వెండి, అమెరికా, జపాన్, ఇంగ్లండ్ తదితర దేశాల కరెన్సీలు లభ్యమయ్యాయి. భక్తులు చిరిగిన కరెన్సీ నోట్లను కూడా హుండీలో వేయడం విశేషం. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధించిన వేయి రూపాయల నోట్లు కూడా లభ్యం కావడం గమనార్హం.

సరిహద్దుల్లో కన్నడను రక్షించాలి

కేజీఎఫ్: సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ భాషను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీపీ అధ్యక్షురాలు మంజులా మహదేవ్ తెలిపారు. బుధవారం బంగారుపేట తాలూకా కదరినత్త గ్రామంలో నిర్వహించిన గడినాడు సాంస్కృతిక ఉత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సరిహద్దు భాగంలో ఇతర భాషల వారి ప్రభావం, ఆంగ్ల భాషపై వ్యామోహం వల్ల కన్నడ భాష వెనుకబడుతోందన్నారు. అయితే సరిహద్దుల్లో నిరంతరంగా కన్నడ భాషా సాహిత్యం, సంస్కృతిని పెంపొందించే ప్రయత్నాలు జరగాలన్నారు. జిల్లాలో కన్నడ భాష మనుగడకు ఎలాంటి భంగం కలుగకుండా జాగ్రత్త పడాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నివృత్త జిల్లా వయోజన విద్యాధికారి నరసింహయ్య, మంజులా జయణ్ణ, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి

శ్రీనివాసపురం: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని దాత భీమగుంటపల్లి బీవీ శివారెడ్డి తెలిపారు. బుధవారం తాలూకాలోని రాయల్పాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫిర్కా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు విద్యతో పాటు క్రీడలు కూడా భాగం కావాలన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో అభ్యసనం సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మనస్సు ఏకాగ్రతతో ఉండి అభ్యసనానికి సహకరిస్తుందన్నారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తే ప్రభుత్వ శాఖల్లో ఉన్నత ఉద్యోగాలను పొందడానికి సహాయకారి అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మామిడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నీలటూరు చిన్నప్పరెడ్డి, జీపీ ఉపాధ్యక్షుడు వైఆర్ శ్రీనివాసరెడ్డి, వెంకటశివారెడ్డి, ఈసీఓ హనుమేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోలారు: కోలారు బ్రాహ్మణ సంఘం తరపున టెన్త్, ఇంటర్ పరీక్షల్లో 2022–23వ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా భర్తీ చేసి నగరంలోని పీసీ కాలనీలో ఉన్న బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో అందించాలని సంఘం కార్యదర్శి జేఎస్ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

యోగా ప్రాణాయామంతో మెరుగైన ఆరోగ్యం

శ్రీనివాసపురం: యోగా, ప్రాణాయామంతో ఉత్తమ ఆరోగ్యాన్ని పొందవచ్చని, తద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని ఐసిరి హీలింగ్ సెంటర్‌కు చెందిన హీలర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వాసవి కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య జాగృతి కార్యక్రమంలో మాట్లాడారు. ఐసిరి హీలింగ్ సెంటర్ నుంచి ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాటక రంగానికి సేవలు భేష్



రాఘవ విగ్రహానికి పూలమాల వేసిన నేతలు

బళ్లారి టౌన్: నాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలు అపారమని బ్రాహ్మణ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, సమాఖ్య జిల్లాధ్యక్షుడు ఆర్.ప్రకాశ్‌రావు, కళాకారులు జీఆర్ వెంకటేశ్వర పేర్కొన్నారు. బుధవారం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో రాయల్ సర్కిల్‌లో రాఘవ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలార్పణ చేసి మాట్లాడారు. కన్నడ, తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వేసిన నాటకాల్లో కీలక పాత్రలు పోషించి విదేశాల్లోను మన దేశ కీర్తిని చాటారని కొనియాడారు. కళాకారులు, ఇతర అభిమానులు రాఘవ విగ్రహాన్ని రాయల్ సర్కిల్‌లో ప్రతిష్ఠించడం వల్ల ఎంతో మేలు చేసినట్లయిందన్నారు. కార్యక్రమంలో పదాధికారులు శ్రీనాథ్, రవీంద్రనాథ్, హరిప్రసాద్, గిరి, నేమకల్‌రావు, సతీష్, నందకిషోర్, కళాకారులు జగదీశ్, నాగభూషణ పాల్గొన్నారు.

సేవా భద్రతకు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాస్

రాయచూరు రూరల్: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా భద్రత కల్పించాలని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత 15 ఏళ్లుగా 10 వేల మందికి పైగా అతిథి అధ్యాపకులు సేవలు అందిస్తున్నారన్నారు. పంజాబ్, హరియాణ, ఆంధ్రప్రదేశ్, న్యూఢిల్లీలో 12 నెలల విధులకు నెలకు రూ.50 వేల చొప్పున వేతనం అందిస్తున్నారన్నారు. బకాయి పడిన వేతనాలను చెల్లించాలన్నారు. తొలగించిన అధ్యాపకులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలన్నారు.

చిత్రదుర్గలో ప్రబలిన అతిసార

సాక్షి,బళ్లారి: చిత్రదుర్గలో కలుషిత నీరు తాగి ఆస్పత్రిలో చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మంగళవారం కలుషిత నీరు తాగి మంజుల(23) అనే మహిళ, రఘు(27) అనే వ్యక్తి మృతి చెందడంతో పాటు 20 మంది ఆస్పత్రిలో చేరగా, బుధవారం 80 మందికి పైగా కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కలుషిత నీరు తాగి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్రదుర్గలోని కవాడిగరహట్టి కాలనీలో ట్యాంకర్ నీరు తాగడం వల్ల కాలనీ వాసులకు వాంతులు, విరేచనాలయ్యాయని స్థానికులు మండిపడ్డారు. మున్సిపాలిటీ అధికారులు మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయించకపోవడంతో నీరు కలుషితమై అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన చెందారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: తాలూకా కార్యాలయ సిబ్బంది పని తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రూపా శశిధర్ రెవిన్యూ శాఖ శిరస్తేదార్ సురేష్‌పై మండిపడ్డారు. బుధవారం తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాలూకా కార్యాలయంలో అధికారులు లంచం లేనిదే ఏ పనీ చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇకనైనా మానవత్వంతో పని చేయడం నేర్చుకోండని హితవు పలికారు. తాలూకాలో వేల ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని రెవిన్యూ అధికారులు రక్షించాలని, ఆ దిశగా నామఫలకాలు వేయాలని సూచించారు. సమావేశంలో టీపీ ఈఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పట్టు ఉత్పత్తికి సూచన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: రోగరహిత నాణ్యమైన పట్టును ఉత్పత్తి చేయాలని పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టీఎం కాళప్ప సూచించారు. బుధవారం నగరంలో పట్టు ఉత్పత్తిలో సామర్థ్య వృద్ధిపై శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టు వ్యవసాయంలో రైతుల కోసం కేవీకేలో ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. వ్యవసాయంలో వాతావరణ వైపరీత్యాల వల్ల కలిగే సమస్యల నివారణకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పట్టు వ్యవసాయంలో కనిపిస్తున్న రోగాల నియంత్రణపై అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. పట్టు వ్యవసాయంలో కీటనాశకాలను ఎంత ప్రమాణంలో ఉపయోగించాలనే విషయాన్ని రైతులు తెలుసుకోవాలన్నారు. ఈ విషయంపై రైతులు శాస్త్రవేత్తలతో సమాలోచనలు జరపాలన్నారు. పట్టు పురుగుల పెంపకానికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం, డ్రిప్ ఇరిగేషన్‌కు ఇస్తున్న సహాయధనాన్ని పట్టు పరిశ్రమ శాఖ అధికారులను సంప్రదించి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ప్రముఖుడు ఎస్ఎన్ శ్రీనివాస్, విజ్ఞాని డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పంట దగ్ధం



కాలిపోయిన పంటను చూపిస్తున్న రైతు

దొడ్డబళ్లాపురం: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పంటలు కాలిబూడిదైన ఘటన చెన్నపట్టణ తాలూకా అరళాపుర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ నివాసి నాగేంద్రగౌడ రెండెకరాల భూమిలో చెరుకు,కొబ్బరి పంట వేశాడు. మంగళవారం రాత్రి విద్యుత్ మోటర్‌కు ఉన్న కనెక్షన్‌తో రాపిడి జరిగి నిప్పు రవ్వలు ఎగసి చెరుకుపంట, కొబ్బరి చెట్లు కాలిబూడిదయ్యాయి. ఎంకే దొడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బస్సుల కొరత తీర్చాలని ధర్నా

దొడ్డబళ్లాపురం: కనకపుర నుంచి బెంగళూరు వెళ్లేందుకు బస్సుల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ ప్రయాణికులు రోడ్డెక్కారు. బుధవారం ఉదయం వందలాదిమంది ప్రయాణికులు బెంగళూరు వెళ్లడానికి గంటలకొద్దీ వేచి ఉన్నారు. బస్సులు రాకపోవడంతో ఆగ్రహించిన ప్రయాణికులు కేఎస్ఆర్టీసీ బస్సులను అడ్డగించి ధర్నా చేపట్టారు. అనంతరం పోలీసులు, డిపో మేనేజర్ హామీ మేరకు ధర్నా విరమించారు.

భార్యను కడతేర్చి భర్త ఆత్మహత్య

బనశంకరి: భార్యపై కొడవలితో దాడిచేసి హతమార్చిన భర్త అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన సర్జాపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఆనేకల్ తాలూకా సర్జాపుర సమీపంలోని బిక్కన హళ్లి జనతాకాలనీలో లక్ష్మమ్మ(47), వెంకటస్వామి(53) దంపతులు నివాసం ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు కాగా వారికి వివాహం చేశారు. మంగళవారం రాత్రి చిన్న విషయానికి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి గురైన వెంకటస్వామి కొడవలి తీసుకుని లక్ష్మమ్మను నరికి చంపాడు. అనంతరం విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

7నుంచి టీకా అభియాన్

మైసూరు: ఈనెల 7 నుంచి 12వరకు టీకా అభియాన్ నిర్వహించనున్నట్లు జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర తెలిపారు. జాతీయ సార్వత్రిక టీకా కార్యక్రమం కింద ఐదేళ్లలోపు చిన్నపిల్లలు, గర్భిణులకు టీకాలను ఇచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇంద్రధనుష్ అభియాన్-5.0 కార్యక్రమం అమలుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం నగరంలోని జిల్లా పంచాయతీ సభాంగణంలో ఆవిష్కరించి మాట్లాడారు.

గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్‌పై కొరడా

తుమకూరు: బోరలింగనపాళ్య గ్రామంలోని ఒక షెడ్‌లో గ్యాస్ అక్రమ ఫిల్లింగ్ చేస్తుండగా కుణిగల్ పోలీసులు దాడి చేశారు. వివిధ కంపెనీలకు చెందిన 269 సిలిండర్లు, రీఫిల్లింగ్ సామగ్రి, బోలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు దోపిడీదారుల అరెస్ట్



పట్టుబడిన నిందితులు

బనశంకరి: డెలివరీబాయ్స్‌ను టార్గెట్‌గా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న అసోంకు చెందిన రాకేశ్, మల్లిక్ అనే దొంగలను సుద్దగుంటపాళ్యపోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 25 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గతంలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసేవారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు దోపిడీలను ఎంచుకున్నారు.

జాతీయ రహదారిపై ఏడీజీపీ పరిశీలన



సమీక్షిస్తున్న ఏడీజీపీ అలోక్‌కుమార్

తుమకూరు: రోడ్డు భద్రతపై దృష్టి సారించిన ఏడీజీపీ అలోక్ కుమార్..బుధవారం జాతీయ రహదారి-48ను పరిశీలించారు. చిక్కజాల సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు తీసుకున్న చర్యలను ఆయన సమీక్షించారు. జాతీయ రహదారి ప్రాధికార అధికారులతో చర్చించారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: చామరాజనగర జిల్లా యళందూరు తాలూకా మల్లిగేహళ్లిలో బాలుడిపై దాడి చేసిన చిరుత బోనులో చిక్కింది. బాలుడు పాఠశాలకు వెళ్తుండగా ఆరేళ్ల మంగ చిరుత దాడి చేసింది. అటవీ శాఖ అధికారులు కుంతూరు బెట్ట వద్ద బోను ఏర్పాటు చేయగా ఆహారం కోసం వచ్చిన ఈ చిరుత అందులో బందీ అయ్యింది.

'బీజేపీ బాగా చూసుకుంటోంది'

చిక్కబళ్లాపురం: నన్ను బీజేపీ బాగా చూసుకుంటోంది..ఏ పార్టీలోకి వెళ్లడం లేదు అని మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేను కాంగ్రెస్‌లోకి వెళ్తే తన ఇమేజీ ఎక్కడ దెబ్బతింటుందోనని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అభద్రతాభావంతో ఉన్నారని ఎద్దేవా చేశారు. మెడికల్ కళాశాలలో అవినీతిపై ఎస్ఐటీతో తనిఖీ చేయిస్తామని ఎమ్మెల్యే చేస్తున్న వ్యాఖ్యలపై సుధాకర్ స్పందిస్తూ తాను అన్నింటికీ సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

కొత్త మందు అని కొడితే...

- ఎండిపోయిన టమాట పంట
- రూ. 25 లక్షల దాకా నష్టం
- దొడ్డ తాలూకాలో కంపెనీ ప్రయోగానికి రైతులు బలి



మందును, ఎండిన పంటను చూపిస్తున్న రైతులు



ఎండిపోయిన టమాట పంట

దొడ్డబళ్లాపురం: ప్రస్తుతం వంటింటి మహారాణిగానే కీర్తికెక్కిన టమాటాలు ఎక్కడలేని ధరలు పలుకుతున్నాయి. టమాట పంట వేసిన రైతులు లక్షాధికారులు అవుతున్నారు. ఇలాంటి తరుణంలో ఓ కంపెనీ తయారుచేసిన పురుగుల మందు ప్రయోగానికి రూ. 25 లక్షల విలువైన టమాట పంట నాశనమైన సంఘటన దొడ్డ తాలూకా దొడ్డ తుమకూరు గ్రామంలో చోటుచేసుకుంది.

పంట ఏపుగా వస్తుందని నమ్మించి..

వివరాలు.. దొడ్డ తుమకూరు గ్రామం నివాసి గిడ్డేగౌడ ఒక ఎకరాలో టమాట పంట వేశాడు. పంట మంచి పూత పూసింది, అధిక దిగుబడి వచ్చే అన్ని లక్షణాలు కనిపించాయి. అయితే టాటా రాయిన్స్ అనే కంపెనీ ఆ రైతు పాలిట శాపంగా మారింది. ఆ కంపెనీకి చెందిన ఒక ప్రతినిధి వచ్చి రైతులను కలిపి తమ కంపెనీ మందు చల్లితే అధిక దిగుబడి వస్తుందని, మందు కూడా ఉచితంగా ఇస్తామని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన గిడ్డేగౌడ పురుగుల మందు పంటకు చల్లాడు. కొన్ని రోజుల్లోనే పంటలో పూత, పిందెలు నేలరాలసాగింది. ఆ తరువాత టమాటా మొక్కలు కూడా వాడి ఎండిపోయాయి. దీనిపై కంపెనీ ప్రతినిధిని ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదని జారుకుంటున్నాడని రైతు వాపోయాడు. ఇలాగే మరికొందరు రైతులకు కూడా జరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా విలువ ఆధారంగా చూస్తే ఈ నష్టం రూ.25 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

ప్రయోగం చేసి ఉంటారు

దీనిపై పురుగుల మందుల వ్యాపారులను వాకబు చేయగా.. కంపెనీ కొత్తగా తయారుచేసిన పురుగుల మందును పరీక్షించేందుకు అమాయక రైతులను వాడుకుందన్నారు. మందు వికటించి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. సదరు కంపెనీపై న్యాయ పోరాటం చేస్తామని రైతు సంఘం నేత వసంత్ తెలిపారు.

పట్టుబడిన అంతర్ రాష్ట్ర గజదొంగ



నగలను చూపుతున్న పోలీస్ కమిషనర్ రమేష్ బానోత్

మైసూరు: రాష్ట్రంతోపాటు ఏపీ, తమిళనాడులో దోపిడీలకు పాల్పడుతున్న ఏపీకి చెందిన సత్తిబాబు(35) అనే గజదొంగను మైసూరు పోలీసులు అరెస్టు చేశారు. ఇళ్లు, ఖరీదైన కార్లను దొంగిలిస్తున్న ఇతని నుంచి రూ.1.19 కోట్ల విలువైన మూడు కార్లు, 750 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు వాచీలు స్వాధీనం చేసుకున్నారు. మైసూరు వీవీ పురం, హెబ్బాళ, విజయనగర పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీలను విచారణ చేస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. నిందితుడిపై తెలంగాణలో 20, ఆంధ్రప్రదేశ్‌లో 30, తమిళనాడులో 3, కర్ణాటకలో మూడు కేసులు నమోదైనట్లు నగర పోలీసు కమిషనర్ రమేశ్ బానోత్ బుధవారం మీడియాకు తెలిపారు. నిందితుడు ఇంటర్నెట్ ద్వారా శ్రీమంతుల వివరాలు తెలుసుకుంటూ వారి కార్లను దొంగతనం చేసేవాడని కమిషనర్ తెలిపారు. విలువైన కార్లు దొంగతనం చేసి తక్కువ ధరకు విక్రయించేవాడన్నారు.

వలస వచ్చి అతి వేగానికి బలయ్యాడు

- బైక్ బోల్తాపడి జార్కండ్‌వాసి మృతి

బనశంకరి: పొట్టకూటి కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి బెంగళూరుకు వచ్చిన జార్కండ్ వాసిని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. ఈఘటన జీవనబీమానగర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జార్కండ్‌కు చెందిన ఆదిత్య (27) నగరంలో సెక్యూరిటీ ఏజెన్సీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. చిన్నయ్యనపాళ్యలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా 12వ మెయిన్‌రోడ్డు జంక్షన్ వద్ద అతివేగం కారణంగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆదిత్య తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీవనబీమానగర ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని బౌరింగ్ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

అప్పు తీర్చలేదని గ్రామ బహిష్కరణ

యశవంతపుర: రెండు కుటుంబాలను గ్రామం నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించిన ఘటన ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర తాలూకాలో వెలుగులోకి వచ్చింది. కరకుర్వ గ్రామంలో గంగాదేవి ఆలయానికి ఏటా విరాళాలు సేకరిస్తారు. సమకూరిన డబ్బులో లక్ష్మీబోళా అంబిగ, ఆశా గంగాధరలు 2017లో అప్పు తీసుకున్నారు. అయితే సకాలంలో బాకీ చెల్లించలేదని ఆరోపిస్తూ ఆ రెండు కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరించారు. దీంతో బాధితులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. బాకీ చెల్లించినా ఆలయ సమితి తమను వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి ప్రియాంక్ ఖర్గేకు నోటీసు

- జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్.డి.రేవణ్ణకు కూడా

బనశంకరి: జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ.రేవణ్ణ, ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఎన్నిక రద్దుచేయాలని అశ్వత్‌రామ్ అనే వ్యక్తి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరిద్దరూ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన హైకోర్టు ఇద్దరికీ నోటీసులు జారీచేసి సెప్టెంబరు 5 తేదీన కోర్టుకు హాజరుకావాలని సూచించింది.

బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు ఒప్పందం

యశవంతపుర: రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల వ్యయంతో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు ఇంటర్నేషనల్ బ్యాటరీ సంస్థ(ఐబీసీ) కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. నూరు ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమ ఏర్పాటవుతుందని మైక్రోబ్లాగింగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 2025 నాటికి ఉత్పత్తులను ప్రారంభించనున్నట్లు పరిశ్రమలు, వాణిజ్య విభాగం కమిషనర్ గుంజన్ కృష్ణ తెలిపారు.

భర్తకు ప్రేమతో గంజాయి

- తనిఖీల్లో పట్టుబడిన భార్య

యశవంతపుర: జైల్లో ఉన్న భర్తకు గంజాయి ఇవ్వటానికి వెళ్లిన భార్య తనిఖీల్లో పట్టుబడింది. ఈ ఘటన కలబురగిలో జరిగింది. పట్టణంలోని కేంద్ర కారాగారంలో జాలేంద్రనాథ్ కావళెకి అనే వ్యక్తి ఖైదీగా ఉన్నాడు. సోమవారం భర్తను కలవటానికి వచ్చిన భార్య సునీత రెండు జీన్స్ ప్యాంట్స్ అందజేసింది.భద్రతా సిబ్బంది బ్యాగును పరిశీలించగా గంజాయి లభ్యమైంది. దీంతో ఆమెను అరెస్ట్ చేశారు.

కర్ణాటక ఓపెన్ వర్సిటీ విద్యా కామధేనువు

మండ్య: కర్ణాటకరాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం అనేక మందికి విద్యా కామధేనువు అని జిల్లాధికారి కుమార్ పేర్కొన్నారు. తక్కువ ఫీజుతో విద్యను అందిస్తున్న ఓపెన్‌వర్సిటీ సేవలను జిల్లావాసులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, బుధవారం వర్సిటీ ప్రవేశాలపై అవగాహన కల్పించే వాహనాన్ని ఆయన ప్రారంభించారు.

ప్రసవ వేదనతో ఏనుగు మృతి

దొడ్డబళ్లాపురం: ప్రసవ వేదనతో ఏనుగు మృతి చెందిన సంఘటన సకలేశపుర తాలూకాలోని ఉడెయావర గ్రామంలో చోటుచేసుకుంది. ఉడెయావర గ్రామంలోని ఒక కాఫీ తోటలో ఆడ ఏనుగు ఒకటి బిడ్డకు జన్మనిస్తూ మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, పశు వైద్యుడు నవీన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృత ఏనుగును పరీక్షించి ఏనుగు మూడు రోజుల క్రితమే మృతి చెందిందని, సెప్టిసిమియా కారణంగా రక్తం ఎక్కువగా పోవడంతో ఏనుగు మృతి చెందిందని తేల్చారు. పోస్టుమార్టం అనంతరం ఏనుగు కళేబరానికి అటవీ సిబ్బంది అంత్యక్రియలు చేశారు.

కేదరనాథ్‌లో మూడిగెరె వాసి మృతి

యశవంతపుర: కేదారనాథ్ యాత్రకు వెళ్లిన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా జిన్నాపురకు చెందిన యువకుడు గిరీశ్ అస్వస్థతకు గురై మృతి చెందారు. వంట పని చేస్తున్న గిరీశ్ గతవారం మూడిగెరె నుంచి కేదారనాథ్ యాత్రకు వెళ్లగా వాతావారణ పరిస్థితిలో మార్పులు కారణంగా అస్వస్థతకు గురికాగా, రిషికేశ్ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి చికిత్సలు అందించారు. వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించక మృతి చెందినట్లు మూడిగెరెకి సమాచారం అందింది.

ఆర్టీసీకి నారీశక్తి బకాయిల విడుదల

శివాజీనగర: రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా వసతి వల్ల ఆర్టీసీకి ఇప్పటివరకు రూ.250 కోట్లు ఖర్చు కాగా, అందులో రూ.125 కోట్లను సర్కారు విడుదల చేయడమైనది. నారీ శక్తి పథకం తొలి కంతు సొమ్మును ఆర్టీసీకి విడుదల చేసింది. రాష్ట్రంలో వివిధ ఆర్టీసీ విభాగాలకు ఇందులో తలా కొంత మొత్తం విడుదలైంది. అయితే పూర్తి సొమ్ము విడుదల చేయకపోవటంపై ఆర్టీసీ ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు.

లారీ ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

తుమకూరు: లారీ ఢీకొని కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హెబ్బూరు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఓంకార్ పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని బైక్‌లో వెళుతున్న సమయంలో నాగవల్లి సమీపంలో లారీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు గమనించి హెబ్బూరు పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం తుమకూరు జిల్లా ఆస్పత్రికి మార్చారు. హెబ్బూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



కవర్తపువెంకట సాయి(ఫైల్)

బనశంకరి: మానసిక సమస్యతో నిమ్హాన్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న తన కుమారుడు కవర్తపువెంకటసాయి(19) అదృశ్యమైనట్లు నెల్లూరు జిల్లా రామాయపట్నం సాలిపేట బీసీ.కాలనీకి చెందిన తండ్రి వెంకటనారాయణ సిద్దాపుర పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బయటకు వచ్చి తిరిగి రాలేదన్నారు. కటసాయి ఆచూకీ తెలిస్తే సిద్దాపుర పోలీస్‌స్టేషన్ , కంట్రోల్ రూమ్ లేదా -8978869039 నెంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

జెండా పండుగ రోజు అంబేడ్కర్ ఫొటో పెట్టాలి

కృష్ణరాజపురం: స్వాతంత్ర్య దినోత్సవంలో మహాత్ముడు గాంధీ చిత్రపటంతో పాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని కూడా ఏర్పాటు చేయాలని కర్ణాటక దళిత రక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వేదిక అధ్యక్షుడు సారుణస వెంకటేశ్ మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగాన్ని ఇచ్చి ఒక రూపాన్ని తీసుకొచ్చిన అంబేడ్కర్ చిత్రపటాన్ని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసి అర్థవంతంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీఐల బదిలీలు నిలిపివేత

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం 211 మంది సీఐలను బదిలీచేస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేసింది. అయితే ఏ కారణం చేతనో బదిలీలు నిలిపివేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఎవరూ రిలీవ్ కాకుండా వైర్‌లెస్ ద్వారా మెసేజ్ పంపింది.

తుదిదశకు 'మేకెదాటు' సర్వే

దొడ్డబళ్లాపురం: బెంగళూరు, రామనగర, మైసూరు, మండ్య మరియు చుట్టుపక్కల జిల్లాలకు శాశ్వత తాగునీరు, 400 మెగావ్యాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రతిష్టాత్మక మేకెదాటు పథకానికి సంబంధించి భూ సర్వే మరో 60 రోజుల్లో పూర్తి కానుంది. బండీపుర పులుల సంరక్షణ ప్రదేశం, చామరాజనగర, బిళిగిరి రంగనాథస్వామి వన్యప్రాణుల అభయారణ్యం, ఎంఎం హిల్స్ అటవీ ప్రదేశం, కావేరి వన్యజీవి అటవీ ప్రదేశాల్లో అటవీశాఖ అధికారులు ఇప్పటికే సర్వే ప్రారంభించారని, వాతావరణం అనుకూలిస్తే 60 రోజుల్లో సర్వే పూర్తవుతుందని స్థానిక అటవీశాఖ అధికారి మాలతిప్రియ పేర్కొన్నారు. కర్ణాటక-తమిళనాడు సరిహద్దులను గుర్తించడానికి ప్రతి 20 మీటర్లకు చెట్టు దిమ్మను ఉంచుతున్నామన్నారు.

పట్టాలపై మహిళ మృతదేహం

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకా బాశెట్టి హళ్లి వద్ద బిర్లాసూపర్ సిమెంటు ఫ్యాక్టరీ ముందు రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉండగా బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెళ్లి పరిశీలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఆమె మృతి చెంది ఉంటుందని ప్రాథమిక విచారణలో గుర్తించారు. 50 సంవత్సరాల వయసున్న ఈమె 5.4 అడుగుల ఎత్తు కలిగి ఎరుపు రంగు జాకెట్, ఎరుపు, నలుపు రంగుల కలయిక చీర ధరించింది. కుడిచేతిపై హర్ష అని పచ్చబొట్టు ఉంది. సమాచారం తెలిసినవారు 9480802118 నంబరులో సంప్రదించాలని దొడ్డబళ్లాపురం రైల్వే పోలీసులు తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ వేలో జాగృతి

మండ్య: బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్ వేలో ద్విచక్రవాహనాలు, త్రిచక్రవాహనాల సంచారాన్ని ఈనెల 1నుంచి నిషేధించిన నేపథ్యంలో ఆయా వాహనదారులకు పోలీసులు జాగృతి కల్పిస్తున్నారు. మండ్య నగర శివార్లలోని శ్రీనివాసపుర గేట్ వద్ద అమరావతి హోటల్ సమీపంలో కొత్త నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణించిన కొందరు వాహనదారులకు జరిమానాలు విధించారు. 16 బైకులు, ఒక ట్రాక్టర్, ఒక త్రిచక్రవాహనానికి రూ.500 చొప్పున జరిమానా విధించారు.

మహిళ ఆత్మహత్య

మైసూరు: అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పిరియాపట్టణ తాలూకా రావందూరు తోళకల్ కాలనీలో జరిగింది. మహదేవమ్మ (60) వివిధ సంఘాల ద్వారా లక్షలాది రూపాయలను అప్పు తీసుకుంది. అయితే దీన్ని ఎలా తీర్చాలనే బెంగతో విషం తాగింది. అస్వస్థతకు గురైన మహదేవమ్మను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పిరియాపట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

బహిరంగ ధూమపానంపై చర్యలు

మైసూరు: బహిరంగ స్థలాల్లో పొగాకు ఉత్పత్తులను వినియోగించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర అధికారులకు సూచించారు. పొగాకు నియంత్రణ వినియోగంపై బుధవారం నగరంలోని జిల్లా పంచాయతీ సభాంగణంలో జరిగిన జిల్లా త్రైమాసిక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ టీ, కాఫీ షాపుల వద్ద ఎక్కువగా సిగరెట్లు కాలుస్తూ అనేక మంది కనిపిస్తున్నారని, దీనివల్ల సామాన్య ప్రజలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆయా షాపుల వద్ద ధూమపానం చేయకుండా చూడాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు.

ఆ ఖైదీతో వేగలేకపోతున్నాం

మైసూరు: వేశ్యావాటిక దందాతో మహిళలను మోసం చేసిన కేసులో మైసూరు కేంద్ర కారాగృహంలో విచారణ ఖైదీగా ఉన్న స్యాంట్రో రవితో తాము వేగలేకపోతున్నామని, ఆయన్ను మరో జైలుకు బదిలీ చేయాలని అధికారులు కోర్టుకు లేఖ రాశారు. స్యాంట్రో రవి జైలు నిబంధనలను పాటించకపోవడంతోపాటు తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడని, సహచర ఖైదీలతో గొడవలకు దిగుతున్నాడని, తనకు ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నాడని, వెంటనే అతన్ని బెంగళూరు జైలుకు బదిలీ చేయాలని జైలు అధికారులు మైసూరు కోర్టుకు లేఖ రాశారు.

హోసూరు వార్తలు..

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



క్రిష్ణగిరి కేఆర్‌పి డ్యాంలో పడవ ప్రయాణం చేస్తున్న మంత్రి

హోసూరు: క్రిష్ణగిరిలోని కేఆర్‌పి డ్యాం, తళి, కెలమంగలం ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాలను వీక్షించేందుకు కర్ణాటక ప్రాంతం నుంచి ఎక్కువ మంది పర్యాటకులు వస్తుంటారని, ఈ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పరుస్తామని పర్యాటక శాఖ మంత్రి కే. రామచంద్రన్ తెలిపారు. క్రిష్ణగిరిలోని తమిళనాడు హోటల్, హోసూరులోని తమిళనాడు హోటల్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. హోటళ్లలో బస చేసేవారి అరటి ఆకుతో భోజనం వడ్డించాలని ఆదేశించారు. క్రిష్ణగిరి డ్యాంలో పడవలో విహరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శరయు, అదనపు కలెక్టర్ వంధనాకార్గ్, ఎమ్మెల్యేలు వై. ప్రకాష్, మదియళగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుని వంచన.. యువతి ఆత్మహత్య

క్రిష్ణగిరి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆత్మహత్య చేసుకొన్న ఘటన సూళగిరి వద్ద జరిగింది. వివరాలు.. సూళగిరి తాలూకా ముదుగురికి సమీపంలోని బి. సింగిరిపల్లి గ్రామానికి చెందిన యల్లప్ప కూతురు యశోద (19), కడతూరు గ్రామానికి చెందిన ప్రదీప్‌లు గత రెండేళ్లుగా ప్రేమించుకొన్నారు. ఈ విషయం రెండు కుటుంబాలకు తెలిసి ఇద్దరికీ పెళ్లి చేయాలని తీర్మానించారు. ఇంతలో ప్రియుడు ప్రదీప్ ఈ పెళ్లి తనకు ఇష్టం లేదని చెప్పడంతో యువతి కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. మోసపోయానని విరక్తి చెందిన యశోద మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

వేశ్యావాటికలపై దాడి

హోసూరు: హోసూరులో మసాజ్ సెంటర్‌లలో మంగళవారం రాత్రి పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఇద్దరు మహిళలతో పాటు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ పూర్ణిమ నేతృత్వంలో పోలీసులు మునీశ్వర్‌నగర్ ప్రాంతంలో ఓ మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందని తెలిసి దాడి చేశారు. వేలూరు జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. బాగలూరు రోడ్డులో వేశ్యావాటిక నిర్వహిస్తున్న కేరళవాసి రామ్‌శాంత్ (22)ను అరెస్ట్ చేశారు.

ఆలయంలో నాగుపాము దర్శనం



పుట్ట వద్ద పడగెత్తి నిలిచిన నాగరాజు

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలో మురుగన్ ఆలయం వద్ద ఉన్న పుట్ట నుంచి నాగుపాము బయటకొచ్చి పూజలు నిర్వహిస్తున్న భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. క్రిష్ణగిరి- బెంగళూరు హైవే ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి సమీపంలోని సికారిమేడు బస్టాప్ వద్ద పెద్ద పుట్ట ఉంది. కొన్నేళ్ల కిందట పుట్ట పక్కనే మురుగన్ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో స్థానిక ప్రజలు రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం కొంత మంది భక్తులు పూజలు నిర్వహిస్తుండగా ఓ నాగుపాటు బయటకొచ్చి ఆలయ ఆవరణలో పడగెత్తి ఆడింది. కొద్దిసేపటికి మళ్లీ పుట్టలోకి వెళ్లిపోయింది. కాగా ఈ దృశ్యాలను గమనించిన భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

ఎప్పుడు ప్రారంభిస్తారో?



సిద్ధమైన బీడీవో కార్యాలయ కొత్త భవనం

కెలమంగలం: కెలమంగలం సమితిలో కొత్తగా నిర్మించిన బీడీవో కార్యాలయం ఎప్పుడు ప్రారంభమవుతుందోనని ఆ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. కెలమంగలంలో నిర్వహిస్తున్న బీడీవో కార్యాలయానికి పక్కాభవనం నిర్మించి ఇవ్వాలని స్థానిక ప్రజలు పలు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు.దీంతో ఏడాది క్రితం ప్రభుత్వం రూ. 3.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పక్కాభవనం నిర్మించారు. కెలమంగలం సమీపంలోని కుందుమోరనపల్లి వద్ద తాత్కాలికంగా ఆఫీసును నిర్వహిస్తూ వచ్చారు. ఇది స్థానికులకు దూరంగా ఉంది. కొత్త భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

ప్రత్యంగిరా దేవికి పూజలు



అమ్మవారికి హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లి గ్రామంలో వెలసిన అథర్వణ ప్రత్యంగిరాదేవి ఆలయంలో మంగళవారం రాత్రి పౌర్ణమి పూజలను జరిపారు. ఆలయంలోని ప్రత్యంగిరాదేవి, రాహు, కేతు, కాలభైరవ స్వామి మూలవిరాట్‌లను అభిషేకించి అలంకరించారు. ఈ సందర్భంగా వివిధ హోమాలు జరిపించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోసూరు, బెంగళూరు, ఆంధ్ర, తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని సుఖశాంతులు ప్రసాదించాలని పూజలు చేశారు.

మహిళ మృతదేహం లభ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం కలకలం రేపింది. పార్వతీనగర్ ప్రాంతంలో దుర్వాసన వెదజెల్లడంతో స్థానికులు అక్కడికెళ్లి చూడగా మహిళ శవం కనిపించింది. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి శవాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయసు సుమారు 35 ఏళ్లుంటుందని, హత్య లేక ఆత్మహత్య అనేదానిపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

కెలమంగలం: రోడ్డు విస్తరణ పనుల వల్ల హొగేనకల్ తాగునీటి పైపు నుంచి నీరు సరఫరా కాకపోవడంతో స్థానిక ప్రజల సమస్యను గుర్తించి సీపీఐ పార్టీకి చెందిన గంగేష్ తన సొంత ఖర్చులతో రెండు రోజులుగా ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కెలమంగలం పట్టణ పంచాయతీ దొడ్డేగానపల్లి వద్ద నాలుగు రోడ్ల ఏర్పాటుతో హొగేనకల్ తాగునీటి పైపును తొలగించారు. తాగునీటి సమస్య తీర్చాలని ప్రజలు పంచాయతీ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

స్నేహితుడి చేతిలో యువకుడు హత్య

యశవంతపుర: హాసన తాలూకా చిక్కగేణిగెరె గ్రామంలో ప్రకాష్(38)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. స్నేహితుడు మద్యం తాగుతున్నట్లు గమనించిన ప్రకాష్...ఈ విషయాన్ని స్నేహితుడి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. దీంతో కక్ష కట్టిన స్నేహితుడు.. ప్రకాష్‌ను కడతేర్చాలని పథకం పన్నాడు. మిత్రుడి ఇంటికి భోజనానికి వెళ్దామని చెప్పి మంగళవారం రాత్రి ప్రకాష్‌ను వెంట తీసుకెళ్లాడు. అక్కడ బండరాతిపై కూర్చొబెట్టి ప్రకాష్‌ను హత్య చేసి ఉడాయించాడు. గార్మెంట్స్‌కు వెళ్లి వచ్చిన ప్రకాశ్ భార్య పుట్టలక్ష్మి వచ్చి చూడగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్లు నియామకం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులిచ్చారు. నియోజకవర్గంలోని ఆర్డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్, ప్రాజెక్ట్ డైరెక్టర్లలో ఒకరిని రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించారు. వీరినే నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా నియమించారు. మండలాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, మునిసిపల్ కమిషనర్లలో ఒకరిని నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు.

సీఎస్‌తో సింగపూర్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధుల భేటీ

సాక్షి, అమరావతి: డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ సింగపూర్ ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసింది. ఆ బ్యాంకుకు సంబంధించి వివిధ అంశాలపై సీఎస్‌తో చర్చించింది. కార్యక్రమంలో బ్యాంక్ గ్రూపు ఎండీ అనగ్ టిక్ వీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిచెల్లీ టియో, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మాయా వాణి, ఇండియా హెడ్ గవర్నమెంట్ బిజినెస్ రాజీవ్ బగ్గ, వైస్ ప్రెసిడెంట్ గవర్నమెంట్ బిజినెస్ శ్రేయాన్స్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు, విశాఖలో కొత్త గ్రంథాలయ భవనాల నిర్మాణం

గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు కొత్త గ్రంథాలయ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. బుధవారం మంగళగిరిలో సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి 13 జిల్లాల గ్రంథాలయ సంస్థల అభివృద్ధి ప్రతిపాదనలతో పాటు గతంలో పెట్టిన బడ్జెట్‌కు అదనపు బడ్జెట్‌ను ఆమోదించారు. శేషగిరిరావు మాట్లాడుతూ.. రూ.3.10 కోట్లతో చిత్తూరులో, రూ.2 కోట్లతో విశాఖలో జిల్లా గ్రంథాలయాల నూతన భవనాల నిర్మాణ ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.

భారీ స్కామ్.. 'బ్రో'

అమెరికాలో బాబు ముఠా వసూలు చేసిన డబ్బునే పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారు: అంబటి



- ఇది మనీలాండరింగ్ కాదా?
- పవన్ పారితోషికం ఎంత? ఐటీ చెల్లించింది ఎంత?
- చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నట్లు అంబటి వెల్లడి

సాక్షి, అమరావతి: బ్రో సినిమా వ్యవహారంలో నూటికి నూరు శాతం అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అదో కుంభకోణమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. తాను చేసిన ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే సినిమా నిర్మాతగానీ పవన్ కళ్యాణ్‌గానీ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వాస్తవాలు వెల్లడించేందుకు భయపడుతున్నారా? దాస్తున్నారా? అని నిలదీశారు. దాస్తున్నారంటే అందులో స్కామ్ దాగి ఉందనే అర్థమని స్పష్టం చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అమెరికాలో తన ముఠా ద్వారా వసూలు చేసిన డబ్బును నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ద్వారా పవన్ కళ్యాణ్‌కు ప్యాకేజీగా ఇప్పించారని పునరుద్ఘాటించారు.


డైలాగ్‌లు కొట్టి దాగుడు మూతలెందుకు?

బ్రో సినిమాకు విదేశీ పెట్టుబడులు అక్రమంగా వచ్చాయని, ఇది మనీలాండరింగ్ కాదా? అని అంబటి సూటిగా ప్రశ్నించారు. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడి ఎంత? కలెక్షన్లు ఎంత? పవన్ పారితోషికం ఎంత? ఆదాయ పన్నుగా కట్టింది ఎంత? అని ప్రశ్నించారు. అత్యంత నిజాయితీపరుడినని, అపర దానకర్ణుడినని, సమాజ శ్రేయస్సు కోరుకునే వ్యక్తినంటూ డైలాగ్‌లు కొట్టే పవన్ వాస్తవాలను ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. సినిమాను సినిమాలాగే చూడాలన్న సాయి ధరమ్ తేజ్ వ్యాఖ్యలపై మంత్రి అంబటి స్పందిస్తూ అలాంటప్పుడు సినిమాలను సినిమాలుగానే తీయండి...మధ్యలో మమ్మల్ని గోకడమెందుకు? అని చురకలంటించారు. తనపై పుంఖాను పుంఖాలుగా వెబ్ సిరీస్ తీసినా అభ్యంతరం లేదన్నారు. బ్రో సినిమా వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా 'నేను ఇవాళ రాత్రి చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నా. మా పార్టీ ఎంపీలను కలుస్తా. ఢిల్లీ నుంచి వచ్చాక అన్ని వివరాలు చెబుతా' అని అంబటి చెప్పారు.

రాజ్యసభ | ఏపీ ఇన్ పార్లమెంట్

రూ.19,761 కోట్లతో రాయలసీమలో జాతీయ రహదారులు

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో రూ.19,761.8 కోట్లతో పలు జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రతిపాదించిన ఈ జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో 9 నిర్మాణదశలో ఉండగా, 3 అవార్డు అయినప్పటికీ ఇంకా ప్రారంభం కాలేదని, మరో 11 ప్రాజెక్టులు మంజూరైనప్పటికీ కాంట్రాక్ట్ అవార్డు కాలేదని వివరించారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. మొత్తంగా రూ.12,951.68 కోట్లతో చేపట్టిన వివిధ జాతీయ రహదారి అభివృద్ధి పనులు గ్రౌండ్ అయి వివిధదశల్లో పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. రూ.1,989.4 కోట్లతో చేపట్టాల్సిన మూడు జాతీయ రహదారి పనులకు కాంట్రాక్ట్‌లు అవార్డు పూర్తయి పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. రూ.4,820.72 కోట్లతో చేపట్టాల్సిన 11 హైవే పనులు మంజూరై అవార్డు కోసం ఎదురుచూస్తున్నట్లు మంత్రి వివరించారు.

ఎన్డీఆర్‌ఎఫ్‌కు రూ.1,60,153 కోట్లు

ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు 2021–26 మధ్య కాలంలో ఎన్డీఆర్‌ఎఫ్‌కు రూ.1,60,153 కోట్లు కేటాయించినట్లు హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. గత కేటాయిపులతో పోలిస్తే ఇది రెండున్నర రెట్లు అధికమని చెప్పారు. దీనికి అదనంగా మరో రూ.68 వేల కోట్ల తక్షణ సహాయనిధిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోస్తా రాష్ట్రాల్లో తుపాన్లు వచ్చినప్పుడు భారత వాతావరణ విభాగం (ఐఎండీ), కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)తోపాటు వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఎన్డీఆర్‌ఎఫ్ ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ విపత్తు సహాయ చర్యలను చేపడుతోందని చెప్పారు. ఎన్డీఆర్‌ఎఫ్ నుంచి ఎస్డీఆర్‌ఎఫ్‌కు కేటాయించే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోవచ్చని తెలిపారు.

అడవుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శం

రాజ్యసభలో అటవీ సంరక్షణ బిల్లుపై వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: అటవీప్రాంతంలో నివసించే ప్రజలను కూడా సమాన భాగస్వాములను చేసినప్పుడే అడవుల పరిరక్షణ పటిష్టంగా జరుగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి చెప్పారు. ఫారెస్ట్ (కన్జర్వేషన్) అమెండ్‌మెంట్ బిల్లు–2023పై రాజ్యసభలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తున్న భాగస్వామ్య అటవీ యాజమాన్య విధానం సత్ఫలితాలిస్తోందని తెలిపారు. ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అడవులకు సంబంధించిన చట్టాల రూపకల్పన లేదా సవరణలు చేసేటప్పుడు కేంద్ర ప్రభుత్వం విధిగా ఆయా రాష్ట్రాలను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంపీ నిరంజన్‌రెడ్డి కూడా పలు సూచనలు చేస్తూ బిల్లుకు మద్దతు తెలిపారు.

ప్రైవేట్ మైనింగ్ సంస్థలకు ప్రోత్సాహకాలివ్వాలి

అరుదైన ఖనిజాల వెలికితీతలో పాలుపంచుకునే ప్రైవేట్‌రంగ మైనింగ్ సంస్థలకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ప్రోత్సాహకాలను ప్రకటించాలని విజయసాయిరెడ్డి సూచించారు. ద మైన్స్, మినరల్స్ (డెవలప్‌మెంట్, రెగ్యులేషన్) సవరణ బిల్లు–2023పై రాజ్యసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాలకు అవసరమైన 30 రకాల అరుదైన ఖనిజాల్లో కనీసం 10 ఖనిజాలకు పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడ్డామని చెప్పారు. అందులో ఏడింటిని చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నామని, ఇది చాలా ప్రమాదకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రజల దీర్ఘకాలిక ఉపాధి, జీవనోపాధి అవకాశాలే లక్ష్యంగా నిర్మిస్తున్న కడప ఉక్కు పరిశ్రమకు తగిన ఐరన్‌ఓర్ కేటాయించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర చట్టాల్లో పెద్ద ఎత్తున ప్రక్షాళన జరగాలి

చిన్నపాటి తప్పిదాలను నేరంగా పరిగణించే శిక్షార్హమైన పలు నిబంధనలు తొలగించేందుకు ఉద్దేశించిన జన్‌విశ్వాస్ బిల్లు మాదిరిగానే రాష్ట్ర చట్టాల్లో కూడా చిన్నపాటి నేరాలను శిక్షార్హమైన జాబితా నుంచి తొలగించేలా ప్రక్షాళన చేపట్టాలని విజయసాయిరెడ్డి సూచించారు. జన్‌విశ్వాస్ బిల్లుపై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కేంద్ర చట్టాలతో పోల్చుకుంటే రాష్ట్ర చట్టాల్లో చిన్నపాటి తప్పిదాలకు శిక్షార్హమైన నిబంధనలు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయన్నారు. ప్రతి పౌరుడు, వ్యాపారాలు కేంద్ర చట్టాలనే కాకుండా రాష్ట్ర చట్టాలను కూడా అనుసరించాల్సి ఉన్నందున రాష్ట్ర చట్టాల్లో ఇలాంటి ప్రక్రియ పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ తరహా సవరణలు చేసేందుకు వీలుగా కేంద్రం రాష్ట్ర శాసనకర్తలకు మార్గదర్శనం చేయాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్రాలకు సాయపడే బాధ్యతను లా కమిషన్‌కు అప్పగించాలని సూచించారు. ఈ బిల్లుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు కూడా మాట్లాడారు.

పొగాకు ఉత్పత్తి పరిమాణం పెంచండి

కేంద్ర అదనపు కార్యదర్శికి వైఎస్సార్‌సీపీ ఎంపీల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సీవీ (ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా) పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని 2023–24 పంట సీజన్‌లో 170మిలియన్ కిలోలకు పెంచాలని కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి రాకేశ్ అగర్వాల్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం విజ్ఞప్తి చేసింది. ఏపీకి చెందిన పొగాకు రైతులతో కలిసి ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, మార్గాని భరత్‌రామ్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కోటగిరి శ్రీధర్‌ల బృందం బుధవారం వినతిపత్రం అందజేసింది. 2023–24 పంట కాలానికి ఏపీలో వర్జీనియా పొగాకు ఉత్పత్తి పరిమాణం గతేడాది మాదిరిగానే 142 మిలియన్ కిలోలుగా ఉండాలని గత నెల 17న సమావేశంలో పొగాకు బోర్డు తీర్మానించిందన్నారు. ఈ పరిమాణాన్ని 170 మిలియన్ కిలోలకు పెంచాలని కోరారు. ఏపీలో పండే వర్జీనియా పొగాకు ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. ఉత్పత్తి పరిమాణాన్ని పెంచితే పొగాకు రైతులు మరింత రాబడి పొందడంతోపాటు ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ పెంపు పొగాకు రైతులకు, ఈ రంగంలో ఉండే వారి జీవన ప్రమాణాలు పెంచడానికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ విషయంలో రాకేశ్ అగర్వాల్ సానుకూలంగా స్పందించారని ఎంపీలు తెలిపారు.

లోక్‌సభ

72 రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ



ఆంధ్రప్రదేశ్‌లోని 72 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్ కోసం గుర్తించినట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2023–24లో జూన్ 2023 వరకు దక్షిణ మధ్య రైల్వేలో అభివృద్ధి నిమిత్తం రూ.83.64 కోట్లు వ్యయం చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవ్‌కుమార్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఐదేళ్లలో 79 ర్యాంకుల మెరుగు





ప్రపంచబ్యాంకు డూయింగ్ బిజినెస్ రిపోర్టు (డీబీఆర్)–2020 ప్రకారం భారతదేశ ర్యాంకు 2014లో 142 ఉండగా 79 ర్యాంకులు మెరుగై 2019కి 63వ ర్యాంకుకు చేరుకుందని కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి సోమ్‌ప్రకాశ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, మార్గాని భరత్‌రామ్, ఎస్.రెడ్డెప్ప ప్రశ్నకు జవాబిచ్చారు.

దక్షిణమధ్య రైల్వేలో ఖాళీలు



దక్షిణమధ్య రైల్వేలో గ్రూప్ ఏ, సీల్లో పలు ఖాళీలున్నట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గ్రూపు ఏలో 110, గ్రూపు సీలో 10,338 ఖాళీలున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీ ప్రాంతాలు సికింద్రాబాద్ ఆర్‌ఆర్‌బీ పరిధిలో

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాలు సికింద్రాబాద్ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరిధిలోకి వస్తాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవ్‌కుమార్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. దక్షిణమధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వేలు సికింద్రాబాద్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. సెంట్రలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ల ప్రకారం దేశంలోని 21 బోర్డుల్లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అనకాపల్లి జిల్లాలో పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటు చేయండి




అనకాపల్లి జిల్లాలో కేంద్ర ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విదేశాంగమంత్రి జయశంకర్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటుచేస్తే అల్లూరి, కాకినాడ, విజయనగరం, విశాఖ జిల్లాల వాసులకు కూడా ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు.

'వారధి'క్యం

గోదారిపై రైలు కం రోడ్డు వంతెనకు ఇబ్బందులు

- వాహనాల రద్దీతో ఏర్పడుతున్న ప్రమాదం
- భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం
- భారీ వాహనాల నిషేధానికి గట్టి చర్యలు
- రూ.36 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు



కొవ్వూరు-రాజమహేంద్రవరం రోడ్డు రైలు వంతెన

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి దాటి అవతలి వైపునకు వెళ్లాలంటే పడవో, పంటో ఎక్కాల్సిందే. మరో దారి లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతూ కొవ్వూరు వెళ్లేవారు. కొవ్వూరు నుంచి తిరిగి రావాలన్నా మళ్లీ అదే మార్గం..అదే కష్టం..1976 నుంచి ఈ ఇబ్బందులు తప్పాయి. ఉభయ గోదావరి జిల్లాలను (విభజనకు ముందు) కలుపుతూ అఖండ గోదావరిపై రోడ్డు కం రైలు వంతెన ప్రారంభమైంది. కింది మార్గంలో రైలు వెళ్లేందుకు పట్టాలు.. దానిపైన రోడ్డు నిర్మించారు. అపురూపమైన ఈ రవాణా సౌకర్యం అందరినీ ఆనందాశ్చర్యాల్లో ముంచెత్తింది. గోదారమ్మ సాక్షిగా బస్సులోనో.. రైలులోనో గమ్యం చేరే మధురాభూతుల ప్రయాణానికి మార్గం ఏర్పడింది. మనదేశంలో రెండో అతిపెద్ద రోడ్డు కం రైలు ప్రయాణ వారధి ఇదే. 49 ఏళ్ల ఈ చారిత్రాత్మక వంతెన నాణ్యత పరిరక్షణ ఇప్పుడు సవాలుగా నిలిచింది. వయో భారం పెరగడంతో ఎక్కువ వాహనాలను ఈ వంతెనపై అనుమతించాలాంటే సందేహించాల్సి వస్తోంది. అందుకే ముందు జాగ్రత్తగా భారీ వాహనాలను అనుమతించకూడదని అధికారులు తాజాగా నిర్ణయించారు.

నిర్మాణం ఇలా: గోదారమ్మ వడ్డాణం ధరించిందా అన్నట్టుటుంది రైలు కం రోడ్డు వంతెన. ఈ వంతెనపై ప్రయాణమంటే ఇష్టం లేని వారే ఉండరు. ఇప్పటికీ బస్సు లేదా రైలులో ప్రయాణిస్తున్నప్పుడు రాజమహేంద్రవరం వస్తుందనగానే అందరి కళ్లూ ఉరకలేసే గోదారిని చూడాలని ఆరాటపడతాయి. ఆనందానుభూతులను మనసులో నింపుకొంటారు. చెన్నై–హౌరా మధ్య రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు ఈ వారధి నిర్మాణం తెరపైకి వచ్చింది. 1964లో ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఒక దశాబ్దం పట్టింది. జపాన్‌లో కన్‌సాయి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 1994లో 3.7 కిలోమీటర్ల పొడవున నిర్మించిన స్కైగేట్ బ్రిడ్జి తర్వాత పెద్ద వంతెన ఇదే కావడం విశేషం. అత్యాధునిక టెక్నాలజీని వినియోగించి మూడు జాతీయ సంస్థలు ఈ వంతెన నిర్మాణంలో పాలు పంచుకున్నాయి. 1974 నవంబర్ 20 అప్పటి రాష్ట్రపతి ఫ్రక్రుద్దీన్ ఆలీ అహ్మద్ దీనిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అరవై ఐదేళ్ల కనిష్టం, ఎనభై ఏళ్ల గరిష్టంగా మనగలిగేలా వారధిని నిర్మించారు. అప్పటి నుంచి ఈ వారధి ఉభయ గోదావరి సమైక్య వాహినిగా ఖ్యాతినార్జించింది.

ఇప్పుడేమైంది: నిర్మాణ సమయంలో అనుకున్న అంచనాలకు మించి తర్వాత ఈ వారధిపై రాకపోకలు జరుగుతున్నాయి. రోజుకు 25 వేల నుంచి 30 వేల వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయని అంచనా. రవాణా అవసరాలు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య భారీగా పెరిగిపోయింది. సరకు రవాణాకూ ఈ మార్గాన్నే అనుసరించేవి. ఫలితంగా వాహనాల రద్దీ భారీగా పెరిగింది. వారధికి భారంగా పరిణమించింది. దీంతో 49 ఏళ్లకే వంతెన మార్గం ప్రమాదంలో పడింది. 2007, 2011లలో దీనిని నిపుణులు పరిశీలించారు. మూడు ఆక్సిల్స్ అంతకంటే ఎక్కువ ఉన్న వాహనాలు, లేదా 10.20 టన్నుల బరువుకు మించిన వాహనాలు ఈ మార్గంలో వెళ్లడం సరికాదని సూచించారు. దీంతో అధికారులు వంతెన భద్రతను దృష్టిలో పెట్టుకుని భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు.

నిర్లక్ష్యానికి మూల్యం

క్షేత్ర స్థాయిలో వంతెనపై భారీ వాహనాకు సంబంధించిన రూపొందించిన నిషేధాజ్ఞలు సక్రమంగా అమలు కాలేదు. 2010లో రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీసుల ఉదాశీన వైఖరిని ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ఎస్సైతో పాటు దిగువ స్థాయిలోని పదిమంది సిబ్బందిని అప్పట్లో సస్పెండ్ చేశారు. తర్వాత నిబంధనల అమలుకు వంతెన మార్గానికి అటు ఇటు పోలీసులు పికెట్లు ఏర్పాటు చేశారు. తర్వాత సిబ్బంది కొరత కారణంగా ఎత్తివేశారు. దీంతో భారీ వాహనాల నియంత్రణపై పర్యవేక్షణ కొరవడింది. అధికారులు ఇటీవల వంతెన భద్రతను దృష్టిలో పెట్టుకుని మళ్లీ ఇరువైపులా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. ఈ ఏడాది జూలై 23 నుంచి భారీ వాహనాల నియంత్రణపై కలెక్టర్ మాధవీలత గట్టి ఆంక్షలు విధించారు. రెండు వైపులా పోలీసు పికెట్లను పునరుద్ధరించారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వంటివి మాత్రమే అనుమతిస్తున్నారు. సామాన్య ప్రజలకు అసౌకర్యం కలగకుండా పల్లెవెలుగు బస్సులను అనుమతిస్తున్నారు.

రూ.36 కోట్లతో మరమ్మతులు

ఈ వంతెనపై 1996 నుంచి ఇప్పటివరకూ అడపాదడపా మరమ్మతు పనులు చేపడుతున్నారు. కానీ అవి నిలవడం లేదు. ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు ఈ వంతెన మార్గానికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రూ.36 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. రూ.24 కోట్ల వ్యయంతో గడ్డర్ల మార్పిడి, ఫుట్‌పాత్ నిర్మాణం, శ్లాబులు వేయడం, హ్యాండ్ రైలింగ్ వంటి పనులు ఇందులో చేపడతారు. ఈ మొత్తంలో రూ.3 కోట్లు మాత్రమే రైల్వే శాఖ వాటాగా భరించాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తంతో జాయింట్ల మరమ్మతులు, రోడ్డు నిర్మాణం, సెకండరీ జాయింట్ మరమ్మతులు, లైటింగ్ ఏర్పాటు, క్రోకడయిల్ జాయింట్ మరమ్మతులు చేపట్టాలని సంకల్పించారు. అత్యవసరంగా రూ.2.10 కోట్ల వ్యయంతో వారధికి ప్రత్యేక మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. అప్రోచ్ రోడ్లను కూడా పునరుద్ధరించనున్నారు. ఈ పనులకు టెండర్లు పిలిచారు.

బెలుగా.. భలేగా..



ప్రపంచంలోనే అతి పెద్ద కార్గో..

శంషాబాద్: సరుకు రవాణాలో ప్రపంచంలోనే అతిపెద్దదయిన బెలుగా విమానం మరోసారి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. వియత్నాం నుంచి ఈజిప్ట్ వెళ్తున్న ఈ విమానంలో ఇంధనం నింపడంతో పాటు పైలట్ల విశ్రాంతి కోసం సోమవారం అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. తిరిగి బుధవారం రాత్రి ఇక్కడి నుంచి ఈజిప్ట్‌కి బయలుదేరింది. గతేడాది డిసెంబర్ 4 రాత్రి దుబాయ్ నుంచి భారీ సరుకుతో థాయ్‌లాండ్‌లోని పటాయా వెళుతూ ఇంధనం, విశ్రాంతి కోసం బెలుగా ల్యాండ్ అయింది. ప్రపంచంలో కెల్లా అతి పెద్ద సరుకు రవాణా విమానాల్లో ఈ ఎయిర్‌బస్ బెలుగా విమానం(ఏ300–600 సూపర్ ట్రాన్స్ పోర్టర్) ఒకటి. విమాన ఆకారం ఉబ్బెత్తు తలతో ఉండే బెలుగా రకం తిమింగలాలను పోలి ఉండటంతో ఆ పేరుతో ఖ్యాతి గాంచింది. రష్యన్ భాషలో బెలుగా అంటే తెల్లని అని అర్థం. ప్రపంచంలో ఇవి ఐదు మాత్రమే ఉన్నాయి.

బెలుగా విమానం పొడవు 56.15 మీటర్లు, ఎత్తు 17.24 మీటర్లు, బరువు మోసుకెళ్లే సామర్థ్యం 47 వేల కేజీలు, బెలుగా విమానాల తయారీలో యూకే, స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ ఏరోస్పేస్ కంపెనీలు పాలు పంచుకున్నాయి. కాగా, అతి పెద్ద కార్గో విమానాల్లో ఒకటైన అంటోనోవ్ ఏఎస్–225 మ్రియా కూడా ఇంధనం, విశ్రాంతి కోసం 2016 మే 13న శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. అయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో మ్రియా విమానం ధ్వంసమైంది. మ్రియా అంటే రష్యన్ భాషలో కల అని అర్థం. ప్రస్తుతం మ్రియా లేకపోవడంతో కార్గోలో బెలుగానే అతిపెద్ద విమానంగా గుర్తిస్తున్నారు.

పర్యావరణ బడ్జెట్ ఫినిష్!

ఆగస్టు 2తో ఖర్చయిపోయిన ప్రపంచ దేశాల వార్షిక బడ్జెట్

- నేటి నుంచి 'పర్యావరణ అప్పు'తోనే మన బతుకు.. గత ఏడాది ఒకరోజు ముందుగా ఆగస్టు 1తోనే నిండుకున్న బడ్జెట్
- 1971 వరకు భూగోళం ఇవ్వగలిగే పరిమితులకు లోబడే వనరుల వినియోగం
- రాను రాను భూగోళంపై పెరిగిపోయిన వత్తిడి.. ప్రస్తుతం అవసరమైన పర్యావరణ వనరులు సమకూరాలంటే 1.75 భూగోళాలు కావాలి
- 'గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్' వెల్లడి
- అందరూ అమెరికన్లలా బతికితే 5 భూగోళాలు కావాలి.. అదే భారతీయుల్లా అయితే 0.8 భూగోళం చాలు.. అంటే 20% మిగులు బడ్జెట్



ప్రపంచ దేశాల పర్యావరణ బడ్జెట్ బుధవారంతో పూర్తిగా ఖర్చయిపోయింది. గురువారం నుంచి భూమి అప్పుగా సమకూర్చేదే. కాస్త వింతగా అన్పించినా ఇది వాస్తవం. ఆర్థిక వనరులకు సంబంధించి వార్షిక బడ్జెట్లు, లోటు బడ్జెట్లు, అప్పులు ఉన్నట్టే పర్యావరణ వనరులకు కూడా బడ్జెట్ ఉంది. గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్ తాజా అంచనా ప్రకారం.. ఆ బడ్జెట్ ఆగస్టు 2తో అయిపోయింది. అంటే..భూగోళానికున్న పర్యావరణ వనరుల సామర్థ్యం (బయో కెపాసిటీ) అంత వరకేనన్నమాట. దీన్నే 'వరల్డ్ ఎర్త్ ఓవర్ షూట్ డే'అని పిలుస్తున్నారు. ఇక ఆగస్టు 3 నుంచి మనం వాడేదంతా భూమి తన మూలుగను కరిగించుకుంటూ కనాకష్టంగా సమకూర్చే అప్పు (అదనపు వనరులు) మాత్రమే.

గత ఏడాది ఈ పర్యావరణ బడ్జెట్ ఆగస్టు 1తోనే అంటే ప్రస్తుత ఏడాదితో పోల్చుకుంటే ఒకరోజు ముందే అయిపోయింది. ఈ ఏడాదిలో కొద్దోగొప్పో పర్యావరణ స్పృహ పెరగడంతో ఒక రోజు అదనంగా సమకూరిందన్నమాట. పర్యావరణ బడ్జెట్ 1971 వరకు భూగోళం ఇవ్వగలిగే పరిమితులకు లోబడే ఉండేదట.

1.75 భూగోళాలు కావాలి

అంటే 365 రోజులూ లోటు లేకుండా ఉండేదని గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్ అంచనా వేసింది. ఆ తర్వాత నుంచి క్రమంగా ప్రపంచవ్యాప్తంగా జనాభా పెర గడంతో పాటు వినియోగంలో విపరీత పోకడల వల్ల భూగోళంపై ఒత్తిడి పెరిగిపోయింది. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ కలిసి 175% మేరకు ప్రకృతి వనరులు వాడేస్తున్నాయి. అంటే.. మనకు అవసరమైన వనరులు సునాయాసంగా సమకూర్చాలంటే 1.75 భూగోళాలు కావాలన్నమాట.

ఎక్కువ వ్యయం చేస్తున్న సంపన్న దేశాలు

ప్రకృతి వనరుల వినియోగం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. సంపన్న దేశాలు ఎక్కువ వనరులను ఖర్చు చేస్తున్నాయి. ఉదాహరణకు.. అమెరికా వాసుల మాదిరిగా ప్రకృతి వనరులను వాడితే 5.1 భూగోళాల పర్యావరణ సేవలు మనకు అవసరమవుతాయి. చైనీయుల్లా జీవిస్తే 2.4 భూగోళాలు కావాలి. ఇక ప్రపంచ పౌరులందరూ భారతీయుల్లా జీవిస్తే 0.8 భూగోళం చాలు. అంటే.. పర్యావరణ బడ్జెట్ 20% మిగులులోనే ఉంటుందన్న మాట.

ఖతార్ బడ్జెట్ ఫిబ్రవరి 10నే ఖతం!

ప్రపంచవ్యాప్తంగా తలసరి వార్షిక పర్యావరణ వనరుల సామర్థ్యం (బయో కెపాసిటీ) 1.6 గ్లోబల్ హెక్టార్లు (బయో కెపాసిటీని, ఫుట్‌ప్రింట్ (ఖర్చు)ని 'గ్లోబల్ హెక్టార్ల'లో కొలుస్తారు). దీనికన్నా ఖర్చు (ఫుట్‌ప్రింట్) ఎక్కువగా ఉంటే పర్యావరణ బడ్జెట్ అంత తక్కువ రోజుల్లోనే అయిపోతుంది. తక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ రోజులు కొనసాగుతుంది. భారత్‌లో తలసరి వార్షిక పర్యావరణ బడ్జెట్ 1.04 గ్లోబల్ హెక్టార్లు. అంటే లభ్యత కన్నా ఖర్చు తక్కువగా (20% మిగులు బడ్జెట్) ఉందన్న మాట. ఇక అత్యంత సంపన్న ఎడారి దేశం ఖతార్ పర్యావరణ బడ్జెట్ ఫిబ్రవరి 10నే అయిపోవడం గమనార్హం. కెనడా, యూఏఈ, అమెరికాల బడ్జెట్ మార్చి 13తో, చైనా బడ్జెట్ మే 1తో అయిపోగా, ఆగస్టు 12న బ్రెజిల్, డిసెంబర్ 20న జమైకా బడ్జెట్లు అయిపోతున్నాయి.

ప్రకృతి వైపరీత్యాలన్నీ ఇందుకే..

వనరులు సమకూర్చే శక్తి భూగోళానికి లేకపోయినా మనం వాడుకుంటూనే ఉన్నాం కాబట్టే భూగోళం అతలాకుతలమైపోతోంది. ఎన్నడూ ఎరుగనంత ఉష్ణోగ్రతలు, కుండపోత వర్షాలు, కరవు కాటకాలు.. ఈ ప్రకృతి వైపరీత్యాలన్నీ మనం పర్యావరణ వనరులు అతిగా కొల్లగొడుతున్న దాని ఫలితమే. పర్యావరణ లోటు బడ్జెట్టుతో అల్లాడుతున్న భూగోళాన్ని స్థిమితపరిచి మన భవిష్యత్తును బాగు చేసుకోవాలంటే.. పర్యావరణ వార్షిక బడ్జెట్టు 365 రోజులకు సరిపోవాలంటే.. మానవాళి మూకుమ్మడిగా జీవన విధానాన్ని మార్చుకోవాలి. వనరులను పొదుపుగా వాడాలి.

ముఖ్యంగా ఐదు పనులు చేయాలి. పర్యావరణ హితమైన ఇంధనాలు వాడాలి. ఆహారోత్పత్తి పద్ధతులను పర్యావరణ హితంగా మార్చుకోవాలి. నగరాల నిర్వహణలో ఉద్గారాలు, కాలుష్యం తగ్గించుకోవాలి. భూగోళంపై ప్రకృతి వనరులకు హాని కలిగించని రీతిలో పారిశ్రామిక కార్యక్రమాలు చేపట్టాలి. అన్నిటికీ మించి వనరుల తక్కువ వినియోగానికి వీలుగా జనాభా పెరుగుదలను అదుపులో ఉంచుకోవాలి.

- సాక్షి సాగుబడి డెస్క్-



మోహనవాణి



పిల్లలకు తాటాకు బొమ్మల తయారీ నేర్పుతున్న మోహనవాణి

మన బాల్యం

తాటాకు బొమ్మలోచ్



తాటాకులు ఇప్పటికీ మన పల్లెల్లో విస్తారం. కాని తాటాకు విసనకర్రలు పోయాయి.
తాటాకు చాపలు, తాటాకు బొమ్మలూ పోయాయి.
'మన కళ ఇది. మన పిల్లలకు బార్బీ కంటే తాటాకు బొమ్మలే నచ్చుతాయి'
అంటుంది కోయంబత్తూరు మోహనవాణి.
తాటాకు కళను పిల్లలకు నేర్పించి వారికై వారు తయారు చేసుకున్న బొమ్మలతో ఆడుకునేందుకు ప్రోత్సహిస్తోంది. స్త్రీలు సరిగా నేర్చుకుంటే ఉపాధి మార్గం అని కూడా చెబుతోంది.

మన దేశంలో పశ్చిమ బెంగాల్‌లో తాటాకుతో చేసే బొమ్మలకు, బుట్టలకు చాలా డిమాండ్ ఉందని చాలా కొద్ది మందికే తెలుసు. విశాఖ జిల్లా నక్కపల్లి, నర్సీపట్నంల నుంచి శ్రేష్ఠమైన తాటాకు గ్రేడింగ్ అయ్యి, రంగులు అద్దుకుని కోల్‌కతాకి ఎగుమతి అవుతుంది. అక్కడ వాటితో బొమ్మలు, బుట్టలు తయారు చేసి అమ్ముతున్నారు. పెద్ద ఆదాయం. విశాఖలో జరుగుతున్నట్టుగా మిగిలిన జిల్లాల్లో జరగడం లేదు. తాటాకులు మన తొలి కాగితాలు. తాటాకుతో ఒకప్పుడు ఇళ్లు కప్పేవారు, పందిళ్లు వేసేవారు, చాపలు, బుట్టలు, బొమ్మలు తయారు చేసేవారు. ఇప్పుడు ఆ కళంతా ఎవరూ సాధన చేయడం లేదు. దానిని అందరికీ నేర్పించాలని కూడా అనుకోవడం లేదు. కాని తమిళనాడులో 34 ఏళ్ల మోహనవాణి అనే మహిళ పట్టుబట్టి తాటాకు బొమ్మల కళను అందరికీ నేర్పుతోంది. దక్షిణాదిలో విస్తారంగా ఉండే తాటి చెట్టు నుంచి ఆకు సేకరించి బొమ్మలు చేసి ఉపాధి పొందవచ్చంటున్నది.





ఎనిమిదేళ్ల వయసులో..

మోహనరాణిది కోయంబత్తూరు. ఆమెకు ఎనిమిదేళ్లు ఉండగా మేనమామ ఆమెకు తాళపత్ర గ్రంథం చూపించాడు. రోజూ చూసే తాటాకుల మీద పుస్తకమే రాయవచ్చా అని మోహనరాణికి ఆశ్చర్యం వేసింది. తాటాకులతో చిన్న చిన్న బొమ్మలు చేసే ప్రయత్నం చేసింది గాని పూర్తిగా రాలేదు. అప్పటినుంచి తాటాకు బొమ్మలు చేయాలనే కోరిక ఉండిపోయింది. ఐదేళ్ల క్రితం మదురైలో తాటాకు బొమ్మలు నేర్పించే వర్క్‌షాప్ జరుగుతున్నదని తెలిసి హాజరయ్యింది. మూడు రోజుల ఆ వర్క్‌షాప్‌లో తాటాకు బొమ్మలు చేయడం నేర్పించారు. పచ్చి ఆకుతో నేరుగా, ఎండిన ఆకైతే నీటితో తడిపి మెత్తగా చేసుకుని అప్పుడు బొమ్మలు చేయాలని తెలిసింది. ఎలా కత్తిరిస్తే ఏ షేప్ వస్తుందో అర్థమయ్యాక తన ఊహ కలిపి బొమ్మలు తయారు చేసింది. వాటికి పూసలు జత చేయడంతో స్పష్టమైన బొమ్మలు తయారయ్యాయి. మోహనవాణి తాటాకులతో చీమలు, చిలుకలు, నెమళ్లు, చేపలు... ఇలా చాలా బొమ్మలు చేస్తుంది. వాటితో గట్టి బుట్టలు కూడా అల్లుతుంది.

పిల్లల లోకం

అయితే ఈ బొమ్మలు తర్వాతి తరాలకు అందాలని నిశ్చయించుకుంది మోహనవాణి. కోయంబత్తూరులోని స్కూళ్లకు వెళ్లి తాటాకు బొమ్మలు నేర్పించింది. పిల్లలు ఎంతో హుషారుతో బొమ్మలు నేర్చుకున్నారు. కొత్త బొమ్మలు చేశారు. 'ఆశ్చర్యం ఏమిటంటే మీరు తయారు చేసిన బొమ్మలతో కథ కల్పించి చెప్పండి అనంటే వాళ్లు చాలా విచిత్రమైన కథలు చెప్పారు. పిల్లలకు ఇదెంతో మానసిక వికాసం అనిపించి తరచూ అనేక స్కూళ్లకు వెళ్లి వర్క్‌షాపులు నిర్వహించి ఈ కళను నేర్పుతున్నాను' అంది మోహనవాణి.

ప్లాస్టిక్‌కు దూరం

తాటాకు బొమ్మలు పర్యావరణ హితమైనవి. పిల్లల్ని, పర్యావరణాన్ని ప్లాస్టిక్ నుంచి దూరంగా ఉంచుతాయి. అంతేకాదు తాటాకు బొమ్మలు దేశీయమైనవి. మనదైన కళ కావడం వల్ల పిల్లలు కృత్రిమ పాశ్చాత్య బొమ్మలతో కాకుండా అమాయకమైన ఈ బొమ్మలతో ఎక్కువ ఆనందం పొందుతారు. 'పర్యావరణ స్పృహ పెరిగింది కాబట్టి తాటాకు బుట్టలను, బాక్సులను, విసనకర్రలను చాలామంది కొంటున్నారు. మహిళలు ఈ కళను నేర్చుకుంటే అతి తక్కువ పెట్టుబడితో మంచి ఉపాధి పొందవచ్చు' అంటోంది మోహనవాణి. ఆమె ఇప్పుడు ముంబైలోని కొన్ని స్కూళ్లకు వెళ్లి ఈ విద్య నేర్పుతోంది. మిగిలిన రాష్ట్రాలలో కూడా చాలా స్కూళ్లు ఆమెను ఆహ్వానిస్తున్నాయి. టీచర్లు ఈ క్రాఫ్ట్ నేర్చుకుంటే పిల్లలకు నేర్పించవచ్చని టీచర్లకు తాటాకు కళ నేర్పుతోంది మోహనవాణి.

'తాటాకు బొమ్మలు చేయడం పెద్ద స్ట్రెస్ బస్టర్. మీ ఒత్తిడి దూరం చేసుకోవడానికైనా తాటాకు అందుకుని బొమ్మలు చేయండి' అంటోంది మోహనవాణి.

ప్రకృతి చాలా చిత్రమైంది.
ధాన్యాన్ని ఎండించి ఇస్తుంది.
కాయగూరలను పండించి ఇస్తుంది.
ధాన్యం ఏడాదంతా నిల్వ ఉంటుంది.
కాయలు పండ్లకు రోజులే జీవిత కాలం.
ఆ కాయలు పండ్లను కూడా ఎండబెడితే...
అవి కూడా ఏడాదంతా నిల్వ ఉంటాయి.

పంటకు షెల్ఫ్‌లైఫ్



వరుణ్ రహేజా

ముందు చూపు ఉంటే ఏదీ వృథా కాదు, దేనిధరా కొండెక్కదు... అని నిరూపించాడు ఇందోర్‌కు చెందిన మెకానికల్ ఇంజనీర్ వరుణ్ రహేజా. రైతుల ఆత్మహత్యలు, టొమాటోలు కోసిన ధరలు కూడా రావని పంటను వదిలేయడం వంటి వార్తలు తనను కలచివేశాయి. పంటను నిల్వ చేసుకోగలిగితే రైతుల నష్టాలు, మరణాలను నివారించవచ్చనుకున్నాడు. కరెంట్ లేని ప్రదేశాల్లో కూడా ఉపయోగకరంగా ఉండడానికి సూర్యరశ్మితో పనిచేసే సోలార్ డ్రైయర్‌ను రూపొందించాడు. గత వేసవిలో కిలో రెండున్నర రూపాయల చొప్పున సేకరించిన టొమాటోలను డ్రైయర్‌లో ఎండబెట్టి తన ప్రయోగ ఫలితాన్ని నిరూపించాడు వరుణ్. యువతలో సామాజిక స్పృహ మెండుగా ఉన్నప్పుడు, చదువుతో వచ్చిన జ్ఞానం తన ఉన్నతితోపాటు సామాజికాభివృద్ధికి కూడా దోహదం చేయాలనే ఆలోచన ఉన్నప్పుడు మాత్రమే ఇలాంటి ప్రయోగాలు సాధ్యమవుతాయి. వరుణ్ చేసిన ప్రయోగం వ్యవసాయరంగానికి మేలు చేస్తోంది.

ఆలోచన... ఆసక్తి!

"నేలలో నాటిన విత్తనం నుంచి ఒక చెట్టు మొలవడం, అది పెద్దయి... పూత పూసి కాయ కాచి అది పండే వరకు ప్రతిదీ ప్రకృతి చేసే అద్భుతమే. పంటను, పొలాన్ని సంరక్షించడంలో రైతు పడే కష్టాన్ని కొలవడానికి ఏ పరికరమూ ఉండదు. అలాంటిది పండించిన పంటను చేతులారా నేలపాలు చేసేటప్పుడు రైతు అనుభవించే ఆవేదన ఎలాంటిదో నాకు తెలియదు, కానీ ఆ పంట నేలపాలవుతుంటే నా మనసు మౌనంగా రోదించేది. పంటను నిల్వ చేసుకునే అవకాశం ఉంటే ఆ రైతు తన చేతులారా పండించిన పంటను అలా నేలపాలు చేయడు కదా అనిపించేది. ఈ ఆలోచనలు నేను మెకానికల్ ఇంజనీర్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో ఒక కొలిక్కి వచ్చాయి. పోషకాలు వృథా కాని విధంగా పండ్లు, కాయల్లోని తేమను సహజంగా తొలగించగలిగితే పంటను నిల్వ చేయవచ్చు. అది సౌరశక్తితో సాధ్యమని తెలిసిన తర్వాత నా ప్రయత్నాలను ముమ్మరం చేశాను. సోలార్ డ్రైయర్‌ను రూపొందించడంతోపాటు అన్ని రకాల రైతులకు అది అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఒక ప్రదేశంలో స్థిరంగా ఉండే పాలీ హౌస్‌తోపాటు ఇరవై కిలోల నుంచి వంద కిలోల కెపాసిటీ గలిగిన పోర్టబుల్ డ్రైయర్‌లను కూడా రూపొందించాను. వీటిని ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు.



సోలార్ డ్రైయర్

మేధ సమాజానికి ఉపయోగపడాలి!

నేను చేసే పని నాకు నచ్చినదై ఉండాలి. ఒకరు చెప్పిన పని చేయడానికి నా మేధను పరిమితం చేయడం నాకిష్టం లేదు. నేను చేసే పని సమాజానికి ఉపయోగపడేదై ఉంటే అందులో లభించే సంతృప్తి అనంతం. టొమాటోల ధరలు వార్తల్లో ఉండడాన్ని చూస్తూనే పెరిగాను. రైతన్నల శ్రమకు ఫలితం కొనుగోలు చేసే వ్యాపారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటోంది. పండించిన రైతులు ఎప్పుడూ అనిశ్చితిలోనే ఉంటున్నారు. సప్లయ్ చైన్ దళారులతో నిండిపోయి, రైతుకు ఉపయుక్తంగా లేకపోవడమే ఇందుకు కారణం. పొలంలో పండిన పంట వంటగదికి చేరేలోపు వివిధ దశల్లో 30 నుంచి 40 శాతం వృథా అవుతోంది. ఆ వృథాని అరికట్టడం, పండించిన రైతుకు తన పంటకు తగిన ధర నిర్ణయించగలిగే స్థితి కల్పించడం నా లక్ష్యం. అందుకే పంటను ఎండబెట్టి నిల్వ చేసే ఇండస్ట్రీని స్థాపించాను" అన్నాడు తన ప్రయోగాల కోసం రహేజా సోలార్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించిన వరుణ్ రహేజా. వరుణ్ కొత్త పరికరాల రూపకల్పనలో నిమగ్నమై ఉంటే, అతడు నెలకొల్పిన పరిశ్రమను తల్లి బబిత నిర్వహిస్తున్నారు.

కిచెన్ టిప్స్

- కూర అడుగంటినప్పుడు రెండు మూడు ఐస్ క్యూబ్స్‌ను వేసి కరిగేంత వరకు తిప్పాలి. ఇలా చేస్తే పాత్రకు అంటుకున్నది విడిపోయి కూర అడుగంటకుండా ఉంటుంది.



- కిచెన్‌లో నూనె వొలికిపోతే వెంటనే వొలికిన నూనె మీద గోధుమ పిండి చల్లాలి. ఐదు నిమిషాల తరువాత పేపర్‌తో తుడిస్తే నూనె పడిన ప్రాంతం జిడ్డులేకుండా శుభ్రం పడుతుంది.
- వర్షాకాలంలో వాతావరణంలోని తేమను పీల్చుకుని... డోర్లు వేసినప్పుడు, తీసినప్పుడు కిర్రుమని శబ్దాలు చేస్తుంటాయి. డోర్లను పట్టి ఉంచే బోల్టుల వద్ద కొద్దిగా టాల్కం పౌడర్ చల్లడం వల్ల లేదా కొవ్వొత్తిని రుద్దడం వల్ల ఆ శబ్దాలు రాకుండా ఉంటాయి.



- ఈ వర్షాకాలంలో ఇలా కడగడం వల్ల పండ్లు, కూరగాయలు త్వరగా పాడవకుండా ఉండాలంటే.. వేడినీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ వేసి కలపాలి. ఈ నీటిలో పండ్లు, కూరగాయలను పదిహేను నిమిషాలు ఉంచి, తరువాత సాధారణ నీటితో కడిగేయాలి.

రోల్ మోడల్

అనుభవం నేర్పిన పాఠం ఊరకే పోదు.
వివిధ రంగాలలో ఎన్నో సంవత్సరాలు పనిచేసిన రాధిక అగర్వాల్ తడబడుతూనే వ్యాపారప్రపంచంలోకి అడుగుపెట్టింది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘన విజయం సాధించింది.
యూనికార్న్ క్లబ్‌లోకి అడుగు పెట్టిన మహిళా వ్యాపారవేత్తగా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది...

ఆత్మవిశ్వాసమే గెలుపు మంత్రం



రాధిక అగర్వాల్

రాధిక అగర్వాల్ తండ్రి సైన్యంలో పనిచేసేవారు. తండ్రి ఉద్యోగరీత్యా జోధ్‌పూర్ నుంచి అహ్మద్‌నగర్ వరకు ఎన్నో చోట్ల చదువుకుంది రాధిక. వాషింగ్టన్ యూనివర్శిటీలో ఎంబీయే చేసిన రాధిక అగర్వాల్‌కు ఎంటర్‌ప్రెన్యూర్‌గా పెద్ద పేరు తెచ్చుకోవాలనే కల ఉండేది. అడ్వర్‌టైజింగ్, పబ్లిక్ రిలేషన్స్‌లలో పోస్ట్-గ్రాడ్యుయేషన్ కూడా చేసింది.

'చదువు ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. ఇక వ్యాపారంలోకి నిస్సందేహంగా అడుగు పెట్టవచ్చు' అనుకోలేదు ఆమె.

అనుభవ జ్ఞానం విలువ ఏమిటో రాధిక అగర్వాల్‌కు తెలియనిదేమీ కాదు.

చదువు పూర్తయిన తరువాత లైఫ్‌స్టైల్, ఇ-కామర్స్, ఫ్యాషన్, పబ్లిక్ రిలేషన్స్, రిటైల్ రంగాలలో 14 సంవత్సరాల పాటు పనిచేసింది.

ఎన్నో రంగాలలో ఎంతో అనుభవాన్ని సంపాదించిన రాధిక అగర్వాల్ ఛండీగఢ్‌లో ఒక యాడ్ ఏజెన్సీకి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత ప్రవాస భారతీయుల కోసం 'ఫ్యాషన్ క్లూస్' పేరుతో ఒక వెబ్‌సైట్ మొదలుపెట్టింది. మొదటి రెండు వ్యాపారాల విషయం ఎలా ఉన్నా...

ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ 'షాప్ క్లూస్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది రాధిక అగర్వాల్. రెండు సంవత్సరాల క్రితం బ్యూటీ, న్యూట్రీషన్, హోమ్‌కేర్‌కు సంబంధించి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ 'కైండ్ లైఫ్' ప్రారంభించి మరోసారి విజయం సాధించింది.

'ఒకసారి వెనక్కి చూస్తే... విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ కనిపిస్తాయి. అవి ఎప్పుడూ నన్ను హెచ్చరిస్తూనే ఉంటాయి. జాగ్రత్తగా ఉండమని చెబుతాయి. వ్యాపారంలో విజయానికి వినియోగదారులకు మనపై ఉండే విశ్వాసం అనేది ముఖ్యం. అది గెలుచుకుంటే కచ్చితంగా గెలుపు మనదే. దీనికి వ్యూహాల కంటే మన నిజాయితీ అనేది ముఖ్యం. వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొనడం ద్వారానే ఇంత పెద్ద విజయాన్ని సాధించగలిగాం' అంటుంది రాధిక అగర్వాల్.

ప్రతి సంవత్సరం 'ఉమెన్స్ డే' సందర్భంగా ఎక్కడో ఒకచోట మహిళలతో సమావేశం నిర్వహించి తన వ్యాపార ప్రస్థానాన్ని వారితో పంచుకుంటుంది. అగర్వాల్ స్ఫూర్తితో ఎంతోమంది మహిళలు వ్యాపారవేత్తలుగా విజయం సాధించారు.

'వ్యాపారంలో విజయం సాధించాలంటే ఉత్సాహం మాత్రమే సరిపోదు. బరిలోకి దిగే ముందు మన గురించి మనం విశ్లేషించుకోవాలి. ఎంతోమందితో మాట్లాడాలి. అయినా సరే, ఎప్పటికప్పుడు ఒక కొత్త సవాలు ఎదురవుతూనే ఉంటుంది. దానికి జవాబు చెప్పి ముందుకు కదలాలి. దీనికి కావాల్సింది ఆత్మ విశ్వాసం' అంటుంది రాధిక అగర్వాల్.

బ్యూటిప్



పొట్టు ఉన్న పెసర పప్పుని నాలుగు టీస్పూన్లు తీసుకుని రెండు గంటలు నానబెట్టి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ఆరెంజ్ పీల్ పొడి, టీస్పూను గంధం పొడి వేసి చక్కగా కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత కొద్దిగా నీటితో తడిచేసి మర్దన చేసి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం కాంతిమంతంగా, అందంగా కనిపిస్తుంది.

ఇన్‌కమ్ టాక్స్ ఫ్రాడ్



పాన్‌కార్డ్ ఉన్న సభ్యులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సోషల్ ఇంజినీరింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. స్కామర్లు అధికారులుగా నటిస్తూ చేసే మోసాల వల్ల బాధితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

డిజిటల్ టెక్నాలజీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మోసగాళ్లు కూడా దానిని వీలైనంతగా ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. పన్ను చెల్లింపుదారులను లక్ష్యంగా చేసుకున్న మోసగాళ్లు అమాయకులను మోసగించడానికి రకరకాల వ్యూహాలను ఉపయోగిస్తున్నారు.

బాధితుల ఆదాయం ప్రకారం తగినంత పన్ను చెల్లించకపోవడం, ఎక్కువ పన్ను చెల్లించడం వల్ల వాపసు వస్తుందని, సమయానికి పన్ను చెల్లించలేదనే కారణంతో .. ఈ మోసాలను ఎంచుకుంటారు.

రెండేళ్లుగా పెరిగిన మోసాలు

మన దేశంలో గతంతో పోల్చితే ఈ రెండేళ్లలో పన్నులకు సంబంధించిన స్కామ్‌లు గణనీయంగా పెరిగినట్టు నివేదికలు ఉన్నాయి. స్కామర్లు పన్ను చెల్లింపుదారుల భయాన్ని వాడుకుంటున్నారు. తక్కువ పన్ను చెల్లించారని, అధిక ఆదాయం ఉందని.. టాక్స్ కట్టకపోతే కటకటాలు లెక్కించాల్సి వస్తుందని అధికారుల వలె నటిస్తున్నారు. అంతేకాదు, భారీ పెనాల్టీ పడకుండా ఉండాలంటే త్వరగా టాక్స్ చెల్లించమనే విషయాలు చెబుతూ నమ్మబలికిస్తారు.

స్కామర్లు ఉపయోగించే సాధారణ పద్ధతులు

- నకిలీ అధికారిక లెటర్ హెడ్‌లు, లోగోలు, నిజమైన ఆదాయపు పన్ను శాఖను పోలి ఉండే ఈమెయిల్ చిరునామాలతో స్పూఫ్ ఈమెయిల్స్‌ను ఉపయోగిస్తారు. వీటిని పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు, అరెస్టులు, ఇన్‌కమ్‌టాక్స్ దాడులు జరుగుతాయనే స్కామర్ల వాదనలను బాధితులు నమ్ముతారు.
- మోసపూరిత ఆదాయపు పన్ను వెబ్‌సైట్స్ వినియోగదారులను, వారి వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయడం, చెల్లింపు చేయడం వంటివి చేస్తాయి.
- స్కామర్లు పన్ను అధికారులుగా నటిస్తూ మోసపూరిత ఆదాయపు పన్ను కార్యాలయం ఫోన్ నంబర్ల నుండి కాల్స్ చేస్తున్నట్టు చెబుతారు. పన్ను చెల్లింపుదారులను బెదిరించడం ద్వారా వారి డిమాండ్‌లను పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు, జరిమానాలు లేదా అరెస్టులు చేస్తామని బెదిరిస్తారు. ఇది నిజమని భావించి, బాధితులు తమ వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేస్తారు. ఇబ్బందుల్లో పడకుండా ఉండటానికి వెంటనే చెల్లింపు కూడా చేస్తారు.
- స్కామర్లు వాగ్దానం చేసిన విధంగా ఎక్కువ మొత్తం కాకుండా సులభ పద్ధతిలో 'ప్రాసెసింగ్ ఫీజు, పెనాల్టీ' వంటి వాటి కోసం వెంటనే చెల్లించమని అడుగుతారు. సాధారణంగా క్రిప్టో కరెన్సీ లేదా ప్రీపెయిడ్ కార్డ్‌ల వంటి సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చెల్లింపులు అడుగుతారు. లావాదేవీలను గుర్తించడం కష్టమవుతుంది. వెంటనే చెల్లిస్తే పన్ను రిటర్న్ అవుతుందనే వాగ్దానం కూడా చేస్తారు. స్కామర్ల రిక్వెస్ట్‌కు సహకరించేలా వ్యక్తులను ఏమార్చేందుకు ఈ వాగ్దానాలను చేస్తారు.



- టాక్స్ రిఫండ్ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవడానికి బ్యాంకు ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలు ఇవ్వవలసిందిగా మెసేజులు, మెయిళ్లు వస్తుంటాయి.

ఈ మోసం నుంచి రక్షించుకోవాలంటే..

- వెబ్‌సైట్ (ఏపీకే, డిఎమ్‌జెడ్ ఫైల్స్)ల నుండి ఎటువంటి అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేయవద్దు. ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి మాత్రమే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- తెలియని ఈమెయిల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఇన్‌కమ్‌టాక్స్ అధికారుల నుండి అన్ని అధికారిక కమ్యూనికేషన్ పోస్ట్, మెయిల్ ద్వారా అధికారిక ఈమెయిల్ నుండి పంపిస్తారు. జీమెయిల్ నుంచి కాదని గ్రహించాలి.
- ఈ మెయిల్‌కి జోడించిన ఏదైనా లింక్‌ని ఓపెన్ చేయడానికి ముందు పూర్తి ఈమెయిల్ హెడర్‌ని చూసి, నిర్ధారించుకోండి.

(a) https://mxtoolbox.com/EmailHeaders.aspx
(b) https://dnschecker.org/email-header-analyzer.php

ఎసెమ్మెస్‌లలో వచ్చే లింక్స్‌ను https://smsheader.trai.gov.in/లో లాగిన్ చెక్ చేయాలి.

- ఎసెమ్మెస్, వాట్సప్‌లలో వచ్చిన షార్ట్ లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయకూడదు. వాటిని ఓపెన్ చేయడానికి ముందుగా (https://www.unshorten.it లేదా https://www.checkshorturl.com) చెక్ చేయండి. ఫిషింగ్ లింక్స్ కావని https://isitphishing.org/ or https://www.urlvoid.com/ నిర్ధారించుకోండి.
- ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ మీ పాన్ నెంబర్, బ్యాంక్‌వివరాలు, ఓటీపీ వంటి ముఖ్యమైన సమాచారాన్ని ఇమెయిల్ లేదా ఫోన్ ద్వారా ఎప్పుడూ అడగదు. మిమ్మల్ని అలాంటి సమాచారం కోసం ఎవరైనా సంప్రదిస్తే వాటికి స్పందించకూడదు.
- ఏదైనా వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చే ముందు వెబ్‌సైట్ యుఆర్‌ఎల్‌ను ధృవీకరించుకోవాలి. మన దేశంలో ఆదాయపు పన్ను శాఖ అధికారక వెబ్‌సైట్ https://www.incometaxindia.gov.in
- అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఫీజులు, పెనాల్టీలు లేదా క్లెయిమ్ రీఫండ్‌లను చెల్లించాలి. వెబ్‌సైట్ https://www.incometax.gov.in
- ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్స్, వార్తా మూలాలను క్రమం తప్పకుండా చెక్ చేయడం ద్వారా తాజా స్కామ్‌లు, మోసాల వ్యూహాలు మీకు తెలుస్తాయి.

మోసాన్ని రిపోర్ట్ చేయాలంటే..

- మీకు అనుమానాస్పద మెసేజ్, ఈమెయిల్ లేదా ఫోన్ కాల్ వస్తే, దాన్ని వెంటనే ఆదాయపు పన్ను శాఖ లేదా స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయండి. ఈమెయిల్ లేదా వెబ్‌సైట్ webmanager@incometax.gov.in కి ఫార్వార్డ్ చేయండి.
- ఏదైనా పేమెంట్ UPI ద్వారా చెల్లించేటప్పుడు డబ్బు పోయినట్లయితే, టోల్-ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయండి లేదా https://cms.rbi.org.inలో రిపోర్ట్ చేయండి. లేదా CRPC@rbi.org.inకి ఇమెయిల్ చేయండి.
- మీరు బాధితులైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయండి. లేదా https://www.cybercrime.gov.in ఫిర్యాదు చేయండి.

ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్





రెండో రౌండ్‌లో అంకిత

ప్రాగ్ ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో భారత మహిళా స్టార్ అంకిత రైనా శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో అంకిత 3-6, 6-3, 6-4తో డబుల్స్ ప్రపంచ మాజీ నంబర్‌వన్ బార్బరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 71వ ర్యాంక్ లిండా నోస్కోవా (చెక్ రిపబ్లిక్)తో అంకిత ఆడుతుంది.

హంపి, హారిక విజయం




అజర్‌బైజాన్‌లో జరుగుతున్న ప్రపంచకప్ చెస్ టోర్నీ మహిళల విభాగం రెండో రౌండ్ తొలి గేమ్‌ల్లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక గెలుపొందారు. భారత్‌కే చెందిన నూతక్కి ప్రియాంకతో జరిగిన గేమ్‌లో హంపి 44 ఎత్తుల్లో... మిచలినా (పోలాండ్)తో జరిగిన గేమ్‌లో హారిక కూడా 44 ఎత్తుల్లో విజయం సాధించారు. ఓపెన్ విభాగంలో ఇరిగేశి అర్జున్, కార్తీక్ వెంకటరామన్, నారాయణన్, విదిత్ తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకోగా... గుకేశ్, అభిమన్యు గెలుపొందారు.

భారత్ బల ప్రదర్శన

వెస్టిండీస్‌పై తొలి రెండు వన్డేల్లో ప్రదర్శన భారత జట్టు ఆటతీరుపై సందేహాలు రేకెత్తించినా... తమ స్థాయి ఏమిటో చివరి పోరులో టీమిండియా చూపించింది. ఇద్దరు స్టార్ బ్యాటర్లు ఆడకపోయినా, ప్రత్యర్థిని చిత్తు చేయగల సత్తా తమకుందని నిరూపించింది. ఆఖరి వన్డేలో భారీ విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకున్న జట్టు ఇప్పుడు టి20 పోరుకు సిద్ధమైంది. ఇక్కడా సీనియర్లు లేకపోవడంతో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యువ ఆటగాళ్లకు ఇది సరైన అవకాశం.

- చివరి వన్డేలో భారీ విజయం
- 200 పరుగులతో చిత్తయిన వెస్టిండీస్
- 2-1తో సిరీస్ టీమిండియా సొంతం

తరూబా (ట్రినిడాడ్): వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ గెలుచుకుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో వన్డేలో భారత్ 200 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. 352 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 35.3 ఓవర్లలో 151 పరుగులకే కుప్పకూలింది. గుడకేశ్ మోతీ (34 బంతుల్లో 39 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, అలిక్ అతనజ్ (50 బంతుల్లో 32; 3 ఫోర్లు), అల్జారి జోసెఫ్ (39 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కొద్దిగా పోరాడగలిగారు. శార్దుల్ ఠాకూర్ వన్డేల్లో తన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన (4/37) నమోదు చేయగా, ముకేశ్ 3, కుల్దీప్ 2 వికెట్లు తీశారు. శుబ్‌మన్ గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. 2007 నుంచి ఇప్పటి వరకు వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా 13వ వన్డే సిరీస్ విజయం కావడం విశేషం.

పదునైన బౌలింగ్‌తో చెలరేగిన పేసర్ ముకేశ్ కుమార్ తొలి మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతని ధాటికి కింగ్ (0), మేయర్స్ (4), హోప్ (5) అవుట్ కావడంతో స్కోరు 17/3 వద్ద నిలిచింది. ఆ తర్వాత విండీస్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. పదేళ్ల తర్వాత తొలి వన్డే ఆడిన ఉనాద్కట్... కార్టీ (6)ని అవుట్ చేయగా... తన వరుస ఓవర్లలో శార్దుల్ రెండు వికెట్లు తీయడంతో స్కోరు 50/6కు చేరింది. అనంతరం తన వరుస ఓవర్లలో కుల్దీప్ తర్వాతి 2 వికెట్లు పడగొట్టాడు. ఈ దశలో మోతీ, జోసెఫ్ కొద్ది సేపు పట్టుదల కనబర్చి తొమ్మిదో వికెట్‌కు 60 బంతుల్లో 55 పరుగులు జోడించారు. అయితే ఈ జోడీని విడదీసిన శార్దుల్ తన తర్వాతి ఓవర్లో ఆఖరి వికెట్ కూడా తీసి విండీస్ ఆట ముగించాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: 351/5; వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి) ఇషాన్ (బి) ముకేశ్ 0; మేయర్స్ (బి) ముకేశ్ 4; అతనజ్ (బి) కుల్దీప్ 32; హోప్ (సి) గిల్ (బి) ముకేశ్ 5; కార్టీ (సి) గిల్ (బి) ఉనాద్కట్ 6; హెట్‌మైర్ (సి) సూర్యకుమార్ (బి) శార్దుల్ 4; షెఫర్డ్ (సి) ఉనాద్కట్ (బి) శార్దుల్ 8; కారియా (ఎల్బీ) (బి) కుల్దీప్ 19; జోసెఫ్ (సి) ఇషాన్ (బి) శార్దుల్ 26; మోతీ (నాటౌట్) 39; సీల్స్ (బి) శార్దుల్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (35.3 ఓవర్లలో ఆలౌట్) 151.** వికెట్ల పతనం: 1-1, 2-7, 3-17, 4-35, 5-40, 6-50, 7-75, 8-88, 9-143, 10-151. బౌలింగ్: ముకేశ్ 7-1-30-3, హార్దిక్ 4-1-13-0, శార్దుల్ 6.3-0-37-4, ఉనాద్కట్ 5-0-16-1, కుల్దీప్ 8-3-25-2, జడేజా 5-1-29-0.



తిలక్‌వర్మకు అవకాశం దక్కేనా!



- నేడు తొలి టి20 మ్యాచ్
- రాత్రి గం.8.00 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

టెస్టు, వన్డే సిరీస్ తర్వాత భారత్, వెస్టిండీస్ మధ్య టి20 పోరుకు రంగం సిద్ధమైంది. ఆఖరి వన్డే జరిగిన వేదికపైనే నేడు తొలి పోరు జరగనుంది. రాబోయే రోజుల్లో వరల్డ్ కప్ వరకు పూర్తిగా వన్డేలపైనే భారత్ దృష్టి పెట్టనున్న నేపథ్యంలో టి20 ఫార్మాట్‌లో తమ స్థానం పటిష్టం చేసుకోవాలనుకునే యువ ఆటగాళ్లకు ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ కీలకం కానుంది. రోహిత్, కోహ్లిలకు ముందే విశ్రాంతినివ్వడంతో ఈ సిరీస్‌లోనూ హార్దిక్ పాండ్యా నాయకత్వంలో భారత్ బరిలోకి దిగుతోంది. తుది జట్టు కూర్పును చూస్తే ప్రధాన బ్యాటర్లుగా ఇషాన్ కిషన్, యశస్వి, గిల్, సామ్సన్, సూర్యకుమార్ బరిలోకి దిగడం ఖాయం. ఇద్దరు ఆల్‌రౌండర్లుగా హార్దిక్, అక్షర్‌లకు కూడా చోటు తప్పనిసరి. అయితే వీరిద్దరు పూర్తి స్థాయి కోటా బౌలింగ్ చేయగలరు కాబట్టి భారత్ నలుగురు రెగ్యులర్ బౌలర్లను ఆడిస్తుందా లేక ముగ్గురు బౌలర్లనే ఆడించి మరో బ్యాటర్‌తో ఆరో స్థానాన్ని భర్తీ చేస్తుందా చూడాలి. అదే జరిగితే హైదరాబాదీ బ్యాటర్ ఠాకూర్ తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయవచ్చు. బౌలింగ్ దళంలో నలుగురు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. మరోవైపు విండీస్ ఈ ఫార్మాట్‌లోనైనా కొంత మెరుగైన ఆటతీరు కనబర్చాలని కోరుకుంటోంది. హెట్‌మైర్, పావెల్, పూరన్, చార్లెస్, మేయర్స్ ఎలాంటి మెరుపు ప్రదర్శన చూపిస్తారనేది ఆసక్తికరం.

భవానికి కాంస్యం



చెంగ్డూ (చైనా): ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో బుధవారం భారత్‌కు రెండు పతకాలు లభించాయి. షూటింగ్‌లో ఇలవేనిల్ వలారివన్-దివ్యాంశ్ సింగ్ పన్వర్ జోడీ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో రజతం సాధించగా... అథ్లెటిక్స్‌లో మహిళల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భగవతి భవాని యాదవ్ కాంస్య పతకాన్ని గెల్చుకుంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో ఇలవేనిల్-దివ్యాంశ్ ద్వయం 13-17తో యు జాంగ్-బుహాన్ సాంగ్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది. లాంగ్‌జంప్ ఫైనల్లో విజయవాడకు చెందిన భవాని యాదవ్ 6.32 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం భారత్ 11 స్వర్ణాలు, 5 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 23 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

ఫైనల్లో జ్యోతి సురేఖ బృందం



బెర్లిన్ (జర్మనీ): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ, అదితి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన టీమ్ ఈవెంట్‌లో రెండో సీడ్‌గా నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన భారత జట్టు 230-228తో తుర్కియే జట్టుపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 228-226తో చైనీస్ తైపీపై, సెమీఫైనల్లో 220-216తో కొలంబియాపై నెగ్గి ఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం జరిగే ఫైనల్లో మెక్సికోతో భారత్ ఆడుతుంది. తాజా ప్రదర్శనతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి సురేఖకు ఈ మెగా ఈవెంట్ చరిత్రలో ఆరో పతకం ఖరారైంది. విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ టీమ్ విభాగంలో రెండు రజతాలు (2021, 2017), ఒక కాంస్యం (2019)... వ్యక్తిగత విభాగంలో ఒక రజతం (2021), ఒక కాంస్యం (2019) సాధించింది. పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, రజత్ చౌహాన్, తుషార్‌లతో కూడిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో 1-5తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది.

టైటిల్ లక్ష్యంగా...

- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ బరిలో భారత్
- నేడు చైనాతో తొలి పోరు



సాక్షి, చెన్నై: స్వదేశంలో తొలిసారి జరుగుతున్న ఆసియా పురుషుల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో టైటిల్ సాధించడమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి గురువారం ఎగ్మోర్‌లోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో తెర లేవనుంది. భారత్‌తోపాటు పాకిస్తాన్, చైనా, మలేసియా, జపాన్, దక్షిణ కొరియా జట్లు ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. తొలి రోజు కొరియాతో జపాన్ (సాయంత్రం గం. 4 నుంచి); మలేసియాతో పాకిస్తాన్ (సాయంత్రం గం. 6:15 నుంచి); చైనాతో భారత్ (రాత్రి గం. 8:30 నుంచి) పోటీపడతాయి. భారత్, పాక్ మ్యాచ్ ఆగస్టు 9న జరుగుతుంది. ఆరు జట్ల మధ్య ముందుగా రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహిస్తారు. టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్‌లో నెగ్గిన జట్లు ఆగస్టు 12న ఫైనల్లో తలపడతాయి. మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

శ్రీకాంత్, సింధు ముందంజ

- ప్రణయ్, ప్రియాన్షు కూడా
- ప్రపంచ ఏడో ర్యాంకర్‌పై మిథున్ గెలుపు



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జ్... మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో శ్రీకాంత్ 21-18, 21-7తో ప్రపంచ 14వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)పై, ప్రణయ్ 21-18, 16-21, 21-15తో లీ చెయుక్ యు (హాంకాంగ్)పై, ప్రియాన్షు 21-12, 21-16తో నాథన్ టాంగ్ (ఆస్ట్రేలియా)పై నెగ్గారు. ప్రపంచ 50వ ర్యాంకర్ మిథున్ 21-19, 2-19తో ప్రపంచ ఏడో ర్యాంకర్, 2021 ప్రపంచ చాంపియన్ కీన్ యె లో (సింగపూర్)పై సంచలన విజయం సాధించగా... కిరణ్ జార్జ్ 5-0తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి లక్ష్య సేన్ గాయం కారణంగా వైదొలిగాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21-18, 21-13తో భారత్‌కే చెందిన అస్మిత చాలిహాపై నెగ్గగా... ఆకర్షి 21-15, 21-17తో గో జిన్ వె (మలేసియా)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధుతో పోరుకు సిద్ధమైంది. భారత్‌కే చెందిన మాళవిక 20-22, 11-21తో పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో, తస్నిమ్ 13-21, 7-21తో కొమాంగ్ అయు (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు.

సినిమా

మాటల్లేవ్.. కోతలే!


● రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. కాగా 'జైలర్' నుంచి 'జైలర్ షోకేస్' వీడియోను బుధవారం రిలీజ్ చేశారు. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను హీరో నాగచైతన్య షేర్ చేశారు. 'నువ్వు ఆయన్ను చూసింది ఓ పోలీసోడి తండ్రిగానే.. కానీ ఆయనలో నువ్వు చూడని ఇంకొకణ్ణి నేను చూశాను' (జాకీ ష్రాఫ్), 'ఒక రేంజ్ తర్వాత మన దగ్గర మాటలుండవ్.. కోతలే', 'ఇక్కడితో ఆపేయిచ్చుగా (రమ్యకృష్ణ)... 'బాగా దూరం పోయాను. ఫుల్లుగా పూర్తి చేస్తే కానీ మళ్ళీ రాను', 'హుకుమ్.. టైగర్ కా హుకుమ్' (రజనీ) అనే డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఈ చిత్రంలో రజనీ భార్యగా రమ్యకృష్ణ నటించారు. తమన్నా, సునీల్, మిర్నా మీనన్, యోగిబాబు, శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించగా, మోహన్ లాల్ ఓ అతిథి పాత్రలో నటించారు.

గెట్.. సెట్.. గో

షార్ట్ బ్రేక్ తీసుకున్నారు... ఫుల్లుగా రిలాక్స్ అయ్యారు. గెట్ సెట్ గో అంటూ హుషారుగా షూటింగ్‌లో పాల్గొనడానికి రెడీ అయ్యారు. కొంత గ్యాప్ తర్వాత సెట్స్‌లోకి అడుగుపెడుతున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.


● ఎన్టీఆర్


● అల్లు అర్జున్


● ప్రభాస్

బిజీ బిజీ

దాదాపు యాభై రోజులు యూఎస్‌లో గడిపి, ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చారు ప్రభాస్. ఇక సినిమా షూటింగ్‌లతో బిజీ కావాలనుకుంటున్నారు. ఇందుకు తగ్గ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేసుకున్నారు. ప్రభాస్ చేతిలో ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ', 'రాజా డీలక్స్' (వర్కింగ్ టైటిల్), 'సలార్' చిత్రాలు ఉన్నాయి. ముందుగా 'కల్కి 2898 ఏడీ' షూటింగ్‌లో పాల్గొననున్నారట. మరో మూడు, నాలుగు రోజుల్లో ఈ చిత్రం కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించాలనుకుంటున్నారట. ఈ షెడ్యూల్‌లో ప్రధానంగా ప్రభాస్, దీపికా పదుకోన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని తెలిసింది. గతంలో చిత్ర యూనిట్ ప్రకటించిన ప్రకారం 'కల్కి 2898 ఏడీ' సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక ప్రభాస్ మరో చిత్రం 'రాజా డీలక్స్' విషయానికి వస్తే.. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనుకుంటున్నారట ప్రభాస్. మరోవైపు ప్రభాస్ డైరీలో ఉన్న 'సలార్' షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమా తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది. సో.. మలి భాగం షూటింగ్‌ని ఆరంభించడానికి ప్లాన్ చేస్తున్నారట. మొత్తం మీద ప్రభాస్ బిజీ బిజీ.

టార్గెట్ ఫిక్స్

'దేవర' సినిమా విషయంలో హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ స్పీడ్ మామూలుగా లేదు. ఈ సినిమా వరుస షూటింగ్ షెడ్యూల్స్ చకా చకా పూర్తవుతున్నాయి. అయితే గత నెల మూడో వారంలో ఓ యాక్షన్ షెడ్యూల్‌ను పూర్తి చేశాక ఈ టీమ్ చిన్న గ్యాప్ తీసుకుంది. రెండు వారాల గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ మళ్లీ అంటే.. జూలై 31న 'దేవర' కొత్త షూటింగ్ షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారు. ఈ కొత్త షెడ్యూల్ రెండు వారాల పాటు సాగుతుందని, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తారని తెలిసింది. పీటర్ హెయిన్స్ అండ్ టీమ్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేసిందట. ఈ షెడ్యూల్‌తో 'దేవర' మేజర్ యాక్షన్ పార్ట్ పూర్తవుతుందని, తదుపరి షెడ్యూల్స్‌లో ఇతర ప్రధాన తారాగణమైన ఈ చిత్రం విలన్ సైఫ్ అలీఖాన్, హీరోయిన్ జాన్వీ కపూర్ వంటి వారు పాల్గొనగా, టాకీ పార్ట్‌ను షూట్ చేస్తారని తెలిసింది. నవంబరు కల్లా ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసేలా ఎన్టీఆర్ టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది. షూటింగ్ కాస్త ముందుగానే ముగిసినా.. గ్రాఫిక్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కోసం 'దేవర' టీమ్ ఎక్కువ టైమ్ తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇక 'దేవర' తర్వాత హిందీ 'వార్ 2', ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని చిత్రాలతో ఎన్టీఆర్ బిజీ అవుతారు.

ఏప్రిల్‌లో రిలీజ్?

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సూపర్ డూపర్ హిట్ సాధించింది. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్' సెట్స్‌లో ఉంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు ఇటీవల కాస్త గ్యాప్ వచ్చింది. మళ్లీ ఈ నెల మొదటివారంలో 'పుష్ప: ది రూల్' సినిమాను సెట్స్ పైకి తీసుకుని వెళ్లాలని సుకుమార్ సన్నాహాలు చేశారని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్ కూడా జాయిన్ అవుతారట. అలాగే 'పుష్ప: ది రూల్'ను తొలుత ఈ ఏడాది చివర్లో రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ షూటింగ్ షెడ్యూల్స్‌కి గ్యాప్ రావడంతో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారట. ఇక ఈ సినిమా కాకుండా... దర్శకుడు త్రివిక్రమ్‌తో ఓ సినిమా, 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగాతో ఓ సినిమాను అల్లు అర్జున్ కమిటైన సంగతి తెలిసిందే.

యాక్షన్.. కామెడీ.. ఎక్కడా తగ్గవు

- రాజ్ తరుణ్


● మాళ్వీ, రాజ్ తరుణ్

''తిరగబడర సామీ' చిత్రం మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్. రవికుమార్ గారి గత సినిమాల్లానే ఈ మూవీలోనూ యాక్షన్, కామెడీ, రొమాన్స్ ఎక్కడా తగ్గకుండా ఉంటాయి. మా సినిమాని థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలి'' అని రాజ్ తరుణ్ అన్నారు. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రాజ్ తరుణ్ హీరోగా, మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న చిత్రం 'తిరగబడర సామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్‌పై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ లొకేషన్‌లో చిత్ర యూనిట్ మీడియాతో సమావేశం అయ్యింది. ఏఎస్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ- ''ఎలాగైనా మళ్లీ హిట్టు కొట్టాలని కొంత విరామం తీసుకొని కసితో చేసిన సినిమా 'తిరగబడర సామీ'. ఒక బంధాన్ని నిలుపుకోవడం కోసం ప్రేమికులు, భార్యా భర్తలు ఎంతవరకూ వెళ్తారు? అనేది వినోదాత్మకంగా చూపించాం'' అన్నారు. ''ఈ నెలాఖరులో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు మల్కాపురం శివకుమార్.

అది పెద్ద సవాల్

- డడ్లీ



''ఓ భాషలో హిట్ అయిన సినిమాని మరో భాషలో రీమేక్ చేయడం చాలా కష్టం. ఎందుకంటే.. ఒరిజినల్‌ని మ్యాచ్ చేస్తే సరిపోదు.. దానికంటే ప్రతి విషయంలోనూ ఒక అడుగు బెటర్‌గా ఉండాలి.. అది పెద్ద సవాల్. అందుకే 'భోళా శంకర్' విజువల్స్ విషయంలో జాగ్రత్తగా ఉన్నాం. ఒరిజినల్ ఫిల్మ్ 'వేదాలం' కంటే 'భోళా శంకర్' ఇంకా బాగుంటుంది'' అని కెమెరామేన్ డడ్లీ (రాజేంద్ర) అన్నారు. చిరంజీవి, తమన్నా జంటగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర కెమెరామేన్ డడ్లీ మాట్లాడుతూ- ''నా అసలు పేరు రాజేంద్ర. డడ్లీ నా ముద్దు పేరు. తమిళనాడులోని ఊటీ నా స్వస్థలం. తమిళనాడులో ఫిలిం టెక్నాలజీ చదువుకున్న తర్వాత ముంబైకి షిఫ్ట్ అయ్యాను. మెహర్ రమేష్, నేను పదేళ్లుగా స్నేహితులం. తనే 'భోళా శంకర్' అవకాశం ఇచ్చాడు. తెలుగులో ఇది నా మొదటి సినిమా. ఫుల్ ప్యాకేజ్ ఆఫ్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. చిరంజీవి గారు పెర్‌ఫెక్షనిస్ట్, చాలా పంక్చువల్. ఈ రెండు విషయాలు ఆయన్నుంచి నేర్చుకున్నాను. 'భోళా శంకర్'లో ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో వచ్చే పెద్ద యాక్షన్ సీన్ తీయడం చాలా కష్టంగా అనిపించింది. నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా అన్నీ సమకూర్చారు'' అన్నారు.

రీల్స్

మత్స్యకారులతో మాటా మంతీ


● నాగచైతన్య

'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య, డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో మూడో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శ్రీకాకుళం, గుజరాత్ నేపథ్యంలోని మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించేలా ఈ సినిమా కథ ఉంటుందట. ఇందులో చైతన్య మత్స్యకారుడిగా కనిపించనున్నారని సమాచారం. అందుకే మత్స్యకారులను స్వయంగా కలిసి వారి జీవిత విశేషాలను తెలుసుకునేందుకు వైజాగ్ వెళ్లారు నాగచైతన్య, చందు మొండేటి, 'బన్నీ' వాసు. మూడు రోజుల పాటు అక్కడే ఉండి పూర్తి వివరాలు తెలుసుకుంటారు. అలాగే సముద్ర యానం కూడా చేయాలనుకుంటున్నారు. ఇక ఈ మూవీకి 'తండెల్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నట్లు టాక్. శ్రీకాకుళంలో మత్స్యకారులను తండెల్ అని పిలుస్తారట.

డేంజర్ పిల్లా...


● శ్రీలీల, నితిన్

'అరె బ్లాక్ అండ్ వైట్ సీతాకోక చిలుకవా..., ఒక ముళ్లు కూడా లేనే లేని రోజా పువ్వా..., డేంజర్ పిల్లా..' అని పాడుతున్నారు నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్'. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్-ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హారిస్ జైరాజ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'డేంజర్ పిల్లా..' పాటను బుధవారం రిలీజ్ చేశారు. ఈ పాటను కృష్ణకాంత్ రాయగా అర్మాన్ మాలిక్ పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు.

కృష్ణగాడు మంచి విజయం సాధించాలి

- ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్


● వినయ్ భాస్కర్, రిష్వి

''కృష్ణగాడు అంటే ఒక రేంజ్' చక్కటి కుటుంబ కథా చిత్రంగా రూపొందింది. మా వరంగల్ వాళ్లకి ఈ మూవీలో చాన్స్ ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా రాజేష్ దొండపాటి నటించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి దాస్యం వినయ్ భాస్కర్, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, రైటర్ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా హిట్టవ్వాలని ఆకాంక్షించారు.

సాక్షి బిజినెస్
గురువారం
3-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	677	65,783
నిఫ్టీ ▽	207	19,527

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,003	▽	281
డోజోన్స్	35,386	▽	244
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,562	▽	105
డాక్స్	16,020	▽	220
షాంఘై	3,262	▽	29
నికాయ్	32,708	▽	769

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (ముంబై)			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,616	△	165
బంగారం (99.5 స్వచ్ఛత)	59,377	△	164
వెండి (కిలో)	74,273	▽	15

శాంసంగ్ టీవీ @ రూ.1,14,99,000



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం శాంసంగ్ తాజాగా అల్ట్రా లగ్జరీ మైక్రో ఎల్‌ఈడీ టీవీని భారత్‌లో ఆవిష్కరించింది. ధర రూ.1,14,99,000 ఉంది. 110 అంగుళాల సైజులో ఇది తయారైంది. 2.48 కోట్ల మైక్రోమీటర్ అల్ట్రా స్మాల్ ఎల్‌ఈడీలతో రూపుదిద్దుకుందని కంపెనీ తెలిపింది. ఎల్‌ఈడీలు సఫైర్ గ్లాస్‌తో తయారైనట్టు వెల్లడించింది. మైక్రో ఎల్‌ఈడీ సాంకేతికత మానవ కళ్ళు చూడగలిగే అంతిమ, హై-ఎండ్ పిక్చర్ స్వచ్ఛతను అందిస్తుందని తెలిపింది.

ఫార్చూన్ గ్లోబల్ ర్యాంకుల్లో రిలయన్స్ ముందంజ

16 స్థానాలు ఎగసి 88కి చేరిక



న్యూఢిల్లీ: బిలియనీర్ ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫార్చూన్ గ్లోబల్ 500, 2023 జాబితాలో మెరుగైన స్థానాన్ని సంపాదించింది. 16 స్థానాలు మెరుగుపడి 88వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. 2022 జాబితాలో రిలయన్స్ స్థానం 104గా ఉండడం గమనించొచ్చు. భారత కంపెనీల్లో టాప్ ర్యాంకర్‌గా రిలయన్స్ నిలిచింది. 2021 నుంచి చూస్తే రిలయన్స్ అంతర్జాతీయంగా తన ర్యాంక్‌ని గణనీయంగా పెంచుకుంది. 2021లో రిలయన్స్ స్థానం 155గా ఉంది. ఇక ఈ ఏడాది ఫార్చూన్ 500 జాబితాలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 94వ స్థానాన్ని సంపాదించుకుంది. గతేడాదితో పోలిస్తే 48 మెట్లు పైకెక్కింది. ఎల్‌ఐసీ 9 స్థానాలు దిగజారి 107వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. ఓఎన్‌జీసీ 158, బీపీసీఎల్ 233, ఎస్‌బీఐ 235 ర్యాంకులు దక్కించుకున్నాయి. టాటా మోటార్స్ ర్యాంక్ 33 స్థానాలు మెరుగుపడి 337కు చేరింది. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ 84 స్థానాలు ముందుకు వచ్చి 353 ర్యాంకును సొంతం చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫార్చూన్ 500 జాబితాలో చోటు సంపాదించుకోవడం 20వ ఏడాది కావడం గమనార్హం.

బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు పెరిగారు

- 117 కోట్ల టెలికం చందాదార్లు
- మొబైల్ సబ్‌స్క్రైబర్లు 114 కోట్లు: ట్రాయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా టెలికం చందాదార్ల సంఖ్య 2023 మే నెల చివరినాటికి 117.257 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సంఖ్య 117.252 కోట్లు ఉంది. ఏప్రిల్‌తో పోలిస్తే మే నెల వృద్ధి కేవలం 0.004 శాతం మాత్రమేనని టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా గణాంకాల్లో వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో టెలికం సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఏప్రిల్‌తో పోలిస్తే 51.864 కోట్ల నుంచి 51.914 కోట్లకు ఎగసింది. పట్టణ ప్రాంతాల్లో వినియోగదార్ల సంఖ్య 65.388 కోట్ల నుంచి 65.343 కోట్లకు చేరింది. ఇక బ్రాడ్‌బ్యాండ్ మొత్తం చందాదార్ల సంఖ్య 85.094 కోట్ల నుంచి 85.681 కోట్లకు పెరిగింది.

వైర్‌లెస్ చందాదార్లు..: మొబైల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఈ ఏడాది ఏప్రిల్‌లో 114.313 కోట్లు ఉంటే, మే నెలలో ఈ సంఖ్య 114.321 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో కొత్తగా 30 లక్షల మందిని చేర్చుకోవడంతో సంస్థ మొత్తం మొబైల్ చందాదార్ల సంఖ్య 43.63 కోట్లను తాకింది. భారతీ ఎయిర్‌టెల్ నూతనంగా 13.2 లక్షల మందిని సొంతం చేసుకుంది. దీంతో ఈ కంపెనీ వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 37.23 కోట్లకు చేరుకుంది. వొడాఫోన్ ఐడియాను మే నెలలో 28 లక్షల మంది కస్టమర్లు వీడారు.

హార్లే ఎక్స్440 ధర పెంపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హార్లే డేవిడ్సన్ ఎక్స్440 ధరను అన్ని వేరియంట్లలో రూ.10,500 పెంచినట్లు హీరో మోటోకార్ప్ బుధవారం ప్రకటించింది. ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్‌లో రూ.2.29–2.69 లక్షల ధరలో కంపెనీ ఈ మోడల్‌ను గత నెలలో ఆవిష్కరించింది. తాజా సవరణతో ప్రస్తుతం ఈ ధర రూ.2.39 లక్షల నుంచి ప్రారంభం. కొత్త ధర ఆగస్ట్ 4 నుంచి అమలులోకి రానుందని కంపెనీ వెల్లడించింది. 2023 నుంచి ఎక్స్440 డెలివరీలు ఉంటాయని వివరించింది.



భారీ లాభాల్లోకి ఇండిగో

- క్యూ1లో రూ. 3,091 కోట్లు
- ఆదాయంలోనూ కొత్త రికార్డ్



న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఇండిగో బ్రాండు విమాన సర్వీసుల కంపెనీ ఏప్రిల్–జూన్(క్యూ1)లో టర్న్‌అరౌండ్ అయ్యింది. కొత్త రికార్డ్ సృష్టిస్తూ రూ. 3,091 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,064 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఈ బాటలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 17,161 కోట్ల టర్నోవర్ అందుకుంది. గత క్యూ1లో రూ. 13,019 కోట్ల ఆదాయం నమోదైంది. కాగా.. ఒక త్రైమాసికంలో రికార్డ్ సంఖ్యలో ప్రయాణికులను చేరవేయడం ద్వారా కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు సాధించినట్లు కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. జూన్ చివరికల్లా మొత్తం నగదు నిల్వలు రూ. 27,400 కోట్లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది. వెంచర్ క్యాపిటల్(వీసీ) పెట్టుబడుల సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తాజాగా పేర్కొంది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్‌ఈలో దాదాపు ఫ్లాట్‌గా రూ. 2,566 వద్ద ముగిసింది.

మార్కెట్లపై 'ఫిచ్' పంచ్

- అమెరికా రుణ రేటింగ్‌ను తగ్గించిన రేటింగ్ ఏజెన్సీ
- 677 పాయింట్లు నష్టపోయి 65 వేల దిగువకు సెన్సెక్స్
- ట్రేడింగ్ ఆద్యంతం అన్ని రంగాల షేర్లలో అమ్మకాలే



ముంబై: ప్రముఖ రేటింగ్ సంస్థ ఫిచ్ అమెరికా రుణ రేటింగ్‌ను తగ్గించడంతో బుధవారం ఈక్విటీ మార్కెట్లు బేర్‌మన్నాయి. దేశీయ బెంచ్ మార్క్ సూచీలు ఒక శాతానికి పైగా కుప్పకూలాయి. ఫలితంగా దలాల్ స్ట్రీట్‌లో రూ.3.46 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఉదయం సెన్సెక్స్ 395 పాయింట్ల నష్టంతో 66,064 వద్ద, నిఫ్టీ 79 పాయింట్లు పతనమై 19,655 వద్ద మొదలయ్యాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిణామాల ప్రభావంతో రోజంతా నష్టాల్లో కదలాడాయి. విస్తృత స్థాయిలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆయా రంగాల సూచీలు గరిష్టంగా రెండున్నర శాతం వరకు క్షీణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 1027 పాయింట్లు నష్టపోయి 65,432 వద్ద, నిఫ్టీ 311 పాయింట్లు క్షీణించి 19,423 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. చివర్లో కనిష్ట స్థాయిల వద్ద స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్ ముగిసే సరికి సెన్సెక్స్ 677 పాయింట్లు నష్టపోయి 65,783 వద్ద ముగిసింది. నిఫ్టీ 207 పాయింట్లు పతనమై 19,527 వద్ద స్థిరపడింది. ముఖ్యంగా బ్యాంకింగ్, మెటల్, ఆటో షేర్లలో పెద్ద ఎత్తున విక్రయాలు తలెత్తాయి. దీంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ ఒకశాతానికి పైగా పతనమయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1878 కోట్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు స్వల్పంగా రూ.2 కోట్లను షేర్లను విక్రయించారు.

రూపాయి ఆరునెలల్లో అతిపెద్ద పతనం

రూపాయి విలువ ఆరు నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో 45 పైసలు కరిగిపోయి 82.67 వద్ద స్థిరపడింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ భారీ పతనం, విదేశీ ఇన్వెస్టర్లు నిధుల ఉపసంహరణలు ఇందుకు కారణమయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 82.38 వద్ద మొదలైంది. ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో ఇంట్రాడే కనిష్ట స్థాయి(82.67) వద్ద ముగిసింది. 'ప్రపంచ మార్కెట్లో రిస్క్ తీసుకునే సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు ఆసియా కరెన్సీల బలహీన ట్రేడింగ్‌తో రూపాయి భారీగా నష్టపోయింది. అంతర్జాతీయ కరెన్సీ విలువల్లో డాలర్ బలపడటమూ దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచింది' అని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు.

ఒక్క రోజులో రూ.3.46 లక్షల కోట్ల నష్టం

సెన్సెక్స్ ఒక శాతానికి పైగా క్షీణించడంతో దలాల్ స్ట్రీట్‌లో రూ.3.46 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ(క్యాపిటలైజేషన్) రూ.303 లక్షల కోట్లకు దిగివచ్చింది.

నష్టాలు ఎందుకంటే

- 'గత 20 ఏళ్లలో అమెరికా అప్పుల కుప్పగా మారింది. పాలనా వ్యవస్థలో స్థిరమైన క్షీణత కనిపిస్తుంది. యూఎస్ రుణ రేటింగ్‌ను ఏఏఏ నుంచి ఏఏప్లస్ రేటింగ్‌కు తగ్గిస్తున్నాము' అని రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ తెలిపింది. ఈ ప్రకటన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టించింది.
- ఫిచ్ రేటింగ్ కుదింపుతో పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ల నుంచి బాండ్లలోకి మళ్లాయి. అమెరికా పదేళ్ల కాలపరిమిత బాండ్లపై రాబడి ఏకంగా 4% పెరిగింది.
- యూరో జోన్, చైనా జూలై పారిశ్రామికోత్పత్తి గణాంకాలు నిరాశపరచడంతో అంతర్జాతీయ వృద్ధి భయాలు వెంటాడాయి. ఈ పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 2–1% క్షీణించాయి. ఈ ప్రతికూల ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడింది.
- దేశీయంగా గడిచిన నాలుగు నెలల్లో సూచీలు 13% ర్యాలీ చేయడంతో గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో పెట్టుబడుల ఉపసంహరణకు మొగ్గుచూపారు.

హెచ్‌పీసీఎల్ టర్న్‌అరౌండ్

క్యూ1లో రూ. 6,204 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నష్టాలనువీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 6,204 కోట్ల నికర లాభం ఆర్జించింది. విదేశీ మార్కెట్లో చమురు ధరల క్షీణత మార్జిన్ల పెంపునకు సహకరించడం లాభాలకు కారణమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 10,197 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గత క్యూ1లో పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడంతో నష్టాలు నమోదైన సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం 2 శాతం తగ్గి రూ. 1.18 లక్షల కోట్లకు చేరింది. చమురు శుద్ధిలో ప్రతీ బ్యారల్‌పైనా 7.44 డాలర్ల స్థూల రిఫైనింగ్ మార్జిన్లు అందుకుంది. ఇంధన అమ్మకాలు 10.45 మిలియన్ టన్నుల నుంచి 11.43 ఎంటీకి పెరిగాయి. 5.4 ఎంటీ చమురును ప్రాసెస్ చేసింది. గత క్యూ1లో 4.81 ఎంటీ చమురును మాత్రమే శుద్ధి చేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం క్షీణించి రూ. 376 వద్ద ముగిసింది.

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం పన్ను కొనసాగుతుంది

- అమలైన ఆరు నెలల తర్వాత సమీక్ష
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోల్లో బెట్టింగ్ ముఖ విలువపై 28 శాతం జీఎస్‌టీ అమలు చేయాలని జీఎస్‌టీ కౌన్సిల్ బుధవారం నిర్ణయించింది. ఢిల్లీ, గోవా, సిక్కిం రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ.. జీఎస్‌టీ కౌన్సిల్ ఈ విషయంలో ముందుకే వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లోనే సెంట్రల్ జీఎస్‌టీలో సవరణలకు సంబంధించి కేంద్ర సర్కారు బిల్లును ప్రవేశపెట్టనుంది. అనంతరం రాష్ట్రాల అసెంబ్లీలు సవరణలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వచ్చే అక్టోబర్ 1 నుంచి చట్ట సవరణలు అమల్లోకి రానున్నాయి. ''ఆడేవారి తరఫున చెల్లించిన మొత్తం ఆధారంగా విలువ నిర్ణయించడం జరుగుతుంది. ముందు ఆటలో గెలిచిన మొత్తాన్ని మళ్లీ పందెంలో పెడితే దాన్ని జీఎస్‌టీ నుంచి మినహాయిస్తారు. ఆరంభంలో పెట్టే మొత్తంపైనే పడుతుంది''అని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. ఇందుకు ఓ ఉదాహరణ కూడా చెప్పారు. ''రూ.1,000 పందెంలో పెడితే, దీనిపై రూ.300 గెలిస్తే.. అనంతరం ఈ రూ.1,300తో మళ్లీ పందెం కాస్తే గెలిచే మొత్తంపై జీఎస్‌టీ విధించరు''అని వివరించారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్‌టీని అమలు చేసిన 6 నెలల తర్వాత (2024 ఏప్రిల్‌లో) సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. ఆఫ్‌షోర్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు జీఎస్‌టీ వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా చెప్పారు. నిబంధనలు పాటించని పోర్టల్లను బ్లాక్ చేస్తామని హెచ్చరించారు.

ఐటీలో మేటిగా నిలవాలంటే!

ప్రస్తుత అనిశ్చిత వ్యాపార ప్రపంచంలో నియామకాల తీరు మారుతోంది. అవసరాలమేరకే సంస్థలు ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటున్నాయి. పదింటిలో ఆరు సంస్థలు కాంట్రాక్ట్ ఆధారిత నిపుణుల(గిగ్ వర్కర్ల) నియామకానికే మొగ్గుచూపుతున్నాయి. రానున్న రోజుల్లో జావా డెవలపర్‌లు, మొబైల్ యాప్ డెవలపర్‌లు, డేటా ఇంజనీర్లు, ఫ్రంట్-ఎండ్ డెవలపర్‌లు, క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు /ఇంజనీర్లు వంటి సాంకేతిక కొలువుల్లో పుష్కలమైన డిమాండ్ ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న టెక్ కొలువులు, వాటిల్లో రాణించాలంటే అవసరమైన నైపుణ్యాలపై ఫోకస్..

జావా డెవలపర్

ఇండస్ట్రీ ట్రెండ్‌తో అప్‌డేట్‌గా ఉంటూ.. తమ నైపుణ్యాలను వాస్తవ-ప్రపంచంలో ప్రభావవంతంగా అన్వయించగలిగితే జావా డెవలపర్‌లకు జాబ్ మార్కెట్‌లో అవకాశాలకు కొదవలేదు. జావా డెవలపర్‌గా రాణించాలంటే.. ఆబ్జెక్ట్-ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్, ఎక్సెప్షన్ హ్యాండ్లింగ్ సహా కోర్ జావా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. సర్వ్‌లెట్స్, జేఎస్‌పీ, రెస్ట్‌ఫుల్ వెబ్ సర్వీసెస్‌తో కూడిన వెబ్ డెవలప్‌మెంట్ నైపుణ్యంతోపాటు స్ప్రింగ్, హైబర్నేట్ వంటి ఫ్రేమ్‌వర్క్‌లలో ప్రావీణ్యం పెంచుకోవాలి. జేడీబీసీ లేదా ఓఆర్‌ఎం ఫ్రేమ్‌వర్క్‌లను ఉపయోగించే డేటాబేస్ కనెక్టివిటీ స్కిల్స్ ఎంతో కీలకం. టెస్టింగ్ విత్ జేయూనిట్, మావెన్ వంటి బిల్డ్ టూల్స్, గిట్ వంటి వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ సామర్థ్యాలు తదితర నైపుణ్యాలు కూడా ముఖ్యమైనవి. వ్యక్తిగత ప్రాజెక్ట్‌ల ద్వారా ప్రాక్టికల్ అనుభవాన్ని పొందడం, ఓపెన్-సోర్స్ ప్రాజెక్ట్‌లకు సహకారం అందించడం ద్వారా రిక్రూటర్‌ల దృష్టిని ఆకర్షించొచ్చు.

మొబైల్ అప్లికేషన్ డెవలపర్

టెక్ గిగ్ కొలువుల్లో మొబైల్ అప్లికేషన్ డెవలపర్‌కు మంచి డిమాండ్ నెలకొంది. ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ డెవలప్‌మెంట్‌లో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. మొబైల్ అప్లికేషన్ డెవలపర్‌గా రాణించాలంటే.. రియాక్ట్ నేటివ్ లేదా ఫ్లట్టర్, యూఐ/యూఎక్స్ డిజైన్, బ్యాకెండ్ డెవలప్‌మెంట్, మొబైల్ యాప్ సెక్యూరిటీ, టెస్టింగ్, డీబగ్గింగ్, క్రాస్-ప్లాట్‌ఫామ్ అడాప్టబిలిటీ, ప్రాక్టికల్ అనుభవం, బిల్డింగ్ ఎ పోర్ట్‌ఫోలియోలో నైపుణ్యం సాధించాలి. ఇండస్ట్రీ ట్రెండ్స్‌కు తగ్గట్టుగా వినూత్న మొబైల్ యాప్‌లను రూపొందించగలగాలి.

డేటా ఇంజనీర్

మారుతున్న టెక్నాలజీకి తగ్గట్టుగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే.. డేటా ఇంజనీర్ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ప్రోగ్రామింగ్ సామర్థ్యాలు, డేటాను సమర్థవంతంగా విశ్లేషించే సామర్థ్యం, డేటా విజువలైజేషన్ టెక్నిక్‌లలో నైపుణ్యం, క్లౌడ్ కంప్యూటింగ్‌పై దృఢమైన అవగాహన, సమర్థవంతమైన కమ్యూనికేషన్, అద్భుతమైన సాఫ్ట్ స్కిల్స్ ఉన్నవారు డేటా ఇంజనీర్‌గా సులభంగా రాణించొచ్చు. ఈ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకున్నప్పుడే సంస్థల డేటా నిర్వహణ, నిర్ణయాత్మక ప్రక్రియలపై ప్రభావాన్ని చూపగలుగుతారు.



టెక్ స్కిల్స్

ఫ్రంట్ ఎండ్ డెవలపర్

వెబ్‌సైట్‌లు, వెబ్ అప్లికేషన్‌ల విజువల్, ఇంటరాక్టివ్ అంశాలను రూపొందించడంలో, అభివృద్ధి చేయడంలో ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌లు కీలక పాత్ర పోషిస్తారు. ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌గా రాణించాలంటే.. హెచ్‌టీఎంఎల్, సీఎస్‌ఎస్, జావాస్క్రిప్ట్‌లలో నైపుణ్యం సొంతం చేసుకోవాలి. అప్పుడే వెబ్ పేజీలను రూపొందించడంతోపాటు వాటిని ఆకర్షణీయంగా మలచి ఫంక్షనల్‌గా కూడా యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దగలుగుతారు. ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌లు సాంకేతిక నైపుణ్యంతో పాటు సమస్య-పరిష్కార సామర్థ్యాలు, సమర్థమంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో అవకాశాలు సొంతం చేసుకోవాలంటే..హెచ్‌టీఎంఎల్, సీఎస్‌ఎస్, జావాస్క్రిప్ట్‌లతో పాటు రియాక్ట్, యాంగులర్, వ్యూ వంటి ప్రముఖ ఫ్రేమ్‌వర్క్‌లపై కూడా పట్టు సాధించాలి.

క్లౌడ్ ఆర్కిటెక్ట్స్/ఇంజనీర్

క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు/ఇంజనీర్లు క్లౌడ్-ఆధారిత పరిష్కారాలను రూపొందించడంలో, నిర్మించడంలో, పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తారు. వీరికి వివిధ క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీలపై లోతైన అవగాహన ఉండాలి. వ్యాపార అవసరాలను గుర్తించి సరైన సాంకేతిక పరిష్కారాన్ని చూపే నైపుణ్యం తప్పనిసరి. సాంకేతిక నైపుణ్యంతో పాటు బలమైన సమస్య పరిష్కార సామర్థ్యాలు, అద్భుతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను కలిగి ఉండాలి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో అవకాశాలను సొంతం చేసుకోవాలంటే.. క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు/ఇంజనీర్‌లు ఏడబ్ల్యూఎస్, అజుర్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లలో, జావా, పైథాన్, సీ++ వంటి ప్రోగ్రామింగ్ భాషలలో నైపుణ్యం సాధించాలి. డేటా స్టోరేజ్, రిట్రీవల్ గురించిన పరిజ్ఞానం, నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, కాస్ట్ మేనేజ్‌మెంట్ ఎజైల్ డెవలప్‌మెంట్, డెవ్‌ఓపీఎస్, క్లౌడ్-నేటివ్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలున్నవారు అత్యధిక వేతనాలు పొందొచ్చు.

సీజీపీడీటీఎంలో 553 ఉద్యోగాలు

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన న్యూఢిల్లీలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్ మార్క్స్(సీజీపీడీటీఎం), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ.. పలు ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో 553 పోస్టులను భర్తీ చేయనుంది. ప్రిలిమినరీ,మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. సీజీపీడీటీఎంలో ఉద్యోగాల వివరాలు..



డిగ్రీ, పీజీ అర్హతతో దరఖాస్తుకు అవకాశం

- మొత్తం పోస్టుల సంఖ్య: 553
- విభాగాల వారీగా పోస్టుల వివరాలు: ఎగ్జామినర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ గ్రూప్-ఎ(గెజిటెడ్) పోస్టులు.. బయోటెక్నాలజీ-50, బయోకెమిస్ట్రీ-20, ఫుడ్ టెక్నాలజీ-15, కెమిస్ట్రీ-56, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ-09, బయోమెడికల్ ఇంజనీరింగ్-53, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్-108, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-29, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-63, ఫిజిక్స్-30, సివిల్ ఇంజనీరింగ్-09, మెకానికల్ ఇంజనీరింగ్-99, మెటలర్జికల్-04, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ 08 పోస్టులు ఉన్నాయి.

అర్హత

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 04.08.2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, ఓబీసీలకు, ఎక్స్ -సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష

- ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఐదు విభాగాల నుంచి మొత్తం 150 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో జనరల్ ఇంగ్లిష్, వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్, ఐపీ లెజిస్లేషన్, పీపీపీఓ సంబంధిత అంశాలు ఉంటాయి, పరీక్ష సమయం 2 గంటలు.
- జనరల్ ఇంగ్లిష్‌లో కాంప్రహెన్షన్, ప్రెసీ రైటింగ్, వొకాబ్యులరీ, షార్ట్ ఎస్సేలు ఉంటాయి. విషయాన్ని చదివి, అర్థం చేసుకుని తమ ఆలోచనలను అభ్యర్థులు స్పష్టంగా, సరిగా తెలియచేస్తారో లేదోపరీక్షిస్తారు.
- న్యూమరికల్/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో మేథమెటికల్ కాలిక్యులేషన్స్‌లో అభ్యర్థికి ఉండే నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. అర్థమెటికల్ రీజనింగ్, గ్రాఫ్ అండ్ టేబుల్ రీడింగ్, పర్సంటేజ్ అనాలిసిస్, క్వాంటిటేటివ్ అనాలిసిస్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- వెర్బల్-నాన్ వెర్బల్ రీజనింగ్‌లో భాగంగా అభ్యర్థి తార్కిక నైపుణ్యం, విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ప్రశ్నలు, చిత్రాల రూపంలో ఇచ్చిన సమాచారాన్ని అర్థం చేసుకుని సమాధానాలను గుర్తించగలగాలి.
- జనరల్ సైన్స్‌లో భాగంగా సైంటిఫిక్ మెథడాలజీ కాన్సెప్ట్స్, ప్రిన్సిపల్స్, టెక్నిక్స్ అండ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, ఎర్త్/స్పేస్ సైన్స్, టెక్నాలజీ మొదలైన అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్‌లో వర్తమానాంశాలపై ప్రశ్నలు అడుగుతారు. జాతీయ, అంతర్జాతీయం, ఆర్థికం, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. న్యూస్ పేపర్ చదవడం, వార్తలు వినడం ద్వారా కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవచ్చు.
- పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా సన్నద్ధత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. దానికి అనుగుణంగా ప్రిపరేషనల్ ప్లాన్ రూపొందించుకోవాలి.
- ఎక్కువగా మాదిరి ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయాలి. మాక్ టెస్టులు రాయాలి. ఫలితంగా నిర్దిష్ట సమయం లోపలే సమాధానాలు రాయగలుగుతున్నారో లేదో తెలుసుకునే వీలవుతుంది.

అర్హత మార్కులు

ఈ పరీక్షలో అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు-30 శాతం, ఓబీసీ/ఈడబ్ల్యూస్ అభ్యర్థులు 25 శాతం, ఇతరులు 20 శాతం కనీస అర్హత మార్కులుగా సాధించాలి. పోస్టుల సంఖ్యకు అనుగుణంగా ఇరవై రెట్ల మందిని మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్స్ పరీక్ష

- ఆఫ్‌లైన్ విధానంలో మెయిన్ రాత పరీక్ష ఉంటుంది. పేపర్-1 ఆబ్జెక్టివ్ పద్ధతిలో, పేపర్-2 డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్-1 వంద మార్కులకు, పేపర్-2 మూడు వందల మార్కులకు ఉంటాయి.
- పేపర్-1లో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు, జనరల్ ఆప్టిట్యూడ్-20 ప్రశ్నలు, ఎలిమెంటరీ మేథమెటిక్స్-20 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ-20 ప్రశ్నలు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్-20 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు.
- టెక్నికల్/సైంటిఫిక్ విభాగంలో అభ్యర్థి అవగాహనను పరీక్షించే విధంగా పేపర్-2 ఉంటుంది. ఇందులో 300 మార్కులకు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. అభ్యర్థుల తుది ఎంపికలో ఈ రెండు పేపర్లలో సాధించిన మార్కులకు 80 శాతం వెయిటేజీ ఉంటుంది. పేపర్-2 సిలబస్ విభాగాల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.
- పేపర్-2లో సమాధానాలను స్పష్టంగా, అర్థమయ్యేలా రాయాలి. కొట్టివేతలు లేకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. ఖాళీల సంఖ్యకు ఐదురెట్ల మంది అభ్యర్థులను మెయిన్స్ పరీక్ష నుంచి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

ఇంటర్వ్యూ మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్వ్యూలో పొందిన మార్కులను తుది ఎంపికలో 20 శాతం వెయిటేజీ ఇస్తారు.

వేతనాలు

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు లెవల్ పే 10 ప్రకారం- నెలకు రూ.53,100-రూ.1,77,500 వరకు వేతనంగా అందుతుంది. వీటితోపాటు ఇతర అలవెన్సులు కూడా చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 04.08.2023
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 03.09.2023
- మెయిన్స్ పరీక్ష తేదీ: 01.10.2023
- వెబ్‌సైట్: https://cgpdtm.qcin.org

జాబ్స్ ఇన్ఫో

ఏఏఐలో 342 కొలువులు

డిగ్రీ, అపై విద్యార్హతలు ఉన్నవారి కోసం ఎయిర్‌పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. వివిధ విభాగాల్లో మొత్తం 342 జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్), సీనియర్ అసిస్టెంట్(అకౌంట్స్), ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనుంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ వివరాలు..

- మొత్తం పోస్టులు: 342
- జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్)-09, సీనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్)-09, జూనియర్ ఎగ్జిక్యూటివ్(కామన్ కేడర్)-237, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఫైనాన్స్)-66, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీస్)-03, జూనియర్ ఎగ్జిక్యూటివ్(లా)-18.

అర్హత

- పోస్టులను అనుసరించి డిగ్రీ, బీకాం, ఐసీడబ్ల్యూసీ, సీఏ, ఎంబీఏ, బీఈ/బీటెక్, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతోపాటు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- వయసు: 04.09.2023 నాటికి సీనియర్/జూనియర్ అసిస్టెంట్ 30 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ 27 ఏళ్లు మించరాదు.

ఎంపిక ఇలా

పోస్టును అనుసరించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ లిటరసీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్, ఎండ్యూరెన్స్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

పరీక్ష విధానం

- ఈ పరీక్షను రెండు పార్ట్‌లుగా 120 మార్కులకు నిర్వహిస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు.
- పార్ట్-ఎ: ఈ పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇందులో ఇంగ్లిష్ 20 ప్రశ్నలు -20 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్/రీజనింగ్-15 ప్రశ్నలు-15 మార్కులు, జనరల్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఆప్టిట్యూడ్-15 ప్రశ్నలు-15 మార్కులు, జనరల్ నాలెడ్జ్/జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు-10 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పార్ట్-బీ: ఈ పరీక్షలో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.ఇందులో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్ విభాగాల నుంచి 60 ప్రశ్నలకు-60 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు పార్ట్‌లకు కలిపి పరీక్ష సమయం 120 నిమిషాలు.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు ప్రారంభతేదీ: 05.08.2023
- దరఖాస్తులకు చివరి తేదీ: 04.09.2023
- వెబ్‌సైట్: www.aai.aero

క్లుప్తంగా...

ఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్దేశించిన ఈఏపీసెట్ 2023 కౌన్సెలింగ్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి బుధవారం తెలిపారు. తొలుత 3వ తేదీ నుంచి అభ్యర్థుల వెబ్ ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించినప్పటికీ సాంకేతిక కారణాలతో దానిని 7వ తేదీకి వాయిదా వేశామన్నారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులేదన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదు 7న ప్రారంభమై 12వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 13న ఆప్షన్ల మార్పులు చేసుకోవచ్చని.. 17న సీట్లను కేటాయిస్తామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు 21లోగా కళాశాలల్లో స్వయంగా రిపోర్టు చేయాలని.. అదే తేదీ నుంచే క్లాసులు ప్రారంభమవుతాయన్నారు.

వచ్చే వారం 'మెడికల్' తుది మెరిట్ జాబితా విడుదల



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో రాష్ట్ర కోటా సీట్ల భర్తీకి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ కసరత్తు చేస్తోంది. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తుది మెరిట్ జాబితా వచ్చే వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. 14,000 మందికి పైగా విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన ఈ వారాంతానికి పూర్తి చేసి ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల చేస్తామని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకుల సమావేశం

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ 175 నియోజకవర్గాల పరిశీలకుల సమావేశం ఈ నెల 3న (గురువారం) ఉదయం 10.30 గంటలకు జరగనుంది. తాడేపల్లిలోని ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్‌లో సమావేశనిర్వహిస్తున్నారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హాజరుకానున్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది జూలై నెలలో నిర్వహించిన బీఏ, బీఏవోఎల్, బీకాం కోర్సుల ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఫలితాలనుడబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. పరీక్షలకు మొత్తం 11,648 మంది హాజరు కాగా 9,686 మంది ఉత్తీర్ణులయ్యారు. రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్, జవాబు పత్రాల జిరాక్సు కాపీలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 16 ఆఖరు తేదీ.

రంగురంగుల రెక్కలు

పుడమిపై అందాల చుక్కలు



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు బటర్ ఫ్లై పార్కు సమీపంలో రకరకాల సీతాకోకచిలుకలు సందడి చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఎగురుతున్నాయి. ఇటీవలే వర్షాలు కురవడంతో సీతాకోక చిలుకలు అధిక సంఖ్యలో తరలివచ్చి కనువిందు చేస్తున్నాయి.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





ఇక వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు

- మొదటిదశలో 200 రైళ్లు ప్రవేశపెట్టేందుకు నిర్ణయం
- ఒక్కో రైలుకు రూ.120 కోట్లతో టెండర్లు ఖరారు

సాక్షి, అమరావతి: వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు త్వరలో పట్టాలెక్కనున్నాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రత్యామ్నాయంగా రైల్వేశాఖ వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లను ప్రవేశపెడుతోంది. మొదటిదశలో 200 రైళ్ల తయారీకి కాంట్రాక్టును ఖరారు చేసింది. రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లలో ప్రస్తుతం చెయిర్‌కార్ కోచ్‌లే అందుబాటులో ఉన్నాయి. దేశంలో రెండో అతివేగంగా ప్రయాణించే వందేభారత్ రైళ్లలో ప్రస్తుతం ఏసీ చెయిర్‌కార్ కోచ్‌లే ఉన్నాయి. ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. కానీ స్లీపర్ కోచ్‌లు లేకపోవడంపై ప్రతికూల స్పందన కూడా వ్యక్తమవుతోంది. స్లీపర్ కోచ్‌లు లేకపోవడంతో దూరప్రాంత ప్రయాణాలకు ప్రయాణికులు విముఖత చూపుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగానే రైల్వేశాఖ వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు ప్రవేశపెడుతోంది. స్లీపర్ కోచ్‌లతో కూడిన వందేభారత్ రైళ్ల తయారీకి టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. మొత్తం 400 రైళ్లు ప్రవేశపెట్టాలన్నది రైల్వేశాఖ ఉద్దేశం. మొదటిదశలో ప్రవేశపెట్టే 200 రైళ్ల కోసం టెండర్లను ఇటీవల ఖరారు చేసింది. ఏడుసంస్థలు బిడ్లు దాఖలు చేయగా.. రైల్‌వికాస్ నిగమ్ లిమిటెడ్, రష్యాకు చెందిన టీఎంహెచ్ గ్రూప్‌తో కూడిన కన్సార్షియం 120 రైళ్ల తయారీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఒక్కో రైలును రూ.120 కోట్లతో తయారు చేసేందుకు ఈ కన్సార్షియం ముందుకొచ్చింది. టిట్లాఘర్ వేగన్, బీహెచ్‌ఈఎల్‌తోకూడిన కన్సార్షియం మరో 80 రైళ్లను తయారు చేయనుంది.



గంటకు 160 కిలోమీటర్ల వేగం..

గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లలో మొత్తం 16 బోగీలుంటాయి. థర్డ్ ఏసీ కోచ్‌లు 11, సెకండ్ ఏసీ కోచ్‌లు 4, ఫస్ట్ ఏసీ ఒక కోచ్ ఉండేలా డిజైన్ చేశారు. ప్రయాణికుల స్పందనను బట్టి.. తరువాత దశల్లో కోచ్‌ల సంఖ్యను 20 లేదా 24కు కూడా పెంచాలని రైల్వేశాఖ భావిస్తోంది. ఈ రైలు బయలుదేరిన నిమిషం వ్యవధిలోనే గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. రాజధాని ఎక్స్‌ప్రెస్‌లు 'ఫ్రంట్ డ్రివెన్' విధానంలో ప్రయాణిస్తున్నాయి. వందేభారత్ స్లీపర్ కోచ్‌లు 'డిస్ట్రిబ్యూటెడ్' విధానంలో ప్రయాణిస్తాయి. దీంతో రైలు ప్రయాణంలో కుదుపులు, శబ్దం కనిష్టస్థాయిలోనే ఉంటాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్‌ల కంటే వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లు పట్టాలపై తక్కువ ఒత్తిడి కలిగిస్తూ అధికవేగంతో ప్రయాణిస్తాయి. దీనివల్ల పట్టాల నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుందని రైల్వే ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది చివరినాటికి తొలి వందేభారత్ స్లీపర్ కోచ్‌ల రైలును పట్టాలెక్కించాలని రైల్వేశాఖ భావిస్తోంది.

నేటినుంచి సామర్లకోటలో వందేభారత్‌కు హాల్ట్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ జిల్లా సామర్లకోటలో గురువారం నుంచి వందేభారత్ రైలు ఆగనుంది. ఈ రైలు సామర్లకోట జంక్షన్‌లో ఒక్క నిమిషం ఆగేందుకు రైల్వేశాఖ అనుమతి ఇచ్చింది. ఈ రైలు హాల్ట్‌కు అనుమతి ఇవ్వాలన్న ప్రజల విజ్ఞప్తుల్ని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో 48 గంటల వ్యవధిలోనే వందేభారత్ రైలు హాల్ట్‌కు ఆమోదం లభించింది. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేస్తాం

విద్యుత్ సంస్థల యాజమాన్యాలు



పీఆర్సీపై విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలతో యాజమాన్యాల చర్చలు

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగుల జీతభత్యాలపై ఏర్పాటైన పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ)పై ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధ్యక్షతన బుధవారం సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చలు జరిగాయి. ఉద్యోగుల గరిష్ఠ మూలవేతనం సింగిల్ మాస్టర్ స్కేల్ రూ.2.27 లక్షలతో పాటు 5 శాతం ఫిట్‌మెంట్ బెనిఫిట్ ఇస్తామని విద్యుత్ సంస్థలు ప్రతిపాదించాయి. ప్రస్తుతం ఇస్తున్న గ్రాస్ శాలరీ తగ్గే పరిస్థితి వస్తే తగ్గకుండా చూస్తామని పేర్కొన్నాయి. కాంట్రాక్టు కార్మికులకు 2022 మినిమం స్కేల్ ఇవ్వాలని విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. అయితే 2018 స్కేల్ ఇస్తామని యాజమాన్యాలు చెప్పాయి. దీంతో ఏకాభిప్రాయం రాకపోవడంతో ప్రభుత్వం, విద్యుత్ సంస్థ యాజమాన్యాలు, ఉద్యోగుల జేఏసీ ఈ నెల 5న మరోసారి సమావేశమై చర్చించాలని నిర్ణయించాయి. పెండింగ్ డీఏలు, డీఏ బకాయిలు కూడా ఇవ్వాలని జేఏసీ కోరగా శనివారం జరిగే సమావేశంలో చర్చిస్తామని యాజమాన్యాలు హామీ ఇచ్చాయి. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ 2 (ఎనర్జీ అసిస్టెంట్)లను త్వరలో రెగ్యులర్ చేస్తామని తెలిపాయి. ఈ నెల 10న నిరవధిక సమ్మె చేపడతామని జేఏసీ ఇప్పటికే నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు మేలు జరిగేందుకు చేయాల్సిందంతా చేస్తామని యాజమాన్యాలు తెలిపాయి. ఉద్యోగులు ఆందోళన కొనసాగిస్తామనడం సమంజసం కాదన్నాయి. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు పృథ్వీతేజ్, కె.సంతోషరావు, జేఏసీ నేతలు పాల్గొన్నారు.

రుషికొండపై నిర్మాణాల వ్యవహారం ఎంవోఈఎఫ్‌కు

- హైకోర్టు సీజే ధర్మాసనం వెల్లడి
- తదుపరి చర్యలను ఎంవోఈఎఫ్ తేల్చడమే సబబని వ్యాఖ్య

సాక్షి, అమరావతి : విశాఖ రుషికొండపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాల్లో కొన్ని ఉల్లంఘనలు ఉన్నాయని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్) కమిటీ తేల్చిన నేపథ్యంలో, ఏం చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని కూడా ఎంవోఈఎఫ్‌కే అప్పగిస్తామని హైకోర్టు తెలిపింది. నిర్మాణాలకు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనల ప్రకారం ఎంవోఈఎఫ్ అనుమతులిచ్చినందున, ఉల్లంఘనలపైనా ఆ సంస్థే స్పందించడం సబబని అభిప్రాయపడింది. నిర్మాణాల దృఢత్వం కోసం కొండను తవ్వడం తప్పనిసరి అని భావించినప్పుడు ఆ మేరకు అనుమతులు తీసుకుని ఉంటే బాగుండేదని తెలిపింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన విస్తీర్ణం వరకే నిర్మాణాలను పరిమితం చేయాలని సూచించింది. తమ ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా పొందుపరుస్తామని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలోని రుషికొండపై చెట్ల నరికివేత, తవ్వకాలకు అనుమతులివ్వడాన్ని సవాలు చేస్తూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. రుషికొండపై నిర్మాణాల్లో ఉల్లంఘనలున్నట్లు ఎంవోఈఎఫ్ కమిటీ తేల్చిందని, ఆ నిర్మాణాలు కొనసాగించకుండా ఆదేశాలు జారీ చేయాలని మూర్తి యాదవ్ తరఫు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఇప్పుడు తీసుకోవాల్సిన చర్యలేమిటని ప్రశ్నించింది. అనుమతులను వెనక్కి తీసుకోవచ్చని మూర్తి చెప్పారు. ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులను ప్రాసిక్యూట్ చేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ స్పందిస్తూ.. నిర్మాణాలను 9.88 ఎకరాలకే పరిమితం చేశామన్నారు. నిర్మాణాల దృఢత్వం కోసం కొండను కొంత మేర ఏటవాలుగా తవ్వామన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ, ఇందుకు అనుమతులు తీసుకుని ఉండాల్సిందని తెలిపింది. ఉల్లంఘనలు, వాటిపై చర్యల విషయంలో అభిప్రాయం చెప్పేందుకు తామేమీ నిపుణులం కాదని స్పష్టంచేసింది. ఈ వ్యవహారాన్ని ఎంవోఈఎఫ్‌కే నివేదిస్తామని ధర్మాసనం తెలిపింది.

కొలిక్కివచ్చిన ఏపీఏటీ ఉద్యోగుల రిలీవింగ్

- రిలీవ్ చేసేందుకు హైకోర్టు అనుమతి

సాక్షి, అమరావతి: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఏపీ పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ) ఉద్యోగుల రిలీవింగ్ వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. హైకోర్టులో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఏపీఏటీ ఉద్యోగులను రిలీవ్ చేసేందుకు న్యాయస్థానం అనుమతినిచ్చింది. వారు తిరిగి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా శాఖల్లో చేరేందుకు అనుమతినిస్తున్నట్లు తెలిపింది. ఇందుకనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని సూచించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఏటీ రద్దు తర్వాత అక్కడి ఉద్యోగులు డిప్యుటేషన్‌పై హైకోర్టులో పనిచేస్తున్నారు. హైకోర్టులో పనిచేస్తున్న ఏపీఏటీ ఉద్యోగులను వివిధ శాఖలకు బదిలీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. దీనివల్ల హైకోర్టు కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతాయంటూ న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ పిల్ దాఖలు చేశారు. అలాగే తమను తిరిగి ప్రభుత్వ శాఖల్లోకి వెళ్లేందుకు అనుమతించాలంటూ పలువురు ఉద్యోగులు కూడా పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

రాజకీయాలకే నా ప్రాధాన్యత

- బీజేపీలో చేరిన సినీ నటి జయసుధ
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన తరుణ్‌ఛుగ్, కిషన్‌రెడ్డి, డీకే అరుణ
- బీజేపీలో చేరికపై సంవత్సరం నుంచి చర్చలు జరుగుతున్నాయన్న మాజీ ఎమ్మెల్యే
- క్రైస్తవుల గొంతు వినిపిస్తూనే ఉంటానని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: సినిమాల కంటే రాజకీయాలకే తన ప్రాధాన్యత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, సినీ నటి జయసుధ తెలిపారు. పేదలకు మంచిచేయాలి.. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశ్యం, పని చేయాలనే తపనతోనే బీజేపీలో చేరానని వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ ఛుగ్ పార్టీ సభ్యత్వ రశీదు అందించి కండువా కప్పి జయసుధను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తొమ్మిదేళ్ల మోదీ నాయకత్వంలో దేశం సాధించిన అభివృద్ధి చూసి, ప్రధాని విధానాలకు ఆకర్షితురాలినై మార్పు కోసం బీజేపీలో చేరానని చెప్పారు. తాను బీజేపీలో చేరేందుకు సంవత్సరం నుంచి చర్చలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సైతం కలిసి చర్చించానని చెప్పారు. ప్రజలకు మేలు జరగాలనే జాతీయ పార్టీలో చేరానని, క్రైస్తవుల గొంతు వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, జయసుధ చేరిక పార్టీకి మరింత ఉత్సాహం ఇస్తుందన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె తగిన సేవలందిస్తారని భావిస్తున్నట్లు తరుణ్ ఛుగ్ తెలిపారు.

ఏపీ ప్రభుత్వ న్యాయవాది బాలరాజు గౌడ్ మృతి



వట్‌పల్లి (అందోల్):సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) హైదరాబాద్ బెంచ్‌లో ఏపీ ప్రభుత్వం తరఫున పనిచేస్తున్న సీనియర్ న్యాయవాది మన్నె బాలరాజు గౌడ్ (55) బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతదేహాన్ని అంత్యక్రియల కోసం సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం సంగుపేటకు తరలించారు. బాలరాజు గౌడ్ చాలా కాలం నుంచి తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఆయన మృతితో సంగుపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. పలువురు న్యాయవాదులు, మిత్రులు, వివిధ పార్టీల నేతలు తమ సంతాపాన్ని తెలిపారు.

నేను మూర్ఖుడిని.. ఎవర్నీ వదలను: లోకేశ్

సాక్షి, నరసరావుపేట: 'నేను మూర్ఖుడిని.. తగ్గేదే లేదు. అందరి పేర్లూ ఎర్ర బుక్‌లో రాసుకుంటున్నా. ఎవర్నీ వదలను.. టీడీపీ అధికారంలోకి రాగానే వారందరికీ వడ్డీతో సహా చెల్లిస్తా' అంటూ వినుకొండలో జరిగిన బహిరంగసభలో టీడీపీ నేత నారా లోకేశ్ హెచ్చరించారు. యువగళం పాదయాత్ర బుధవారం పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం, పట్టణంలో సాగింది. కొంతమంది అధికారులు అధికారపార్టీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే వారిని జైలుకు పంపిస్తానని చెప్పారు. 2019–24 మధ్య ఎన్ని ఎక్కువ కేసులు నమోదైతే.. అధికారంలోకి వచ్చాక అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తానని టీడీపీ కార్యకర్తలకు లోకేశ్ సూచించారు. తాము అధికారంలోకి వస్తే వినుకొండను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పాదయాత్ర 2,300 కి.మీ పూర్తి చేసుకోనున్న సందర్భంగా గురువారం వరికపూడిశల ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకం వేస్తానని, అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే దానిని పూర్తి చేస్తామని చెప్పారు.

రాత్రి వేళ విమానాలు బంద్!



ఎయిర్‌పోర్టులో విమానం నైట్ ల్యాండింగ్ (ఫైల్)


- నవంబరు 15 నుంచి మార్చి వరకు..
- ఎయిర్‌పోర్టు రన్‌వేపై రీ-సర్ఫేసింగ్ పనులు
- పదేళ్లకోసారి వీటిని చేపట్టనున్న నేవీ అధికారులు
- రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల దాకా విమాన సర్వీసులు రద్దు
- మూసివేత సమయాన్ని తగ్గించాలని విమానాశ్రయ అధికారుల వినతి

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐదున్నర నెలలపాటు రాత్రి వేళ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆ సమయంలో పదకొండు గంటల పాటు విమానాల రాకపోకలు రద్దు కానున్నాయి. విశాఖ ఎయిర్‌పోర్టు నావికాదళం ఆధీనంలో ఉంది. నేవీ యుద్ధ విమానాలు, ఎయిర్‌క్రాఫ్టులు ఐఎన్‌ఎస్ డేగా రన్‌వే నుంచే కార్యకలాపాలు సాగిస్తాయి. పౌర విమానాలు కూడా ఐఎన్‌ఎస్ డేగా నియంత్రణలో ఉన్న ఈ రన్‌వే మీదుగానే ల్యాండింగ్, టేకాఫ్‌లు జరుగుతాయి. నావికాదళం ప్రతి పదేళ్లకోసారి తమ రన్‌వేలకు రీ-సర్ఫేసింగ్ పనులను చేపడుతుంది. ఈ ప్రక్రియలో రన్‌వేపై మూడు పొరలను తొలగించి మళ్లీ కొత్తగా వేస్తారు. ఇంకా అవసరమైన ఇతర పనులు చేపడతారు. ఐఎన్‌ఎస్ డేగాలో 2009లో రీ-సర్ఫేసింగ్ నిర్వహించారు. పదేళ్ల తర్వాత అంటే.. 2019లో మరోసారి నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటివరకు జరగలేదు. ఈ ఏడాది ఈ రీ-సర్ఫేసింగ్‌ను నవంబర్ 15 నుంచి మార్చి నెలాఖరు వరకు నిర్వహించాలని నిర్ణయించారు. **ఈ పనులను రాత్రి 9 గంటల నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు చేపడతారు. అందువల్ల ఆ సమయంలో ఈ రన్‌వేను మూసివే**స్తారు. దీంతో ఈ 11 గంటల్లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తారు. ఫలితంగా దాదాపు 12 విమాన సర్వీసులకు అంతరాయం కలగనుంది. వీటిలో సింగపూర్ వెళ్లే ఏకైక అంతర్జాతీయ సర్వీసుతో పాటు ఢిల్లీ, హైదరాబాద్, పుణె, బెంగళూరు, కోల్‌కతా విమానాలున్నాయి. ఈ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం రోజుకు 30 టేకాఫ్‌లు, 30 ల్యాండింగులు జరుగుతున్నాయి.

పర్యాటక సీజను వేళ

ఏటా అక్టోబర్ నుంచి పర్యాటక సీజను ప్రారంభమవుతుంది. ఈ సీజనులో వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా ఐదారు నెలల పాటు విమానాలకు పర్యాటకుల రద్దీ కొనసాగుతుంది. సాధారణంగా వింటర్ సీజనులో పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ షెడ్యూళ్లను పెంచుతుంటాయి. కానీ ఈ ఏడాది వింటర్ పీక్ సీజనులో రీ-సర్ఫేసింగ్ మొదలవుతుండడంతో రాత్రి పూట విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. అదనపు షెడ్యూళ్లు పెంచడానికి బదులు తగ్గే అవకాశాలున్నాయి. నేవీ రీ-సర్ఫేసింగ్ దృష్ట్యా తమ సర్వీసుల షెడ్యూల్ వేళల్లో తగిన మార్పులు చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత విమానయాన సంస్థలకు సూచిస్తున్నారు.

మూసివేత సమయం తగ్గించాలని కోరాం..



రీ-సర్ఫేసింగ్‌లో భాగంగా ఐఎన్‌ఎస్ డేగా రన్‌వేను నవంబరు 15 నుంచి మార్చి ఆఖరు వరకు రాత్రి వేళ 11 గంటల సేపు మూసివేయనున్నట్టు నేవీ నుంచి సమాచారం అందింది. దీనివల్ల రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల మధ్య విమానాల రాకపోకలు సాగించే వీలుండదు. ఆ సమయంలో 12 ముఖ్య విమాన సర్వీసులు రద్దవుతాయి. అందువల్ల రాత్రి 10.30 నుంచి మర్నాడు 6.30 గంటల వరకు (8 గంటలు) రన్‌వే మూసివేత సడలించాలని నేవీ ఉన్నతాధికారులను కోరాం. దానిపై ఇంకా ఏ సమాచారం లేదు. నేవీ రీ-సర్ఫేసింగ్ విషయాన్ని మా ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రధాన కార్యాలయానికి నివేదించాం. అలాగే రీ-సర్ఫేసింగ్ నేపథ్యంలో షెడ్యూళ్లను సర్దుబాటు చేసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించాం.

– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం

ఒడిశాకు మరిన్ని సర్వీసులు!

- కొత్తగా విశాఖ నుంచి ఏడు బస్సులు
- ఇకపై అక్కడ నైట్ హాల్టులకూ వీలు
- ట్యాక్స్, పర్మిట్ల భారం నుంచి వెసులుబాటు
- ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన కొత్త ఒప్పందం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం నుంచి ఒడిశాకు ఆర్టీసీ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ నుంచి ఆ రాష్ట్రానికి 14 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇకపై కొత్తగా మరో ఏడు బస్సులను ప్రవేశపెట్టేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందంతో బస్సుల సంఖ్య పెంచేందుకు వీలవుతోంది. దీంతో ఒడిశాలోని జైపూర్, నవరంగ్‌పూర్, ఒనకఢిల్లీ, పర్లాకిమిడిలకు ఒక్కోటి చొప్పున, గుణుపూర్‌కు మూడు బస్సులను కొత్తగా నడపనున్నారు. ప్రస్తుతం గుణుపూర్‌కు మూడు, జైపూర్‌కు మూడు, పర్లాకిమిడికి రెండు, రాయగడకు ఒకటి, ఒనకఢిల్లీకి ఒకటి, దామన్‌జోడికి రెండు, నవరంగ్‌పూర్‌లకు రెండు చొప్పున నడుస్తున్నాయి. కొత్తగా ప్రారంభించబోయే వాటితో విశాఖ నుంచి ఒడిశాకు నడిచే బస్సుల సంఖ్య 21కి చేరనుంది. ఈ సర్వీసులను వివిధ ప్రాంతాల వారికి అనువుగా ఉండేలా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మీదుగా వేర్వేరు రూట్లలో నడుపుతారు. ఈ రూట్లలో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సర్వీసులను మాత్రమే తిప్పుతారు. ఈ కొత్త సర్వీసులను నిజ శ్రావణ మాసంలో ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

తప్పనున్న పన్నుల భారం

ఇన్నాళ్లూ మన ఆర్టీసీ బస్సులు ఒడిశాలో తిరగాలంటే ఆ రాష్ట్రంలో కూడా పన్నులు చెల్లించాల్సి వచ్చేది. అంతేకాదు.. ఎన్నిసార్లు తిరిగితే అన్ని సార్లూ పర్మిట్లు పొందాలి. దీనివల్ల మన ఆర్టీసీకి ఆర్థికంగా భారమయ్యేది. అయినప్పటికీ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఒడిశాకు బస్సులు నడుపుతున్నారు. ఒప్పందంలో భాగంగా ఇకపై ఏ రాష్ట్రం బస్సులు ఆ రాష్ట్రంలో పన్నులు చెల్లిస్తే చాలు. పైగా ఒక పర్మిట్‌తో ఎన్ని ట్రిప్పులైనా తిరగవచ్చు. ఇలా పన్నులు, పర్మిట్ల భారం నుంచి ఏపీఎస్‌ఆర్టీసీకి వెసులుబాటు కలగనుంది.

ఇకపై నైట్ హాల్టులకు వీలు

ఇన్నాళ్లూ ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులు ఒడిశాలో నైట్ హాల్టు చేసేందుకు అనుమతి లేదు. అందువల్ల ఏ బస్సైనా రాత్రికి తిరిగి వచ్చేయాల్సి వస్తోంది. కొత్త ఒప్పందం ప్రకారం ఇకపై ఒడిశాలో మన బస్సులు రాత్రి వేళ నైట్ హాల్టు చేసేందుకు వీలుంటుంది. దీంతో రాత్రి నైట్‌అవుట్‌కు వీలు కానందున ఇప్పటిదాకా ఒడిశాకు ఉదయం పూట బయల్దేరి సాయంత్రానికి/రాత్రికి వచ్చేసేవి. ఇక మీదట నైట్ హాల్టు వెసులుబాటుతో పగలు, రాత్రిళ్లు కూడా విశాఖ నుంచి ఒడిశాకు నడపనున్నారు. ఫలితంగా ఒడిశా నుంచి ఆస్పత్రులు, వ్యాపారాల పనులపై ఉదయాన్నే బయల్దేరి అక్కడ నుంచి విశాఖ చేరుకోవడానికి, ఇక్కడ పనులు ముగించుకుని సాయంత్రం, రాత్రి బస్సుల్లో తమ ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో ఉపయుక్తంగా ఉండనుందని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

ఆదర్శప్రాయుడు బళ్లారి రాఘవ

- రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాఘవ ప్రశస్తుల ప్రదానం
- తలెదెండ సామాజిక కన్నడ నాటకం ప్రదర్శన



బళ్లారి రాఘవ రాష్ట్ర, జిల్లా ప్రశస్తిని పొందిన కళాకారులతో నిర్వాహకులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాఘవ అసోసియేషన్ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: నాటక రంగంలో నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ ఆదర్శ ప్రాయుడని బళ్లారి రాఘవ మెమోరియల్ అధ్యక్షుడు కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు స్థానిక రాఘవ కళామందిరంలో బళ్లారి రాఘవ 143వ జయంతిని, రాఘవ ప్రశస్తుల ప్రదానం, నాటకోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. షేక్స్‌పియర్ రచించిన నాటకాల్లో ప్రేక్షకులను మైమరపించేలా నటించిన ఘనత బళ్లారి రాఘవకే దక్కిందన్నారు. అనంతరం మాజీ ఉపాధ్యక్షులు ఎన్.బసవరాజ్ మాట్లాడుతూ నవరసాలను ఆంగ్ల, తెలుగు నాటకాల్లో అద్వితీయంగా పలికించి బళ్లారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన అజరామరుడు బళ్లారి రాఘవ అన్నారు. ఊరి పేరును తన నామంతో సార్థకం చేసుకుని విశ్వ నటభూషణుడిగా రక్తికట్టించాడన్నారు. నాటకం రంగం ఉన్నంత వరకు బళ్లారి రాఘవ చిరస్మరణీయుడన్నారు. ఈసందర్భంగా బాగలకోటె జిల్లా ఇళకల్‌కు చెందిన ఉమారాణి మారిగిడద బళ్లారి రాఘవ రాష్ట్ర ప్రశస్తిని అందుకున్నారు. బళ్లారికి చెందిన కే.ఓంకారమ్మ, పీఎం.నటరాజ్ జిల్లా ప్రశస్తులను దక్కించుకున్నారు. నిర్దేశకులు మహదేవయ్య, డాక్టర్ గిరీష్ కార్నాడ్ రచించిన తలెదెండ సామాజిక నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కే.చెన్నప్ప, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ పాటిల్, కార్యదర్శి ఎస్.ప్రకాష్, కోశాధికారి ధనుంజయ్య, సంయుక్త కార్యదర్శి ఎం.రామాంజినేయలు, రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

నాటక రంగానికి సేవలు భేష్



రాఘవ విగ్రహానికి పూలమాల వేసిన నేతలు

బళ్లారి టౌన్: నాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలు అపారమని బ్రాహ్మణ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, సమాఖ్య జిల్లాధ్యక్షుడు ఆర్.ప్రకాశ్‌రావు, కళాకారులు జీఆర్ వెంకటేశ్వర పేర్కొన్నారు. బుధవారం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో రాయల్ సర్కిల్‌లో రాఘవ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలార్పణ చేసి మాట్లాడారు. కన్నడ, తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వేసిన నాటకాల్లో కీలక పాత్రలు పోషించి విదేశాల్లోను మన దేశ కీర్తిని చాటారని కొనియాడారు. కళాకారులు, ఇతర అభిమానులు రాఘవ విగ్రహాన్ని రాయల్ సర్కిల్‌లో ప్రతిష్ఠించడం వల్ల ఎంతో మేలు చేసినట్లయిందన్నారు. కార్యక్రమంలో పదాధికారులు శ్రీనాథ్, రవీంద్రనాథ్, హరిప్రసాద్, గిరి, నేమకల్‌రావు, సతీష్, నందకిషోర్, కళాకారులు జగదీశ్, నాగభూషణ పాల్గొన్నారు.

జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న గ్రామ ప్రముఖులు

బళ్లారిఅర్బన్: కొర్లగుంది జీపీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షులు దొడ్డ కేశవరెడ్డి తెలిపారు. బుధవారం కొర్లగుంది జీపీలో 18 మంది సభ్యులు కలిసి గ్రామస్తుల సమక్షంలో ముందుగానే చర్చించుకున్న ప్రకారం దొడ్డ కేశవరెడ్డి కుమారుడు వీ.రాఘవరెడ్డిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షురాలుగా చలువాది మరియమ్మను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారి యోగేశ్వర్, పీడీఓ ప్రకాష్ అమరశెట్టిల సమక్షంలో జీపీ సభ్యులు కలిసి ఏకగ్రీవంగా తన కుమారుడిని అధ్యక్షునిగా ఎన్నుకోవడంతో పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, రైస్‌మిల్ ఈరప్పయాదవ్, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భీమరెడ్డి, బీ.మారెప్ప, సన్నమారెప్ప, బసరకోడు హొన్నూరప్ప, బైలూరు వెంకటేష్, రామచంద్ర, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఉపకాలువలకు నీరివ్వండి



జిల్లాధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నేతలు

సాక్షి,బళ్లారి: తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీల గుండా వెళుతున్న ఆంధ్రప్రదేశ్ కోటా నీటిలో నుంచి కర్ణాటక పరిధిలోని ఉపకాలువలకు కూడా కనీసం మంచినీటి కోసమైనా నీరు విడుదల చేయాలని తుంగభద్ర రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ ఆధ్వర్యంలో జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాను కలిసి ఉపకాలువలకు నీరు వదిలితే మంచినీటి చెరువులను నింపుకునేందుకు వీలవుతుందన్నారు. మంచినీటి కోసం జనం ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. డ్యాం భర్తీ కావస్తున్నందున కాలువలకు నీరు విడుదల చేసినా కర్ణాటక కోటా కింద నీరు ఇవ్వకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు రైతుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వరినారు పోసుకుని నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, అయినా ఉపకాలువలకు నీరు విడుదల చేయడంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటిని విడుదల చేయకపోతే రైతులు పంటలు సాగు చేయడం కష్టతరంగా మారుతుందని, తక్షణం కర్ణాటక కోటా కింద నీరు సరఫరా చేయాలని కోరారు.

సేవా భద్రతకు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాస్

రాయచూరు రూరల్: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా భద్రత కల్పించాలని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత 15 ఏళ్లుగా 10 వేల మందికి పైగా అతిథి అధ్యాపకులు సేవలు అందిస్తున్నారన్నారు. పంజాబ్, హరియాణ, ఆంధ్రప్రదేశ్, న్యూఢిల్లీలో 12 నెలల విధులకు నెలకు రూ.50 వేల చొప్పున వేతనం అందిస్తున్నారన్నారు. బకాయి పడిన వేతనాలను చెల్లించాలన్నారు. తొలగించిన అధ్యాపకులను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలన్నారు.

అంజనాద్రికి రైల్వేను అనుసంధానిస్తాం

- ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి రూరల్: తాలూకాలోని అంజనాద్రిని సందర్శించుకునే భక్తుల కోసం గంగావతి రైల్వే స్టేషన్‌కు దేశంలో ఉండే పవిత్ర పుణ్యక్షేత్రాలతో రైల్వే అనుసంధానం చేసే దిశగా సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల విశ్వాసాన్ని తీసుకొని ముందడుగు వేస్తామని ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం గంగావతి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వేదికలో ఆనాటి జ్ఞాపకాలను ప్రస్తావించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ 2008లో యడియూరప్ప ప్రభుత్వంలో ఆనాడు పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న గాలి జనార్దన్ రెడ్డి దరోజీ నుంచి బాగలకోటే రైలు మార్గ నిర్మాణానికి రూ.350 కోట్ల గ్రాంట్ మంజూరు చేయించారన్నారు. ఆనాటి నుండి ఇప్పటి వరకు దరోజీ నుంచి బాగలకోటె వరకు రైలు మార్గం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ ప్రయత్నంలో భాగంగా భూ సర్వేకు రూ.90 లక్షలు మంజూరయ్యాయన్నారు.ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి సంబంధిత అధికారులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఈ పనులను మరింత వేగవంతం చేయించాలని కోరారు. రైల్వే పోరాట సమితి సభ్యులతో పాటు కేఆర్‌పీపీ రాష్ట్రాధ్యక్షుడు భీమాశంకర్ గౌడ, జిల్లా అధ్యక్షుడు మనోహర్ గౌడ, శివణ్ణ, యువ ఘటక అధ్యక్షులు యమనూర్ చౌడ్కి, రాజేశ్ రెడ్డి, యమనూరప్ప పుండలీక, జిలాని పాషా, ముస్తాక్ అలీ, హుసేన్ బాష తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై సీఎం సానుకూల స్పందన

నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం నగరంలో పాత్రికేయులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాల నిధులు మంజూరు చేస్తానని సీఎం హామీ ఇచ్చారన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల ధర్నా



కంప్లి: వేళకు సరిగా బస్సులు నడపాలని విద్యార్థులు, ఉద్యోగులు కొత్త బస్టాండ్ వద్ద ఆకస్మికంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంపత్‌కుమార్, శాంత తదితరులు మాట్లాడుతూ సకాలంలో బస్సులు లేక పాఠశాల, కళాశాలల విద్యార్థులు నిత్యం నరకం అనుభవిస్తూ విద్యలో వెనుకబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి కార్యాలయాలకు వెళ్లడం కష్టమైందని ఉద్యోగులు వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్‌ను కలిసి బస్సుల అసౌకర్యంపై వివరించగా, ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

తహసీల్దార్‌గా సురేష్ వర్మ



సురేష్ వర్మను అభినందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: చెన్నమల్లప్ప ఘంటికి దేవదుర్గకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నూతన తహసీల్దార్‌గా సురేష్ వర్మ నియమితులయ్యారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాలూకాలో గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన పనులు చేయడానికి సత్వరం స్పందించాలని, ప్రభుత్వం అమలు చేసిన ఐదు గ్యారంటీ పథకాలపై ప్రజలకు సహకరించాలని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఆదేశించామన్నారు.

చిత్రదుర్గలో ప్రబలిన అతిసార

సాక్షి,బళ్లారి: చిత్రదుర్గలో కలుషిత నీరు తాగి ఆస్పత్రిలో చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మంగళవారం కలుషిత నీరు తాగి మంజుల(23) అనే మహిళ, రఘు(27) అనే వ్యక్తి మృతి చెందడంతో పాటు 20 మంది ఆస్పత్రిలో చేరగా, బుధవారం 80 మందికి పైగా కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కలుషిత నీరు తాగి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్రదుర్గలోని కవాడిగరహట్టి కాలనీలో ట్యాంకర్ నీరు తాగడం వల్ల కాలనీ వాసులకు వాంతులు, విరేచనాలయ్యాయని స్థానికులు మండిపడ్డారు. మున్సిపాలిటీ అధికారులు మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయించకపోవడంతో నీరు కలుషితమై అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన చెందారు.

క్లుప్తంగా

సాఫీగా గృహలక్ష్మి నమోదు

- కేంద్రాల వద్ద తగ్గిన రద్దీ



సిద్ధార్థనగర్‌లో పేరు నమోదు చేస్తున్న మహిళ

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఐదు గ్యారంటీల్లో ఒకటైన గృహలక్ష్మి పథకం కింద మహిళల పేర్ల నమోదుకు గత నాలుగు రోజుల నుంచి నగరంలో ఆయా వార్డుల్లో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేయడంతో గృహలక్ష్మి నమోదు సాఫీగా సాగుతోందని సంబంధిత అధికారి తెలిపారు. బుధవారం గృహలక్ష్మి నమోదు కేంద్రాల వద్ద మహిళలు ఇబ్బందులు లేకుండా పేర్లు నమోదు చేయించుకున్నారు. సెంటర్ వద్దకు వచ్చిన 10 నిమిషాల్లోపే అర్హత కలిగిన మహిళల పేర్ల నమోదు జరుగుతోందని కేంద్రం సిబ్బంది సురేష్ తెలిపారు.

గృహలక్ష్మికి 2.50 లక్షల మంది నమోదు

హుబ్లీ: ధార్వాడ జిల్లాలో గృహలక్ష్మి పథకం కింద 4,16,582 మంది లబ్ధిదారులకు గాను గత నెల 31వ తేదీ వరకు 2,52,280 మంది లబ్ధిదారులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఇంకా 1,64,302 మంది పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉందని జిల్లాధికారి గురుదత్త హెగ్డే ఓ ప్రకటనలో తెలిపారు.

కన్న తల్లిని, మాతృ భూమిని మరువరాదు



మాట్లాడుతున్న గాలి సోమశేఖర్‌రెడ్డి

బళ్లారిటౌన్: కన్న తల్లిని, మాతృ భూమిని ఎప్పటికీ మరువరాదని మాజీ ఎమ్మెల్యే జీ.సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కన్నడ సాహిత్య పరిషత్, శ్రీమేధా డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో దివంగత రుక్మిణమ్మ, చెంగారెడ్డిల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన దత్తి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. కన్న తల్లి ఒడిని, మాతృ భూమిని స్వర్గంగా భావించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్, లెక్చరర్ జీ.శామ్ మూర్తి, నేతలు వీరశేఖర్‌రెడ్డి, సునీత, జ్యోతి ప్రకాష్, చోరనూరు కొట్రప్ప, రిటైర్డ్ ఎస్ఐ హుస్సేన్‌సాబ్, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

ఆ ఇంజినీర్ నియామకం వద్దు

రాయచూరు రూరల్: విభాగ గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్‌గా సయ్యద్ ఫజుల్ మహ్మద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఉప సంహరించుకోవాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. అక్రమ సంపాదనతో లోకాయుక్త అధికారుల వలలో చిక్కిన అధికారిని రాయచూరుకు నియమించడంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. కొప్పళలో విధులు నిర్వహించిన మహ్మద్ నిజస్వరూపం కనబడడంతో సర్కార్ సస్పెండ్ చేసి రాయచూరుకు కేటాయిస్తూ చేసిన బదిలీని రద్దు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

బిడ్డకు తల్లి పాలు శ్రేష్టం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేష్టమని చంద్రబండ పీహెచ్‌సీ వైద్యాధికారి సంగమేష్ పేర్కొన్నారు. బుధవారం తాలూకాలోని చంద్రబండ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ప్రపంచ స్తన్యపాన దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు అమృతంతో సమానమన్నారు. కాగా నగరంలోని మావినకెరె పీహెచ్‌సీలో తాలూకా అధికారి షాకీర్, వైద్యాధికారి విజయ్ ప్రపంచ స్తన్య పాన దినోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేష్, కృష్ణవేణి, రవిలున్నారు.

గంజాయి చాక్లెట్ల విక్రేతల అరెస్ట్



పట్టుబడిన విక్రేతలతో పోలీసులు

రాయచూరు రూరల్: నగరంలో చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్న ముఠాను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. రూ.30, రూ.50, రూ.100లకు ఆరు గ్రాముల బరువుతో కూడిన చాక్లెట్(మిఠాయి) రూపంలో విక్రయాలు నడుస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ మాదిరిగా రాయచూరులో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో మార్కెట్ యార్డు పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారులు కలిసి లాల్ బహద్దూర్ శాస్త్రినగర్, పరిశ్రమల కేంద్రాల్లో పాషా, శ్రీఆనంద్ మునక పేర్లతో తయారైన 480 చాక్లెట్లను స్వాధీనం చేసుకొని, వాటిని సరఫరా చేస్తున్న రాచయ్య స్వామి, అమరయ్యలను అరెస్ట్ చేశారు. ఈ చాక్లెట్ల తయారీదారుల ఆచూకీ కోసం ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీపీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రాయచూరు రూరల్: యాపలదిన్ని జీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఈ ఘటనలో కంప్యూటర్, రికార్డులు, ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయింది. మొదట పైఅంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు అంటుకోగా, అనంతరం కింది భవనానికి అంటుకోవడంతో గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఘటనపై యాపలదిన్ని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రూ.10.30 లక్షల మేర వంచన

హుబ్లీ: హుబ్లీ ధార్వాడలో ఇద్దరు వ్యక్తులకు ఇంట్లో కూర్చొనే అధిక లాభాలు గడించవచ్చని నమ్మించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.10.30 లక్షల మేర వంచించిన ఘటన హుబ్లీ సైబర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. ధార్వాడ జబుల్లా ముల్లా నుంచి రూ.4.35 లక్షలు, హుబ్లీ బైరదేవరకొప్పలో అమిత్ రొల్లి అనే వ్యక్తి నుంచి రూ.5.95 లక్షలను తమ ఖాతాల్లోకి బదలాయించుకొని వంచించారు. తాము పంపించే వీడియాలకు లైక్‌లు, షేర్లు, పాజిటివ్ కామెంట్లు చేస్తే చాలు లాభాలు వస్తాయని నమ్మించారు. ఇందులో మొదట్లో కొంత మేర లాభాలు చూపినట్లుగా నటించి ఆ తర్వాత రూ.10 లక్షలకు పైగా సొమ్ములు బదలాయించుకున్నారు.

'ఉన్నతి'తో విద్యార్థులకు లబ్ధి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ హేమంత్

కంప్లి: ఇకపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు తాలూకా కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితిని తప్పించేందుకు ఉన్నతి యోజన ఎంతో ఉపయోగపడుతుందని బళ్లారి ఉప విభాగ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.హేమంత్ తెలిపారు. తాలూకా సభాంగణంలో మాట్లాడుతూ ఎలాంటి అడ్డంకులు లేని విద్య అందించడం ఉన్నతి యోజన ముఖ్య ఉద్దేశం అన్నారు. ఆర్టికల్-371కు సంబంధించిన ప్రమాణ పత్రాలు అందించేందుకు కళాశాలల వారి అర్జీలు పొంది కళాశాల విద్యార్థులకు అందించామన్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ గౌసియాబేగం, ముఖ్యాధికారి దురుగణ్ణ, శిరస్తేదార్ పంపాపతి, రమేష్, రెవెన్యూ అధికారి జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారం భూమి రద్దుకు కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ

హొసపేటే: నగరలోని శివార్లలోని జంబునాథ ఏరియాలో గత బీజేపీ ప్రభుత్వం చక్కెర కర్మాగారం కోసం కేటాయించిన సుమారు 86 ఎకరాల భూమిని రద్దు చేయమని ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప జిల్లాధికారి దివాకర్‌కు లేఖ రాశారు. చిత్తవాడ్గి ఏరియాలో ఉన్న ఐఎస్‌ఆర్ చక్కెర కర్మాగారం సాంకేతిక లోపం వల్ల గత కొన్నేళ్లుగా మూతపడిన విషయం తెలిసిందే. తుంగభద్ర జలాశయ ఆయకట్టు కింద ఉన్న రైతులు ప్రతి ఏటా ఈ భాగంలో 4 లక్షల టన్నులకు పైగా చెరుకును పండిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంతకు ముందు అధికారంలో ఉన్న మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ తిరిగి నూతన చక్కెర కర్మాగారం నిర్మాణానికి జంబునాథ ఏరియా వద్ద భూమిని కేటాయించారన్నారు. కానీ ప్రస్తుతం ఆ భూములను అధికార పార్టీ ఎమ్మెల్యే రద్దు చేయాలని లేఖ రాయడంతో నగరంలో చర్చనీయంగా మారింది.

నిలకడగా తుంగభద్ర వరద

హొసపేటే: తుంగభద్ర డ్యాంలోకి ఎగువన ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో డ్యాంలోకి వస్తున్న వరద నిలకడగా ఉంది. బుధవారం డ్యాంలోకి ఇన్‌ఫ్లో 28,600 క్యూసెక్కుల వరద చేరడంతో నీటి నిల్వ 81.540 టీఎంసీలకు చేరింది. రైతుల జీవనాడి అయిన తుంగభద్ర డ్యాంలో ప్రస్తుత నీటిమట్టం 1626.51 అడుగులు, ఔట్‌ఫ్లో 2099 క్యూసెక్కులు ఉందని మండలి అధికారులు తెలిపారు.

ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఎంపిక



తాను సాధించిన మెడల్‌తో దిశా

కంప్లి: కంప్లి నివాసి మోహన్‌కుమార్ దానప్ప, సౌమ్యల పుత్రిక దిశా భారతీయ సాంప్రదాయ అలంకార దుస్తులతో డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొని ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. జులై 11న జరిగిన ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి 10 ఏళ్లలోపు 12600 మంది పాల్గొన్నారు. దిశా మోహన్ ప్రస్తుతం బెంగళూరులోని జేడీబీసీ పాఠశాలలో ఎల్‌కేజీ విద్యాభ్యాసం చేస్తోంది. దేశపు అతిపెద్ద ఫ్యాన్సీ డ్రెస్ డ్రైవ్‌లో దిశా వేసుకున్న దుస్తులు, నగుమోము తదితర ప్రేరణలను గమనించి న్యాయనిర్ణేత సర్వోచ్ఛ రికార్డ్ ప్రమాణ పత్రాలను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థాపకులు, సంపాదకులు డాక్టర్ కే.వివేకానందబాబు ప్రమాణపత్రం అందించారు. ఈ సందర్భంగా కోర్టు న్యాయవాది డాక్టర్ జీవీ ఎస్‌ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ ఎంపిక చేయడం గమనార్హం.

కోలారు వార్తలు...

చిక్కతిరుపతి హుండీ ఆదాయం లెక్కింపు

- రూ.84.20 లక్షల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ లభ్యం



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మాలూరు: చారిత్రక ప్రసిద్ధ యాత్రాస్థలం చిక్కతిరుపతి శ్రీప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో బుధవారం గత నాలుగు నెలలుగా హుండీకి వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. లెక్కింపులో మొత్తం రూ.84,22,955 నగదు, అపార ప్రమాణంలో బంగారు, వెండి ఆభరణాలు లభించాయి. ఆలయ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో సంగ్రహం కావడం ఇదే మొదటిసారి అని, ప్రభుత్వం తెచ్చిన శక్తి పథకం వల్లనే ఇది సాధ్యమైందని ఆలయ సిబ్బంది అంటున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో గత నాలుగు నెలలుగా ఆలయానికి వచ్చారని అంటున్నారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం హుండీ లెక్కింపును చేపట్టారు. ఆలయంలో మూడు హుండీలను దేవదాయ శాఖ తహసీల్దార్ సుజాత, పద్మావతి, తహసీల్దార్ కె రమేష్, ఈఓ టి.సెల్వమణి సమక్షంలో లెక్కించారు. భక్తులు నగదుతో పాటుగా 72 గ్రాముల బంగారం, 425 గ్రాముల వెండి, అమెరికా, జపాన్, ఇంగ్లండ్ తదితర దేశాల కరెన్సీలు లభ్యమయ్యాయి. భక్తులు చిరిగిన కరెన్సీ నోట్లను కూడా హుండీలో వేయడం విశేషం. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధించిన వేయి రూపాయల నోట్లు కూడా లభ్యం కావడం గమనార్హం.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: తాలూకా కార్యాలయ సిబ్బంది పని తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రూపా శశిధర్ రెవెన్యూ శాఖ శిరస్తేదార్ సురేష్‌పై మండిపడ్డారు. బుధవారం తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలన సమావేశంలో ఆమె మాట్లాడారు. తాలూకా కార్యాలయంలో అధికారులు లంచం లేనిదే ఏ పనీ చేయడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇకనైనా మానవత్వంతో పని చేయడం నేర్చుకోండని హితవు పలికారు. తాలూకాలో వేల ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు రక్షించాలని, ఆ దిశగా నామఫలకాలు వేయాలని సూచించారు. సమావేశంలో టీపీ ఈఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో కన్నడను రక్షించాలి

కేజీఎఫ్: సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ భాషను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీపీ అధ్యక్షురాలు మంజులా మహదేవ్ తెలిపారు. బుధవారం బంగారుపేట తాలూకా కదరినత్త గ్రామంలో నిర్వహించిన గడినాడు సాంస్కృతిక ఉత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సరిహద్దు భాగంలో ఇతర భాషల వారి ప్రభావం, ఆంగ్ల భాషపై వ్యామోహం వల్ల కన్నడ భాష వెనుకబడుతోందన్నారు. అయితే సరిహద్దుల్లో నిరంతరంగా కన్నడ భాషా సాహిత్యం, సంస్కృతిని పెంపొందించే ప్రయత్నాలు జరగాలన్నారు. జిల్లాలో కన్నడ భాష మనుగడకు ఎలాంటి భంగం కలుగకుండా జాగ్రత్త పడాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నివృత్త జిల్లా వయోజన విద్యాధికారి నరసింహయ్య, మంజులా జయణ్ణ, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి

శ్రీనివాసపురం: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని, గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని దాత భీమగుంటపల్లి బీవీ శివారెడ్డి తెలిపారు. బుధవారం తాలూకాలోని రాయల్పాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫిర్కా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు విద్యతో పాటు క్రీడలు కూడా భాగం కావాలన్నారు. క్రీడలతో విద్యార్థుల్లో అభ్యసనం సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మనస్సు ఏకాగ్రతతో ఉండి అభ్యసనానికి సహకరిస్తుందన్నారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తే ప్రభుత్వ శాఖల్లో ఉన్నత ఉద్యోగాలను పొందడానికి సహాయకారి అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మామిడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నీలటూరు చిన్నప్పరెడ్డి, జీపీ ఉపాధ్యక్షుడు వైఆర్ శ్రీనివాసరెడ్డి, వెంకటశివారెడ్డి, ఈసీఓ హనుమేగౌడ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పట్టు ఉత్పత్తికి సూచన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: రోగరహిత నాణ్యమైన పట్టును ఉత్పత్తి చేయాలని పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ టీఎం కాళప్ప సూచించారు. బుధవారం నగరంలో పట్టు ఉత్పత్తిలో సామర్థ్య వృద్ధిపై శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టు వ్యవసాయంలో రైతుల కోసం కేవీకేలో ప్రతి నెలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. వ్యవసాయంలో వాతావరణ వైపరీత్యాల వల్ల కలిగే సమస్యల నివారణకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పట్టు వ్యవసాయంలో కనిపిస్తున్న రోగాల నియంత్రణపై అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. పట్టు వ్యవసాయంలో కీటనాశకాలను ఎంత ప్రమాణంలో ఉపయోగించాలనే విషయాన్ని రైతులు తెలుసుకోవాలన్నారు. ఈ విషయంపై రైతులు శాస్త్రవేత్తలతో సమాలోచనలు జరపాలన్నారు. పట్టు పురుగుల పెంపకానికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం, డ్రిప్ ఇరిగేషన్‌కు ఇస్తున్న సహాయధనాన్ని పట్టు పరిశ్రమ శాఖ అధికారులను సంప్రదించి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ప్రముఖుడు ఎస్ఎన్ శ్రీనివాస్, విజ్ఞాని డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోలారు: కోలారు బ్రాహ్మణ సంఘం తరపున టెన్త్, ఇంటర్ పరీక్షల్లో 2022-23వ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా భర్తీ చేసి నగరంలోని పీసీ కాలనీలో ఉన్న బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో అందించాలని సంఘం కార్యదర్శి జేఎన్ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు.

యోగా ప్రాణాయామంతో మెరుగైన ఆరోగ్యం

శ్రీనివాసపురం: యోగా, ప్రాణాయామంతో ఉత్తమ ఆరోగ్యాన్ని పొందవచ్చని, తద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని ఐసిరి హీలింగ్ సెంటర్‌కు చెందిన హీలర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వాసవి కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య జాగృతి కార్యక్రమంలో మాట్లాడారు. ఐసిరి హీలింగ్ సెంటర్ నుంచి ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.